WWW.nindam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం, జూన్ 18, 2024 | సంపుటి - 20 | సంచిక 278 | వెల - 6 | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

### యువకుడిని బలితీసుకున్న

## ఆన్‌లైన్ బెట్టింగ్

**మెదక్,జూన్17(నినాదం):**

ఆన్‌లైన్ బెట్టింగ్ మరో యువకుడి ప్రాణాలు తీసింది. ఆర్థికంగా నష్టపో యిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా రామాయంపేటలో జరిగింది. మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన దొమ్మాట భానుప్ర సాద్ (24) అనే యువకుడు గత కొన్నిరోజులుగా ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడుతు న్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడిన భాను ప్రసాద్ రూ.1.50 లక్షలు పోగొట్టు కున్నాడు. పైగా తెలిసిన వారి వద్ద అప్పులు కూడా చేశాడు. పెట్టిన డబ్బులన్నీ పోవడంతో మన స్తాపానికి గురైన యువకుడు

▸▸ 2లో..

### ఇక సొంతంగానే కరెంట్

## బిల్లుల చెల్లింపు

**అసోం సిఎం హిమంత్ బిశ్వశర్మ కీలకనిర్ణయం**

**మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు సూచన**

**గౌహతి,జూన్17(నినాదం):**

అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ కీలక నిర్ణయం తీసుకున్నారు. జూలై 1 నుంచి రాష్ట్రంలోని ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగులు,మంత్రులు, ఎమ్మెల్యేలు తమ సొంత డబ్బుతో కరెంట్ బిల్లులు చెల్లించు కోవాల్సి ఉంటుందని వెల్లడిరచారు. జూలై 1 సీఎంగా తానూ, సీఎస్ ఈ రూల్ పాటిస్తామని చెప్పారు. రాష్ట్ర సెక్రటేరియట్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో అస్సాం సీఎం ఈ ప్రకటన చేశారు. అనంతరం ఆయన ట్వీట్ కూడా చేశారు. ▸▸ 2లో..

## ఆదాయం కోసం నానా తంటాలు

### భూముల విలువ పెంపుతో రాబడి

# రుణమాఫీ కోసం తీవ్ర కసరత్తు

ఆగస్టు 15 నాటికి రుణమాఫీ చేయాలని భావిస్తున్న తెలంగాణ సర్కారు ఆ దిశగా తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇందుకోసం సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటిరే పలుసమీక్షలు చేసి నిధుల సమీకరణపై దృష్టి సారించారు. ఇప్పటికే అధికారులు బ్యాంకర్లతో మాట్లాడి రెండు లక్షల రూపాయల రుణం తీసుకున్న వారి జాబితాను తెప్పించుకున్నారు. మొత్తం ఎంత మంది ఉన్నారు. రుణమాఫీ చేయాలంటే ఎంత ఖర్చు అవుతుందనే అంచనాల్లో బిజీగా ఉన్నారు.

▶▶ తెలంగాణలోని దాదాపు 70 శాతం రైతులకు లక్ష లోపే రుణం ఉందని భావిస్తున్న ప్రభుత్వం

▶▶ రైతురుణమాఫీ కటాఫ్ డేట్‌గా 2023 డిసెంబర్ 9?





**హైదరాబాద్,జూన్17(నినాదం):**

రెండు మూడు రోజుల్లోనే రుణమాఫీ పక్రియ కొలిక్కిరానుంది. అనంతరం ఆ జాబితాను ముందు ఉంచుకొని అసలు లబ్ది దారుల జాబితను సిద్ధం చేయనున్నారు. 2 లక్షల రుణమాఫీ కోసం విధివిధానాలు ఖరారు చేస్తూనే నిధుల వేట ముమ్మరం చేసింది. అందుబాటులో ఉన్న అన్ని అంశాలను పరిశీలించాలన్న ప్రభుత్వ ఆదే శాలతో అధికారులు రకరకాల ప్రతిపాద నలు సిద్ధం చేస్తన్నారు. రుణమాఫీ నిజంగా అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటి వరకు రైతు బంధు ఇచ్చినట్టు అన్న వర్గాలు రుణమాఫీ చేయొద్దనే ఆలోచన ఉంది. అందుకే అర్హులను గుర్తించేందుకు చేపట్టాల్సిన వడపోత పక్రియను ఖరారు చేయనుంది. పంట రుణమాఫీ అంశంపై ఈ వారంలోనే కీలకమైన మంత్రివర్గం సమావేశం నిర్వ హించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ భేటీలో రుణమాఫీ అర్హతకు సంబంధించిన విధివిధానాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆలోచనతో ఉంది. ఆ దిశగా ప్రయత్ని స్తున్న అధికారులు అర్హుల జాబితాలో పాస్‌బుక్, రేషన్ కార్డును పరిశీలిస్తున్నారు. ఇవి ఉన్న వాళ్లనే

▸▸ తరువాయి 2లో..

## పోలవరంను సర్వనాశనం చేసిన జగన్

- రాజకీయాల్లో ఉండదగిన వ్యక్తి కాదు
- కలల ప్రాజెక్టును పూర్తిగా దెబ్బతీసారు
- వేలకోట్లు వృధా చేసిన నాటి పాలకుడు
- గట్టిగా కష్టపడితే మరో నాలుగేళ్లు పడుతుంది
- పోలవరంపై అధికారులతో సమీక్షించిన చంద్రబాబు



**పోలవరం,జూన్17(నినాదం):**


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు అనేక సంక్షోభాలను ఎదుర్కొందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం తాను పడిన కష్టాన్ని జగన్ బూడిదలో పోసిన పన్నీరు చేశారని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి ఆటంకాలు రాకూడదనే ఉద్దేశంతో తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేలా ఆనాడు కేంద్రాన్ని ఒప్పించాను. ప్రాజెక్టు మొదలు పెట్టిన దగ్గర నుంచి ఎన్నో సంక్షోభాలు ఎదురయ్యాయి. ▸▸ 3లో..

# నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్

### వారికిచ్చిన హామీలను అమలు చేయాలి

### బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ డిమాండ్

కాంగ్రెస్ మోసం చేసిందని నిరుద్యోగ యువత ఆందోళన చేస్తోందని, యువతను రెచ్చగొట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. గ్రూప్ 1లో వన్ ఈస్ట్ హండ్రెడ్ చొప్పున మెయిన్స్‌కు అవకాశం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధి కారంలోకి వచ్చాక ఆ మాట ఎందుకు తప్పారని ప్రశ్నించారు. గ్రూప్ టూకు మరో 2 వేలు, గ్రూప్ త్రీకి మరో 3 వేల ఉద్యోగాలు జోడిరచి పరీక్షలు నిర్వ హించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ జాడ పత్తా లేదని విమర్శించారు.



**హైదరాబాద్,జూన్17(నినాదం):**

సోమవారం ఆయన హైదరాబాద్‌లో బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ డిమాం డ్ మాట్లాడుతూ.. బేషజాలకు వెళ్లకుండా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ నిలబె ట్టుకోవాలని సూచించారు. పరీక్షకు.. పరీక్షకు మధ్య కనీసం రెండు నెలల వ్యవధి ఉండాలని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా జాబ్ క్యాలండర్ ఎందుకు ఇవ్వలే దని హరీష్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ ఏమైందని నిలదీశారు. డీఎస్సీని 11వేలకే ఎందుకు పరిమితం చేశా రన్నారు. వచ్చే ఆరు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాల భర్తీ పూర్తి చేయాలని, కోదండ రామ్ కూడా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కోదండరామ్ భాధ్యత తీసుకుని గౌరవం నిలుపుకోవాలని,

▸▸ తరువాయి 2లో..

### త్వరలోనే జాబ్ క్యాలెండర్

## రిలీజ్ చేస్తాం

### ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం

### మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**హైదరాబాద్,జూన్17(నినాదం):**

బీఆర్ఎస్ హయాంలో అస్తవ్యస్థమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతు న్నామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 12 ఏళ్ల తర్వాత గ్రూప్ 1 పరీక్షను తామే నిర్వహించామని చెప్పారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని చెప్పారు. పింఛన్ల పెంపులో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ఏపీ సీఎం చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలన్న మాజీ మంత్రి హరీశ్ వ్యాఖ్యలకు కౌంటర్ వేశారు. హరీశ్ రావు చంద్రబా బును ఉదాహరణగా తీసుకున్నారంటే ఆయన పరిస్థితి ఏంటో అర్థమ వుతుందని విమర్శించారు. తాము తెలంగాణ ప్రజలు ఆలోచనలను అమలు చేస్తాం కానీ.. ఏపీ ఆలోచనలు కాదన్నారు. తాము చెప్పిన ప్రతి మాటకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ▸▸ తరువాయి 2లో..

## మరికొందరు ఐపిఎస్‌ల బదిలీ

### హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా రాహుల్ హెగ్డే



**హైదరాబాద్, జూన్17(నినాదం):**

తెలంగాణలో రెండు రోజుల కిందట భారీగా ఐఏఎస్ ల బదిలీ జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా భారీగా ఐపీఎస్‌ల బదిలీలు చేపట్టింది. పలు జిల్లాల ఎస్పీలు సహా ఏకంగా 28 మంది ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేసారు ▸▸ 2లో..

# వయనాడ్‌ను వదులుకున్న రాహుల్

### ఖర్గే నివాసంలో జరిగిన భేటీలో చర్చ

### రాయబరేలి నుంచి ఎంపిగా కొనసాగాలని నిర్ణయం

### వయనాడ్ నుంచి ప్రియాంక పోటీకి కాంగ్రెస్ గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ,జూన్17(నినాదం):**

వయనాడ్, రాయబరేలి లోక్‌సభ స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ కీలక నిర్ణయం తీసుకున్నారు. రెండు నియోజకవర్గాల్లో ఒక సీటును వదులుకోవాల్సి రావడంతో తమ కుటుంబానికి అండగా ఉన్న రాయబరేలిని రాహుల్ ఎంచుకున్నారు. వయనాడ్ సీటును వదులుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో సోమవారం సాయంత్రం జరిగిన ▸▸ 2లో..



## ప్రభుత్వ రంగ సంస్థలను ఆదుకోవాలి

### మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి

**నిర్మల్, నినాదం:**

నిరుద్యోగ యువతను బిజెపి నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్రమాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలా చారి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూతపడ్డ పలు సంస్థల పునరుద్ధరణ కోసం నోరు మెదపని వారికి రాష్ట్ర ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. బీజేపీ పాలనలో దేశంలో నిరుద్యోగం ఎంత పెరిగిందో.. ఉద్యోగాలు లేక యువత ఎంత బాధ పడుతున్నారో తెలుసు కోవాలని అన్నారు.

▸▸ 2లో..



# హైదరాబాద్‌లో భారీ వర్షం

### ఈదురుగాలులతో భారీ వృక్షం నేలమట్టం

**హైదరాబాద్,జూన్17(నినాదం):**

హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. గత మూడురోజులుగా ఉకకపోత, ఎండలతో ఉన్నజనానికి ఊరటనిచ్చింది. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృత్తమే భారీ వాన కురిసింది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత భారీ వర్షం కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రేటర్ హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడుతోంది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.నగరంలోని జూబ్లీహిల్, బంజారా హిల్స్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, శేరిలింగం పల్లి, రాజేంద్రనగర్, ఒః నగర్, కొత్తపేట, దిల్ సుఖ్ నగర్, మలక్ పేట, సంతోష్ నగర్, ఐస్ సదన్, ఉప్పల్, కాప్రా, మేడ్చల్, మాదాపూర్, ▸▸ 2లో..

# రైలు ప్రమాదం.. 15మంది మృతి

### బెంగాల్లో ఆగివున్న రైలును ఢీకొన్న గూడ్స్

### మూడు బోగీలు ధ్వంసం..

### కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్‌కు తీవ్ర ప్రమాదం

### సహాయక చర్యలకు ఆదేశించిన సిఎం మమతా, కేంద్రమంత్రి వైష్ణవి అశ్విన్






# నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్

**మొదటిపేజీ తరువాయి**

విద్యార్థుల పక్షాన ప్రజా పోరాటానికి శ్రీకారం చుడతామని హరీష్ రావు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతి, యువకులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గ్రూప్ పోస్టులు పెంచాలని కోరారు, ఇప్పుడు గ్రూప్ విద్యార్థులు పోస్టులు పెంచాలని కోరితే స్పందించడం లేదన్నారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో పాస్ అయిన విద్యార్థులకు 1:50 కాకుండా 1:100 చొప్పున మెయిన్స్ ఎగ్జామ్‌కు అవకాశమివ్వాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. తద్వారా ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు మేలు జరుగుతుందని చెప్పారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 1:100 విధానం అమలు చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తుచేశారు. ఉపముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యుతను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీయాలని అభ్యర్థులు బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇచ్చారని చెప్పారు. గ్రూప్స్ పరీక్షలకు మధ్య వ్యవధి ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలయిందని, ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని విమర్శించారు. పింఛన్ ఎప్పుడిస్తరని అవ్వతాతలు అడుగుతున్నారని చెప్పారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు క్రమం తప్పకుండా పెన్షన్ వచ్చేందని అంటున్నారని తెలిపారు. రెండు నెలల నుంచి ఆసరా పింఛన్ రావడం లేదని వెల్లడిరచారు. అవ్వతాతలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. తక్షణమే పెండిరగ్‌లో ఉన్న పింఛన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతో తీసుకున్న ఆరు గ్యారంటీల దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజా పాలన ఆచరణలో ఏమైందన్నారు. పేదల పట్ల ఇంత వివక్ష ఎందుకని నిలదీశారు. ఏపీ సీఎం మొదటి సంతకంతో పింఛన్ రూ.4 వేలకు పెంచారని, మీరు ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలన్నారు. పక్కన ఆంధ్రప్రదేశ్ ఇచ్చినప్పుడు మీరెందుకు ఇవ్వలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వికలాంగులకు రూ.6 వేల పింఛన్ వెంటనే ఇవ్వాలన్నారు. చేనేత, గీత కార్మికులకు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ పేషెంట్లకు బీఆర్ఎస్ హాయంలో పెద్ద ఎత్తున పింఛన్ ఇచ్చామని చెప్పారు. ఇంటికి రెండు పింఛన్లు ఇస్తామన్నారని గుర్తుచేశారు. ఉద్యోగులకు ప్రతి నెల 1న జీతాలు ఇస్తే ఆశా వర్కర్లు ఎందుకు వైద్యవిధాన పరిషత్‌కు వస్తారని ప్రశ్నించారు. ఎన్‌హెచ్ఎం కింద 17 వేల మంది పనిచేస్తున్నారని, వారికి వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదు నెలల నుంచి సఫాయి కార్మికులకు ఎందుకు వేతనాలు ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. వెంటనే గ్రామపంచాయతీయలకు నిధులు విడుదల చేయాలన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులపై కేసీఆర్ బొమ్మ ఉందని ఇవ్వట్లేదని, 1.5 లక్షల మంది చెక్కుల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు రోడ్లు ఎక్కుతున్నారని, 60 వేల మంది జీతాల కోసం వేచిచూస్తున్నారన్నారు. తమ హయాంలో వారికి జీతాలు ఆపలేదన్నారు.

## యువకుడిని బలితీసుకున్న ఆన్‌లైన్ బెట్టింగ్

**మొదటిపేజీ తరువాయి**

ఐదురోజుల క్రితం తమ వ్యవసాయ బావివద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే రామాయంపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసు నమోదు చేశారు.

## ఇక సొంతంగానే కరెంట్ బిల్లుల చెల్లింపు

**మొదటిపేజీ తరువాయి**

75 ఏళ్లుగా మన మంత్రులు, ప్రభుత్వ సీనియర్, సచివాలయ అధికారుల నివాసాలకు కరెంట్ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రజలు చెల్లించే టాక్స్ సొమ్ముతో ప్రభుత్వ అధికారులకు విద్యుత్తు బిల్లులు చెల్లించే వీఐపీ సంస్కృతికి ముగింపు పలుకుతున్నాం. ఇదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులంతా వారి విద్యుత్ వినియోగానికి అయ్యే బిల్లులను చెల్లించాల్సి ఉంటుంది అని ట్వీట్ లో వెల్లడిరచారు. దీనివల్ల విద్యుత్ బోర్డుకి వచ్చే నష్టాలను నివారించవచ్చని, బదులుగా వారు విద్యుత్ ఛార్జీలను పెంచాల్సిన అవసరం ఉండదని సీఎం పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ సంస్థలను క్రమంగా సోలార్ పవర్‌కి తరలించడమే తమ లక్ష్యమని అన్నారు సీఎం. . రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, విశ్వవిద్యాలయాల నుండి ఈ పనిని ప్రారంభిస్తామని తెలిపారు.

## ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం

**మొదటిపేజీ తరువాయి**

ఆశ వర్కర్ల గురించి మాట్లాడే హక్కు హరీష్ కు లేదన్నారు. వాళ్ల హయాంలో ఆశా వర్కర్స్ ను గుర్రాల తో తొక్కించారని విమర్శించారు. త్వరలోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పారు. పెద్దపల్లిలో జరిగిన ఘటనపై విచారణ జరుగుతుందన్నారు శ్రీధర్ బాబు. ఘటన జరగడం దురదృష్టకరమని.. శాంతి భద్రత విషయంలో తమ ప్రభుత్వం సీరియస్ గా ఉందన్నారు. మెదక్‌లో జరిగిన మతఘర్షణల విషయంలో సీరియస్ గా ఉన్నాం.. ఘటన వెనక ఎవరి హస్తం ఉన్నా ఉక్కు పాదంతో అణిచివేస్తామని చెప్పారు.

## మరికొందరు ఐపిఎస్‌ల బదిలీ

**మొదటిపేజీ తరువాయి**

హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా రాహుల్ హెగ్డే, ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా రుత్‌రాజ్, సీఐడీ ఎస్పీగా విశ్వజిత్ కంపాటి, జోగులాంబ గద్వాల ఎస్పీగా టి. శ్రీనివాసరావు, సూర్యాపేట ఎస్పీగా సన్‌ప్రీత్‌సింగ్, జగిత్యాల ఎస్పీగా అశోక్ కుమార్, మహబూబ్ నగర్ ఎస్పీగా జానకీ ధరావత్, మంచిర్యాల డీసీపీగా భాస్కర్, బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ నియమితులయ్యారు. హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడును డీజీపీ ఆఫీసుకు అటాచ్ చేశారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం

**మొదటిపేజీ తరువాయి**

గచ్చిబౌలి, హైటెక్ సిటీ, కొండాపూర్, మియాపూర్, బీహెచ్‌ఈఎల్, సికింద్రాబాద్, బేగంపేట, అమీర్‌పేటలో భారీ వర్షం పడుతోంది. ఫిలింనగర్‌లో భారీ వర్షం పడిరది. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా జీహెచ్ఎంసీ అలర్ట్ అయింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావద్దంటూ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ బల్దియా సూచించింది.. రాగల గంటపాటు నగరవ్యాప్తంగా భారీ వర్షం పడుతుందని వాతావరణ కేంద్రం వెల్లడిరచింది. వర్షం పడుతుండటంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య నెలకొంది.ఈదురుగాలుల కారణంగా టోలిచౌకీ గోల్కొండ ఎండీ లైన్స్‌లో 200 ఏళ్ల నాటి వృక్షం నేలకూలింది. ఈ ఘటనలో ఒక వ్యక్తికి గాయాలు కాగా.. నాలుగు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి.

# రుణమాఫీ కోసం తీవ్ర కసరత్తు



**మొదటిపేజీ తరువాయి**

పరిగణలోకి తీసుకొని రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని యోచిస్తున్నారట. గతంలో రైతు బంధు ఉచ్చినట్టు ప్రజాప్రతినిధులు, ఐటీ చెల్లించే ఉద్యోగులకు రుణమాఫీ నుంచి తప్పించాలని చూస్తున్నారు. ఇప్పటికే రైతు బంధు పొందుతున్న వారిలో ఆరు లక్షల మందికి పట్టాదారు పాస్‌పుస్తకాలు లేవు. అలాంటి వారిని తప్పిస్తే రుణగ్రస్తుల సంఖ్య భారీగా తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు రేషన్ కార్డును కూడా నిబంధనల్లో పడితే ఈ సంఖ్య చాలా వరకు తగ్గుతుందని అంటున్నారు. ఐటీ చెల్లించే వాళ్లు, ప్రజాప్రతినిధులను తప్పిస్తే కూడా రుణమాఫీ లబ్దిదారుల సంఖ్య 40 లక్షలకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఇలా నిజంగా అవసరం ఉన్న వాళ్లకే రుణమాఫీ చేయాలని అలాంటి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వ ఆలోచనగా ఉంది. మరోవైపు చేస్తున్న రుణమాఫీ దశల వారీగా చేస్తారనే ప్రచారం నడుస్తోంది. ఆగస్టు 15 ప్రారంభించే రుణాఫీ పక్రియలో మొదటి దశలో 50 వేలు, రెండో దశలో 75 వేలు, మూడో దశలో లక్ష తర్వాత రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని భావిస్తున్నారు. తెలంగాణలోని దాదాపు 70 శాతం రైతులకు లక్ష లోపే రుణం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ముందుగా వీళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని తర్వాత మిగతా వారికి రుణమాఫీ చేయాలని చూస్తున్నారు. ఆగస్టులో రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం అక్కడకు నెలరోజుల్లో రైతు భరోసా నిధులు విడుదల చేయాలి. వాటితోపటు రైతు బీమా, పంటల బీమాను కూడా చెల్లించాలి. దీంతో ఈ నాలుగు పథకాల కోసం 50 వేల కోట్లు సమీకరించాలి. ఇది ప్రభుత్వానికి పెద్ద పరీక్షగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వం ఆలోచిస్తున్న రూల్స్ ప్రకారం రుణమాఫీ కోసం 35వేల కోట్లు, రైతు భరోసారుక పదివేల కోట్లకుపైగా బీమా పథకాల కోసం నాలుగు వేల కోట్లు అవసరం అవుతాయి. నాలుగు పథకాల కోసం నిధులు సమీకరణ ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారుతోంది. వివిధ రాష్టాల్లో, కేంద్రం పెట్టిన రూల్స్ ప్రకారం లబ్దిదారుల సంఖ్యను తగ్గించుకోవడం ఒక మార్గమైతే... రైతుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ పెట్టి బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చుకోవడం మరో మార్గం. వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములు తాకట్టుపెట్టి రుణాలు తెచ్చుకోవడంపై కూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు సమాచరం. మొత్తంగా ఇచ్చిన హామీ కోసం భూముల ధరుల పెంచబోతున్నారు. దీంతో రిజిస్టేష్రన్ల చార్జీలు పెరగనున్నాయి. అలాగే ఆదాయ మార్గాలపై దృష్టి సారించారు. అయితే కిలో రూపాయి లాంటి పథకాల జోలికి మాత్రం వెళ్లడం లేదు.

## రైతురుణమాఫీ కటాఫ్ డేట్‌గా 2023 డిసెంబర్ 9?

రైతు రుణమాఫీపై కృతనిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు అవసరమైన ప్రణాళికలను వేగంగా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నిధుల సమీకరణకు చర్యలు ప్రారంభించగా.. తాజాగా కటాఫ్ చర్యలపైన ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు రుణాలు తీసుకున్న రైతులకు రూ. 2 లక్షల చొప్పున మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వాసనీయంగా తెలిసింది. ఈ కటాఫ్ చర్య ప్రకారం రుణమాఫీకి దాదాపు రూ. 35వేల కోట్ల మేర నిధులు అవసరమవుతాయని కూడా అంచనాకు వచ్చినట్లు సమాచారం.

# వయనాడ్‌ను వదులుకున్న రాహుల్



**మొదటిపేజీ తరువాయి**

సమావేశంలో ఈ కీల నిర్ణయం తీసుకున్నారు. వయనాడ్ నియోజకవర్గాన్ని రాహుల్ ఖాళీ చేయడంతో అక్కడ జరిగే ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా రాహుల్ సోదరి ప్రియాంక గాంధీ వాద్రా ని పోటీలోకి దింపాలని కూడా పార్టీ అగ్రనేతలు నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రియాంక గాంధీ ఎన్నికల రాజకీయాల్లోకి అడుగు పెట్టడం ఇదే మొదటిసారి కానుంది. ఖర్గే నివాసంలో జరిగిన సమావేశంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ పాల్గొన్నారు. రాహుల్ గాంధీ 2019 ఎన్నికల్లో ఉత్తర ప్రదేశ్‌లోని అమేథీతో పాటు కేరళలోని వయనాడ్‌లో పోటీ చేయగా, అమేథీలో ఓటమిని చవిచూశారు. అయితే, వయనాడ్ నుంచి ఘనవిజయం సాధించారు. రాయబరేలి నుంచి వరుసగా ఎన్నికవుతూ వస్తున్న సోనియాగాంధీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరమవుతున్నట్టు ప్రకటించారు. అనంతరం ఆమె రాజ్యసభకు ఎన్నికయ్యారు. దీంతో అటు వయనాడ్‌తో పాటు ఇటు రాయబరేలి నుంచి కూడా వ్యూహాత్మకంగా రాహుల్‌ను కాంగ్రెస్ పార్టీ బరిలోకి దింపింది. అందుకు తగ్గట్టే ఈ రెండు నియోజకవర్గాల్లోనూ రాహుల్ భారీ మెజారిటీతో గెలుపొందారు. అయితే, రెండు నియోజకవర్గాల్లో ఏదో ఒక నియోజకవర్గాన్ని వదులుకోవాల్సి రావడంతో కాంగ్రెస్ సోమవారంనాడు మరోసారి వ్యూహాత్మకంగా వ్యవహరించింది. వయనాడ్ సీటును రాహుల్ వదులుకోవడం ద్వారా అక్కడ జరిగే ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీని రంగంలోకి దించాలని, ప్రియాంకను తిరిగి గెలిపించడం ద్వారా రెండు సీట్లు తమకు చాలా కీలకమనే సంకేతాలు పంపాలని కాంగ్రెస్ నిర్ణయించుకుంది. రాయబరేలి సీటును రాహుల్ గాంధీ ఉంచుకోవాలని, వయనాడ్‌లో ప్రియాంక గాంధీని పోటీలోకి దింపాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకున్నట్టు సమావేశానంతరం మీడియాతో మాట్లాడుతూ కేసీ వేణుగోపాల్ తెలిపారు. పార్టీ నిర్ణయంతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. కేరళ ప్రజలకు ప్రియాంక అంటే చాలా ఇష్టమని, భారీ మెజారిటీతో ఆమె గెలుస్తారని అన్నారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. ఈ సార్వత్రిక ఎన్నికల్లో రెండు చోట్లా పోటీ చేసి విజయం సాధించిన విషయం తెలిసిందే. వయనాడ్, రాయ్‌బరేలీ నుంచి ఆయన గెలుపొందారు. వీటిలో ఏ స్థానాన్ని వదులుకుంటారని సర్వత్రా ఆసక్తి నెలకొంది. తాజాగా దీనిపై రాహుల్ నిర్ణయం తీసుకున్నారు. వయనాడ్ ఎంపీ సీటును ఆయన వదులుకోనున్నారు. రాయ్‌బరేలీ ఎంపీగా ఆయన కొనసాగనున్నారు. ఈ మేరకు ఏఐసీసీ భేటీలో ఈ అంశంపై చర్చ జరిగింది. రాహుల్‌గాంధీ వయనాడ్‌ను వదులుకుంటారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రకటించారు. దీంతో వయనాడ్‌లో జరగనున్న ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు ఆయన సోదరి, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీకి ఛాన్స్ దక్కింది. ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేయడం ఆమెకు ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. రాయ్‌బరేలీ కాంగ్రెస్ కంచుకోటగా పేరొందింది. అక్కడి ప్రజలు గాంధీ కుటుంబంపై ఎంతో అభిమానం చూపుతున్నారు. అందుకే ఆ స్థానాన్నే రాహుల్ ఎంచుకోవాలని పార్టీ నిర్ణయించింది. ఇది కాంగ్రెస్ పార్టీకి మేలు చేస్తుందని భావిస్తున్నాం. వయనాడ్ ప్రజలకు కూడా కాంగ్రెస్‌పై ఎనలేని అభిమానం చూపుతున్నారు. వారి కోసం ప్రియాంకను బరిలోకి దింపుతున్నాం' అని ఖర్గే వెల్లడిరచారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. 'నా పోరాటానికి వయనాడ్ ప్రజలు ఎంతో మద్దతిచ్చారు. ఆ స్థానాన్ని వదులుకోవడానికి ఎంతో మదనపడ్డా. అక్కడి ప్రజలతో నా బంధం కొనసాగుతూనే ఉంటుంది. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటాం. ప్రియాంక వయనాడ్ ఉత్తమ ప్రతినిధి కాబోతుందని నమ్ముతున్నా అని రాహుల్ పేర్కొన్నారు. నేను మహిళనైనా వయనాడ్ నుంచి పోరాడగలను. రాహుల్ అక్కడ లేరనే భావనను వయనాడ్ ప్రజలకు కలగనివ్వను' అని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు.

## ప్రభుత్వ రంగ సంస్థలను ఆదుకోవాలి

**మొదటిపేజీ తరువాయి**

సీసీఐ సహా అన్ని సంస్థలను వెంటనే తెరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలకు దమ్ముంటే కేంద్రంతో దీనిపై పోరాడాలని అన్నారు. కేంద్రం ఇప్పటికే అనేక సంస్థలను ప్రైవేట్‌కు అమ్మేసిందని, దీంతో వేల మంది రోడ్డున పడ్డారని చెప్పారు. ఇప్పుడు ఎల్ఐసీ సహా అనేక కంపెనీల వాటాలను అమ్మకానికి పెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వివాక స్టీల్‌పై త్వరగా తేల్చాలని అన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరణ చేస్తున్నదని వెల్లడిరచారు. విచ్చలవిడిగా ప్రభుత్వరంగ సంస్థలు అమ్మడం వల్ల దాదాపు రెండున్నర లక్షల మంది ఉద్యోగాలను కోల్పోయారు. ఆ కుటుంబాలకు బీజేపీ నేతలు సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ సర్కారుపై ప్రజల తిరుగుబాటు తప్పదన్నారు. బీజేపీ నాయకులకు తెలంగాణలో ఉద్యోగ అవకాశాలు.. నోటిఫికేషన్ల గురించి మాట్లాడే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. ఇదిలావుంటే ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాల కోరారు. దీంతో గ్రామాల్లో ఉపాధి కూలీలకు నిరంతరాయంగా పనులు దక్కుతాయన్నారు. అలాగే వ్యవసాయ పనులు కూడా చురుకుగా సాగుతాయన్నారు. ఉత్తుత్తి పనులకు ఇక చెక్ పడగలదన్నారు. వ్యవసాయ రంగంలో కూలీలు దొరక్క రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధి హామీ పథకం కూలీలను వ్యవసాయ రంగం వైపు మళ్లిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. 25శాతం చెల్లింపులు, ప్రభుత్వం 75శాతం చెల్లింపులు జరిపేలా ఒక విధానాన్ని తీసుకువస్తే వ్యవసాయం ఎంతో లాభదాయకం అవుతుందన్నారు. కౌలురైతులకు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు అందించాలన్నారు. రైతులు వ్యాపారులుగా ఆలోచించాలన్నారు. ఇందుకు గ్రామాల్లో వ్యవసాయ ఉత్పత్తుల రూపాంతరానికి చిన్నచిన్న యూనిట్ల ఏర్పాటుకు రైతులు కృషి చేయాలన్నారు. ఇజ్రాయిల్, వియత్నాం వంటి దేశాల్లో పద్ధతులు ఇక్కడ రైతులు అవలంభించాలన్నారు. రైతులకు ప్రకృతి వ్యవసాయమే లాభదాయకమని ఆ దిశగా రైతులు చర్యలు చేపట్టాలన్నారు. గోవుల మూత్రంతో జీవామృతం తయారు చేసుకుని పంటలు పండిరచుకోవాలన్నారు.

# రైలు ప్రమాద ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

**మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటన**

**మృతుల కుటుంబాలకు 2లక్షల చొప్పున సాయం ప్రకటన**

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో సోమవారం ఉదయాన్నే ఘోర రైలు ప్రమాదం జరిగింది. రెండు రైళ్లు ఢీ కొన్న ఘటనలో మృతుల సంఖ్య 15కి చేరింది. దాదాపు 60 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'డార్జిలింగ్‌లో జరిగిన రైలు ప్రమాదంలో పలువురు మరణించిన వార్త బాధ కలిగించింది.మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని రాష్ట్రపతి ఎక్స్‌లో పేర్కొన్నారు. రైలు ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ సైతం విచారం వ్యక్తం చేశారు. 'బెంగాల్‌లో జరిగిన రైలు ప్రమాదం బాధాకరం. బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి' అని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి 2 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గాయపడిన వారికి రూ.50వేలు ఇస్తామని పీఎంఓ తెలిపింది. అసోంలోని సిల్చార్ నుంచి కోల్‌కతాలోని సెల్దాకు బయల్దేరిన కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్ రైలును న్యూజల్‌పాయ్ గుడి జంక్షన్ సమీపంలోని రంగపాని స్టేషన్ వద్దకు రాగానే అదే ట్రాక్‌పై వెనుకనుంచి వచ్చిన ఓ గూడ్స్ రైలు బలంగా ఢీ కొట్టింది. దీంతో కాంచన్‌జంగా రైలుకు చెందిన ఓ బోగీ గాల్లోకి లేచింది. ప్రమాద తీవ్రతకు బోగీలు చెల్లాచెదురయ్యాయి. పరిస్థితిని సీఎం మమతా బెనర్జీ సమీక్షించారు. బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కాగా.. ఈ ఘటనలో మృతుల సంఖ్య ఇంకా పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

# గంజాయి విక్రయాలకు చెక్ పెడతాం

**అన్ని నియోజకవర్గాల్లో ప్రజాదర్బార్ పరిశీలన**

**మంత్రి నారా లోకేశ్ వెల్లడి**

**అమరావతి :**

రాబోయే 100 రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి విక్రయాలకు చెక్ పెడతామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రజా దర్బార్‌ను అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. బక్రీద్ సందర్భంగా మంగళగిరి ఈద్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ముగ్గురు తెదేపా కార్యకర్తలను వైకాపా నేతలు హత్య చేసినా సంయమనం పాటిస్తున్నామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నడుచుకుంటున్నామని చెప్పారు. తమ కార్యకర్తలకు ఆగ్రహం వ్యక్తం చేస్తే వాళ్లు ఎక్కడ ఉంటారో తెలుసుకోవాలన్నారు. రుషికొండ ప్యాలెస్ వ్యవహారంలో ఇంకా బయటికి రావాల్సిన చిత్రాలు చాలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. మంగళగిరి ప్రజల కోసం మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న 'ప్రజాదర్బార్'కు అనూహ్య స్పందన లభిస్తోంది. గత రెండు రోజులుగా ఆయన ప్రజా దర్బార్ పేరిట ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న విషయం తెలిసిందే. సోమవారం కూడా నియోజకవర్గానికి చెందిన ప్రజలు ఉండవల్లిలోని ఆయన నివాసానికి తరలివచ్చి తమ సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. జీతాలు పెంచాలని అంగన్వాడీ టీచర్లు, బదిలీల కోసం ఉపాధ్యాయులు, ఉపాధి కల్పించాలని నిరుద్యోగులు ఆయనకు విన్నవించారు. విద్య, వైద్య ఖర్చులకు సాయం అందించాలని పలువురు కోరారు. వైకాపా నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని భూములను బలవంతంగా లాక్కున్నారని, తమకు న్యాయం చేయాలని పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. అందరి సమస్యలను ఓపికగా విన్న లోకేశ్... సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపుతామంటూ వారికి భరోసా ఇచ్చారు.

# రైలు ప్రమాదం.. 15మంది మృతి

**కోల్‌కతా,జూన్17(నినాదం):**

పశ్చిమ బెంగాల్లోని రంగపనీర్ స్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగి ఉన్న కాంచనజంగా ఎక్స్‌ప్రెస్ రైలును వెనుక నుంచి వేగంగా వచ్చిన గూడ్స్ రైలు ఢీకొట్టింది. దీంతో కాంచనజంగా ఎక్స్‌ప్రెస్ రైలు వెనుక మూడు బోగీలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 15 మంది ప్రయాణికులు మృతి చెందగా, 60 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అసోంలోని సిల్చార్ నుంచి కోల్‌కతాలోని సీల్దాకు వెళ్తున్న కాంచనజంగా ఎక్స్‌ప్రెస్ సిలిగురి దాటిన తర్వాత రంగ్‌పనీర్ స్టేషన్ సమీపంలో ప్రమాదానికి గురైందని చెబుతున్నారు. ఈ ప్రమాదంలో రైలు వెనుక భాగంలో ఉన్న మూడు బోగీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో రెండు ప్రయాణీకుల బోగీలు, ఒక పార్శిల్ బోగీ దెబ్బతిన్నట్లు రైల్వేశాఖ నుంచి సమాచారం అందింది. ఈ ఘటనలో మరికొంత మంది గాయపడగా, క్షతగాత్రులను ఆసుపత్రులకు తీసుకెళ్లారు. రెస్క్యూ టీమ్‌లు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. ఈ ప్రమాదం నేపథ్యంలో ఆ ప్రాంతంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడిరది. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించి చీ వేదికగా ఓ పోస్ట్ చేశారు. డార్జిలింగ్ జిల్లాలోని ఫన్సిదేవా ప్రాంతంలో జరిగిన విషాద రైలు ప్రమాదం గురించి తెలుసుకుని షాక్ అయ్యానని తెలిపారు. కాంచనజంగా ఎక్స్‌ప్రెస్‌ను గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ నేపథ్యంలో వైద్యులు, అంబులెన్స్‌లు, విపత్తు బృందాలు రెస్క్యూ, రికవరీ, వైద్య సహాయం కోసం స్థలానికి చేరుకున్నాయని, యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారని వెల్లడిరచారు. వైద్యులు, అంబులెన్స్‌లు, విపత్తు బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు ప్రారంభించినట్లు ఎక్స్ వేదికగా తెలిపారు. కాంచన్‌జంగా ఉన్న అదే ట్రాక్‌పై వెనుక నుంచి వచ్చిన ఓ గూడ్స్ రైలు బలంగా ఢీ కొట్టింది. దీంతో కాంచన్‌జంగా రైలుకు చెందిన ఓ బోగీ గాల్లోకి లేచింది. ప్రమాద తీవ్రతకు గూడ్స్ రైలు బోగీలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు సైతం పట్టాలు తప్పాయి. ఘటనాస్థలి వద్ద చెల్లాచెదురుగా పడి ఉన్న రైలు బోగీలు చూస్తే ప్రమాద తీవ్రత ఎంత ఎక్కువగా ఉందో తెలుస్తోంది . ఈ ఘటనలో మృతుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు భావిస్తున్నారు.రెండు రైళ్లు ఢీ కొట్టడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిరది. ఈ రూట్‌లో వెళ్లే పలు రైళ్లను అధికారులు దారి మళ్లించారు. మరికొన్నింటిని రద్దు చేశారు. మరోవైపు ఈ ఘటనపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. ఎన్ఎఫ్ఆర్



జోన్‌లో దురదృష్టకర ప్రమాదం జరిగిందన్నారు. యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు చెప్పారు. రైల్వే, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

# విద్యుత్ సమస్యలపై ప్రజావాణి

## ఎంపీడీసీఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి




**భీమదేవరపల్లి జూన్ 17(నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం సబ్ డివిజన్ పరిధిలో ప్రతి సోమవారం నిర్వహించే విద్యుత్ ప్రజావాణి ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. భీమదేవరపల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం ప్రారంభించిన విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. టీజీ ఎస్పీడీసీఎల్ 16 సర్కిళ్ల పరిధిలోని అన్ని కార్యాలయాల్లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు చేయవచ్చని వినియోగదారులకు తెలిపారు. వినియోగదారులకు మరింత చేరువలో విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ సర్కిల్ ఇంజనీర్ వెంకటరమణ, టెక్నికల్ డిఈ అనిల్ కుమార్, ఏడిఈ రాజు, ఏఈ లక్ష్మణ్ నాయక్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# పోలవరంను సర్వనాశనం చేసిన జగన్



- రాజకీయాల్లో ఉండదగిన వ్యక్తి కాదు
- కలల ప్రాజెక్టును పూర్తిగా దెబ్బతీసారు
- వేలకోట్లు వృధా చేసిన నాటి పాలకుడు
- గట్టిగా కష్టపడితే మరో నాలుగేళ్లు పడుతుంది
- పోలవరంపై అధికారులతో సమీక్షించిన చంద్రబాబు

**పోలవరం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు అనేక సంక్షోభాలను ఎదుర్కొందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం తాను పడిన కష్టాన్ని జగన్ బూడిదలో పోసిన పన్నీరు చేశారని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి ఆటంకాలు రాకూడదనే ఉద్దేశంతో తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేలా ఆనాడు కేంద్రాన్ని ఒప్పించాను. ప్రాజెక్టు మొదలు పెట్టిన దగ్గర నుంచి ఎన్నో సంక్షోభాలు ఎదురయ్యాయి. జాతీయ ప్రాజెక్టుగా విభజన చట్టంలో చేర్చడంతో తెదేపా హయాంలోనే 72 శాతం ప్రాజెక్టును పూర్తి చేశాం. 15 లక్షల క్యూసెక్కులు స్పిల్ వేపై డిశ్చార్జ్ అవుతాయని అన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారిగా పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్పిల్‌వే, కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్ పనుల పురోగతి వివరాలను జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత మీడియాతో చంద్రబాబు మాట్లాడారు. రాజకీయాల్లో ఉండదగని వ్యక్తి వచ్చి రాష్ట్రానికి శాపంగా మారారు. వైకాపా ప్రభుత్వం రాగానే రివర్స్ టెండరింగ్ చేపట్టారు. ఏజెన్సీతోపాటు సిబ్బందినీ మార్చారు. డయాఫ్రమ్ వాల్‌ను గత ప్రభుత్వం కాపాడుకోలేదు. పోలవరం విషయంలో జగన్ క్షమించరాని తప్పులు చేశారు. ఈ ప్రాజెక్టుపై నేను వందసార్లు సమీక్షించా.. 30 సార్లు సందర్శించా. రూ.446 కోట్లతో మరమ్మతులు చేసినా బాగవుతుందనే పరిస్థితి లేదు. సమాంతరంగా డయాఫ్రమ్ వాల్ కడితే రూ.990 కోట్లు ఖర్చవుతుంది. గతంలో ప్రాజెక్టు నిర్మాణం కొనసాగి ఉంటే 2020 చివరినాటికి పూర్తయ్యేది. పోలవరం పూర్తికి నాలుగు సీజన్లు కావాలని అధికారులు చెబుతున్నారు. అన్నీ సవ్యంగా జరిగితేనే నాలుగేళ్లు పడుతుందని అధికారులు అంటున్నారని అన్నారు. ఎలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండకూడదో ఇదొక కేస్ స్టడీ. రూ.వేల కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది. అప్పుడే ప్రాజెక్టు చేపడితే తక్కువ ఖర్చుతో పూర్తయ్యేది.

ప్రస్తుతం ప్రాజెక్టు వ్యయం పెరిగింది. నష్టం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి. ఏజెన్సీని మార్చవద్దని కేంద్రం రాష్ట్రానికి చెప్పింది. అలా మార్చితే ప్రాజెక్టుకు జవాబుదారీ తనం ఉండదని చెప్పారు. ఏజెన్సీలను మార్చడమే ప్రాజెక్టు ఆలస్యానికి కారణం. దీనికి బాధ్యత ఎవరు తీసుకుంటారు?. ప్రజలనే కాదు, మీడియాను, ప్రతిపక్ష నేతగా నన్ను కూడా ఇక్కడికి రానీయలేదు. ప్రస్తుతం ప్రాజెక్టు అంతా క్లిష్టంగా మారిపోయింది. ఈ చిక్కుముడులు అన్నీ విప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఈ ప్రాజెక్టు ద్వారా నదులు అనుసంధానం చేసి రాష్ట్రంలోని ప్రతీ ఎకరాకు నీరు ఇవ్వాలని కలలు కన్నా. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి చెందిన ప్రాజెక్టు ఇదని చంద్రబాబు అన్నారు. ఇక డ్యామ్ ఎత్తు 45.72 మీటర్ల డ్యాం ఎత్తు ఉంటే 194 టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని, ఆ ఎత్తును తగ్గించడానికి ప్రయత్నించారని చంద్రబాబు అన్నారు. స్పిల్ వే ద్వారా 50 లక్షల క్యూసెక్కుల నీరు వెళ్లేలా డిజైన్ చేశామని, చైనాలో త్రీ గార్జియస్ ప్రాజెక్టు ద్వారా మాత్రమే అంత ఎక్కువ వాటర్ డిశ్చార్జి అవుతోందని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఉండ తగని వ్యక్తి రాజకీయాల్లోకి వస్తే ఇలాగే జరుగుతుందని మాజీ సీఎం జగన్‌పై సీఎం చంద్రబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. 'ఆయన రావడం తప్పు కాదు. క్షమించరాని నేరం. అప్పటి నా కష్టాన్ని బూడిదలో పోసిన పన్నీరు చేశారు. వైసీపీ ప్రభుత్వం రావడమే రివర్స్ టెండరింగ్ అన్నారు. అధికారంలోకి వచ్చిన ఐదు రోజుల్లోనే కాంట్రాక్టు ఏజెన్సీని మార్చేశారు. 2020 వరదల్లో దయాఫ్రం వాల్ 35 శాతం పాడయ్యింది. రూ.480 కోట్లతో అత్యవసరంగా నిర్మిస్తే దానిని అలా చేశారు' అని వివరించారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని సీఎం చంద్రబాబు

వివరించారు. కొంతమేర కాపర్ డ్యాం కట్టకపోవడంతో వరద తాకిడికి దయాఫ్రం వాల్ దెబ్బతిందని వివరించారు. దెబ్బతిన్న దానికి సమాంతరంగా మరోటి నిర్మిస్తే రూ.447 కోట్లు వ్యయం అవుతుందని, మొత్తం అంతా కట్టాలంటే రూ.990 కోట్లు అవుతుందని చెప్పారు. రెండు కాపర్ డ్యామ్‌లను రూ.550 కోట్లతో నిర్మించారని పేర్కొన్నారు. రూ.2 వేల కోట్లు కాపర్ డ్యాం గ్యాప్ నిర్మాణానికి అవుతుందని, ఇప్పుడు ప్రాజెక్టు పూర్తి కావాలంటే 4 ఏళ్ల సమయం పడుతుందని చెబుతున్నారని తెలిపారు. కాపర్ డ్యాం సీపేజీలు ఉన్నాయి.. వరదలు వస్తే మరింత నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంత నష్టం చేయాలో అంత నష్టం ప్రాజెక్టుకు చేకూర్చారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం ఏడాదికి సరాసరిన రూ.13,683 కోట్లు ఖర్చు చేశామని, పోలవరం ప్రాజెక్టులో ఎలాంటి రహస్యాలు లేవు.. కేస్ స్టడీగా అందరికీ తెలియాలి చంద్రబాబు వివరించారు. ప్రాజెక్టు పూర్తిగా అస్తవ్యస్తమైందని, ప్రాజెక్టు కొట్టుకుపోతే ఇక రివర్స్ టెండరింగ్ ఏమిటీ? అని చంద్రబాబు ప్రశ్నించారు. కాపర్ డ్యాం గ్యాప్‌లు నింపే సమయంలోనే కాంట్రాక్టర్‌ను మార్చేశారని, పోలవరం ప్రాజెక్టు గురించి ఏమీ తెలియకపోవడం అతని ఇజం, మూర్ఖత్వం అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ సరిగ్గా అమలు చేయకుండా ప్రాజెక్టుని మరింత క్లిష్టంగా మార్చారని మండిపడ్డారు. మొత్తంగా పోలవరం ప్రాజెక్టుకి సంబంధించి చాలా సమస్యలు ఉన్నాయని, వాటన్నింటిని పరిష్కరించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. జగన్ రాజకీయాల్లో ఉండదగిన వ్యక్తి కాదని, అందుకే అతడికి ఈ పరిస్థితి వచ్చిందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.




# శ్రమజీవుల బ్రతుకులు మారలే

## ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్




**భీమదేవరపల్లి జూన్ 17 (నినాదం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం కొరకు సకల జన సమ్మెలో శ్రమజీవులుగా మా వంతుగా తెలంగాణ రావడానికి నిరంతరం పోరాటాలు చేసినం తెలంగాణ వచ్చి కూడా మా బ్రతుకులు మారలేదు అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్ అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో విలేకరులతో మాట్లాడుతూ 100 కేజీల బస్తాలు మోసి ఎన్ని వెన్నుపూసలు విరిగిన కాలు చేతులు వంకర్లు పోయిన రైతులు వెన్నంటే ఉండి వారు పండించిన పంటలను మిల్లర్లకు పంపే వరకు మేము నలిగిపోతున్న హమాలీలుగా గుండె నిబ్బరంతో బ్రతుకుతున్న ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన హమాలీల బ్రతుకులు మారలే చేసిన రోజు కూలియ అనే విధంగా మా బ్రతుకులు ఉన్నాయి ఇప్పుడు హనుమ కొండ జిల్లా మార్కెట్లలో గ్రామ మండల ఐకెపి సెంటర్లో ట్రాన్స్పోర్ట్ లలో బజారు అమాలి రైస్మిల్ లో కంపెనీలలో చిన్నచిన్న వ్యాపారులను వద్దనుండి స్టీలు సిమెంటు నిత్యవసర వస్తువులు ప్రజలకు చేరే విధంగా కోడి కూత మొదలు రాత్రి పడుకున్న వరకు మేము మేము సంవత్సరాలుగా పనిచేసిన మా బ్రతుకులు ఏమీ మారలేదు ఆ సాముల పాల నుండి మొదలుకొని కూరగాయలు రైతులు పండించిన పంటలను అమ్ముకునే వరకు కొనుగోలుదారులు మార్కెట్ నుండి కంపెనీలకు పంపే వరకు బస్టాండ్ సెంటర్లో మిల్లర్లో కంపెనీలలో మేము హమాలీ లుగా పనిచేస్తూ వంద సంవత్సరాల ఈ ప్రభుత్వానికి సంపద సృష్టించే అమాలి కార్మికులం మేము ఇప్పటికైనా మా బ్రతుకులు ఏమీ మారలేదు సంక్షేమ మాకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి వలస కార్మికులను నివారించే స్థానికులకు పని కల్పించే వరకు అమాలీలు బ్రతుకులు మారుటకై నిరంతరం అమాలి పక్షాన ఐఐటిసి లో చేరి సమస్యల పోరాటాలు చేస్తామని అమాలి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి గుర్తింపు కార్డు ప్రభుత్వం ఇవ్వాలి 50 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికునికి పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలి ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి 20 లక్షల రూపాయలు ఎక్స్రే ఇవ్వాలి. హమాలీ కార్మికులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల స్థలాలు ఇవ్వాలి హమాలీ కార్మికులకు పిఎఫ్ ఎస్ఐ హెల్త్ కార్డులు వర్తింపజేయాలి హామాలి కార్మికులు ప్రభుత్వం సబ్సిడీ కింద బ్యాంకు రుణాలు పది లక్షల వరకు ఇవ్వాలి జక్కు రాజు గౌడ్ డిమాండ్ చేసినారు ఈ కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘం జిల్లా నాయకులు ధర్మల రామ్మూర్తి అమ్మాలి ఆఫీస్ బేరర్స్ శనివారం రాజకుమార్ కర్ర కుమారస్వామి, చిట్టెంపల్లి రమేష్, టేకుమట్ల కుమారస్వామి, మైకం శ్రీనివాస్, మాగిల్ల శ్రీనివాస్, మాగిల యాదగిరి, నీలం సమ్మయ్య, మారుపాక కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

**అల్వాల్, జూన్ 17 (నినాదం న్యూస్):** మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న ఆర్యుబి, భూగర్భ డ్రైనేజీ, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ వంటి అనేక సమస్యలు పరిష్కరించేందుకు తాను ప్రజలతో ఉంటానని ఎంపీ ఈటెల రాజేందర్ చెప్పారు. సోమవారం అల్వాల్ సర్కిల్ లో మచ్చ బొల్లారం, అల్వాల్, వెంకటపురం డివిజన్ లలో ఆయా డివిజన్ ల కార్యవర్గ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అల్వాల్ సర్కిల్ లోని డివిజన్ ల కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, వివిధ సంఘాల నేతలు ఈటలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీగా తనను గెలిపించిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన బాధ్యత అని వారి సేవకుడిగా నిరంతరం వారికి అందుబాటులో ఉంటానని అన్నారు. డివిజన్ లో పరిధిలో నెలకొన్న రైల్వే వంతెనెల సమస్యలు, కలుషిత చెరువులు, నాళాల అభివృద్ధి మొదలగు సమస్యలను పరిష్కరిస్తానని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గం లో నెలకొన్న అనేక సమస్యల్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పరిష్కరించే బాధ్యత తన దన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం నాయకుడిగా తన బాధ్యత అని వెల్లడించారు. వచ్చే ఐదు ఏళ్లలో మల్కాజ్గిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని వివరించారు. ముదిరాజ్ సంఘం తరపున అధ్యక్షుడు విజయ్ కుమార్, నర్సింగ్ రావు ఈటెల రాజేందర్ కు సంఘ సభ్యులతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రవణ్ కుమార్, బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భాను ప్రకాష్, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీకే మహేష్, నాయకులు, తూప్రాన్ లక్ష్మణ్, కార్తీ గౌడ్,చింతల మాణిక్య రెడ్డి, మల్లికార్జున్ గౌడ్, మాచర్ల శ్రీనివాస్, కందికంటి వీణ, చంద్రశేఖర్ యాదవ్, అజయ్ రెడ్డి, ప్రతిభ, గోపి, అరవింద్ రెడ్డి, నాగరాజు, నాగి, రామ్ సింగ్, కంటి కవిత, యశ్వంత్, కృష్ణారెడ్డి, సంతోష్ గౌడ్, మహేందర్ పాల్ సింగ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్



**భీమదేవరపల్లి జూన్ 17 (నినాదం న్యూస్) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలను జరుపుకున్నారు. కొత్తపల్లి గ్రామంలో జామా మసీదు వద్ద మౌళిల్ సాబ్ ఎండి షాదిక్ పాషా బక్రీద్ గొప్పతనాన్ని గూర్చి తెలియజేశారు. త్యాగానికి భక్తికి మారుపేరు బక్రీద్ అని ఈ సందర్భంగా అన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు విరవకుండా దేవునిపై విశ్వాసాన్ని కలిగి సన్మార్గంలో జీవనాన్ని సాగించే గొప్ప సందేశాన్ని బక్రీద్ పండుగ మానవాళికి ఇస్తున్నదని తెలిపారు. తమకు కలిగిన దాంట్లో నుంచి ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ పండుగ మనకు కలిగిస్తుందని మతపెద్దలు అన్నారు. ఈ వేడుకలలో ముస్లిం మత పెద్దలు ప్రజలు, ఎండి రషీద్ పట్టు పరిశ్రమ అధికారి కరీంనగర్, ఎండి కాజామియా మోదం సాబ్, ఎండి యాకూబ్ , ఎండి యాకూబ్, ఎండియాకుబ్, ఎండి అహ్మద్ పాషా, ఎండి రహీం, ఆదిల్, అజీజ్, అప్సర్, అజారుద్దీన్, నిజాముద్దీన్, పోలీస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యాపారంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే ఎదుగుదల ఉంటుంది - జానకి రెడ్డి



**మునగాల,జూన్ 17(నినాదం న్యూస్):** మునగాల మండల కేంద్రం స్థానిక గణపవరం రోడ్డు సెంటర్లో తాడువాయి గ్రామానికి చెందిన అన్నదమ్ములు బానోతు గోపి,ఘనీ ఆధ్వర్యంలో చాయ్ దునియా ఫ్రాంచెజ్ సెంటర్ ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మునగాల మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుల ఉప్పుల జానకి రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి చాయ్ దునియా ఫ్రాంచెజ్ సెంటర్ ప్రారంభించారు. అనంతరం జానకి రెడ్డి మాట్లాడుతూ నేటి తరం యువకులు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల మీదనే ఆధారపడకుండా స్వశక్తిగా ఆదాయ మార్గాలను అన్వేషించి ఖచ్చితమైన నిర్ణయంతో ముందుకు నడవాలని, అదేవిధంగా ఏ వ్యాపారమైన ప్రారంభించిన తర్వాత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే వ్యాపార అభివృద్ధి తో పాటు కస్టమర్ల మన్ననలను పొందుతారని,మొత్తానికి సోదరులు గోపి, ఘని తమ కాళ్ళ మీద తాము నిలబడేందుకు చేసిన ఈ ప్రయత్నాన్ని మనస్ఫూర్తిగా హర్షిస్తున్నాని, మీరు వ్యాపార అభివృద్ధి పొంది నేటి యువతరానికి ఆదర్శం తో పాటు మార్గదర్శకం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాటికొండ సురేష్, బానోతు గోపి కృష్ణ, బత్తిని తరుణ్ కుమార్ గౌడ్, చీకటి శ్రీను, గాయం శ్రీనివాసరెడ్డి, ఉప్పుల నర్సిరెడ్డి, తాడువాయి, మునగాలకి చెందిన యువకులు పాల్గొన్నారు.

## కొత్తకొండను మండలం చేయాలని మంత్రికి వినతి



**భీమదేవరపల్లి జూన్ 17(నినాదం న్యూస్):** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కొత్తకొండను మండలం చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలని సోమవారం హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కు కొత్తకొండ గ్రామస్తులు వినతి పత్రం అందజశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మండలాల పునర్విభజన, కొత్త మండలాల ఏర్పాటు ప్రక్రియ మొదలుకాగానే కొత్తకొండను మండలంగా ఏర్పాటు చేస్తానని స్పష్టం చేశారు. కబ్జాకు గురవుతున్న ప్రముఖ కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయ భూముల విషయం గూర్చి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.గత ప్రభుత్వ హాయంలో ఏమైనా తప్పిదాలు జరిగి, భూమి కబ్జాకు గురైతే దానిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. శ్రావణమాసంలో జరిగే శ్రీ వీరభద్ర స్వామి నక్షత్ర దీక్ష కు వచ్చి స్వామి దీక్ష తీసుకొని కొత్తకొండ నుంచే పరిపాలన సాగిస్తానని తెలిపారు.

# గంజాయి విక్రేతల అరెస్ట్

## ఆరు కిలోల గంజాయి, 12 సెల్ ఫోన్లు, మూడు మోటార్ బైకులు, 46 వేల నగదు స్వాధీనం - డీఎస్పీ. కే. రాజశేఖర రాజు



**మిర్యాలగూడ,జూన్ 17(నినాదం న్యూస్):** యువతకు గంజాయి అలవాటు చేసి, వారి ద్వారా గంజాయిని విక్రయిస్తూ వారిని మాదక ద్రవ్యాలకు బానిసలుగా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు మిర్యాలగూడ డి.ఎస్.పి. కే రాజశేఖర్ రాజు తెలిపారు. సోమ వారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా పురుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుండి కొంతమంది వ్యక్తులు అక్రమంగా గంజాయి ని తీసుకువచ్చి దామరచర్ల మిర్యాలగూడ మండలాలలో యువతకు గంజాయి విక్రయిస్తూ . వారిద్వారా గంజాయి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. నల్గొండ ఎస్పీ ఆదేశాల మేరకు తన పర్యవేక్షణలో మిర్యాలగూడ రూరల్ సీఐ కే వీరబాబు ఆధ్వర్యంలో వాడపల్లి ఎస్సై మరియు వారి సిబ్బందితో కలిసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి అమ్మే వ్యక్తులను 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా దాచేపల్లి మండలానికి చెందిన సాకేటి పోలినాయుడు అతని కొడుకు తిరుపతి నారం నాయుడులు తమకు పరిచయం ఉన్న విశాఖపట్నం జిల్లా పాడేరు నుండి బాబి అనే వ్యక్తి దగ్గర గంజాయి కొని రైళ్లలో బస్సులలో పల్నాడు జిల్లా దాచేపల్లి కి తరలించి అక్కడి నుండి తెలంగాణ సరిహద్దు దామచర్ల మిర్యాలగూడ మండలాల్లో విక్రయిస్తున్నారు. గంజాయిని చిన్న పొట్లాలు, సిగరెట్ పీకలు మాదిరిగా రూపొందించుకొని విక్రయిస్తూ వారి ద్వారా మరల గంజాయి 30 గ్రాముల ప్యాకెట్లుగా తయారుచేసి విక్రయిస్తున్నారని వివరించారు. గంజాయి అమ్మడమే కాకుండా యువతను తప్పుదోవ పట్టిస్తూ వారి అనారోగ్యానికి కారణం అవుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు డిఎస్పి వివరించారు . సోమవారం ఉదయం తమకు ఈ విషయమే నమ్మదగిన సమాచారం రాగా వాడపల్లి ఎస్సై తన సిబ్బందితో కలిసి బత్తల పాలెం గ్రామ శివారులోని రైల్వే అండర్ పాస్ వద్ద అదే సమయంలో 12 మంది నేరస్తులు వారి వద్ద నుండి మూడు మోటర్ బైక్లను , గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇలాంటి నేరస్థుల విషయంలో గుర్తించి పోలీసులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా చేసిన మిర్యాలగూడ రూరల్ సీఐ, వాడపల్లి ఎస్సైలను ఆయన అభినందించారు. సమావేశంలో మిర్యాలగూడ దామరచర్ల సిఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

**యువత తల్లిదండ్రులకు డిఎస్పి సూచన...** ప్రస్తుత సమాజంలో తమ పిల్లల నడవడికను ముందుగా తల్లిదండ్రులు గుర్తించాలని వారి నడవడిక, ప్రవర్తన, అలవాటులో మార్పులను గమనించి జాగ్రత్త వహిస్తే వారి భవిష్యత్తు కాపాడిన వారు అవుతారని డి.ఎస్.పి కే రాజశేఖర్ రాజు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.



## సంపాదకీయం

# ఆత్మస్తుతి.. పరనిందలో నేతలు!

ఎన్నికల్లో ఓడిపోయిన సందర్భాలలో అధికారం కోల్పోయిన పార్టీలు ఆత్మవిమర్శ చేసుకోవాలి. కారణాలు తెలుసుకోవాలి. అంతా మంచి చేస్తే ప్రజలు ఎందుకు ఓడిరచారో గుర్తించాలి. ఏరకమైన పొరపాట్లు దొర్లాయో విశ్లేషించాలి. కానీ అలా జరగడం లేదు. ఎపిలో అయితే మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి మాత్రం ఆత్మ విమర్శకు సిద్ధపడకపోగా పరనిందకు తెగబడుతున్నారు. ఇవిఎంలు శకుని పాచికల్లా పనిచేశాయని, ఇవిఎంల తీరుపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలన్నారు. అలాగే ఎపిలో రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బ తిన్నాయని గొల్లున ఏడ్చేస్తున్నారు. ఇదంతా గతమనే విషయాన్ని మరిచారు. తెలంగాణలో కెసిఆర్‌ కూడా ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే మళ్లీ మనదే అధికారం అంటూ పార్లమెంట్‌ ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికారు. ఈ ఇద్దరు నేతలకు ఆత్మపరిశీలన చేసుకోవడం కన్నా...పరనిందతో పోతే సరిపోతుందన్న భావనలో ఉన్నారు. నిజానికి మోడీ బాణం కూడా గురితప్పింది. ఈ ఎన్నికలు తెలుగు రాష్ట్రాల పాలకులు జగన్‌, కెసిఆర్‌లతో పాటు, మోడీకి కూడా గుణపాఠం లాంటివే. ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ మళ్లీ ఎన్నికల నాటికి ప్రజాభిమానం చూరగొనడానికి ప్రయత్నిస్తుంది. ప్రజల్లోకి వెళ్లి మంచి చేయడం ద్వారా లేదా చేసిన చెడును ఒప్పుకోవడం ద్వారా ప్రజలకు చేరువ కావాలి. కెసిఆర్‌ మాత్రం ఇంకా భ్రమల్లోనే ఉన్నారు. కమిషన్లు, విచారణలు తూచ్‌ అంటున్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వంఫెయిల్యూర్‌ అంటూ కల్వకుంట్ల కుటుంబం రోజూ తిట్టి పోస్తున్నారు. ఇకపోతే ఆత్మవిమర్శ అన్నది..జగన్‌ ఆయన పార్టీ నేతల్లో కనిపించడంలేదు. తప్పంతా ప్రజలదే అన్నట్టుగా ఆత్మవంచనకు పాల్పడుతున్నారు. చెడు చేసి ఓడితే బాధపడాలి కానీ, మంచి చేసి ఓడితే బాధపడకూడదని రోజాలాంటి వారు వితండవాదం చేస్తున్నారు. నిజంగా మంచి పాలనే ఇస్తే ప్రజలెందుకు ఓడిస్తారన్నది చెప్పాలి. ఎమ్మెల్యేలు, ఎంపీలతో జరిపిన సమావేశాల్లో జగన్‌రెడ్డి ఉపన్యాసం తీరు ఆయన వితండ వాదాన్ని సూచిస్తోంది. జగన్‌ మారతారని భావించడం భ్రమే అవుతుంది. తన పాలనకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలూ ఎందుకు ఏకమయ్యారో గుర్తించలేక పోతున్నారు. తన పాలనలో వ్యవస్థలు ఎలా భ్రష్టు పోయాయో గ్రహించడం లేదు. శాంతిభద్రతలు ఎంతగా దిగజారాయో గుర్తించడం లేదు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి సాధించిన ఘన విజయాన్ని సాంకేతిక విజయం మాత్రమేనని ఆడిపోసుకుంటున్నారు. జగన్‌రెడ్డే అసలైన ప్రజా నాయకుడని, ప్రజల మద్దతు ఆయనకే ఉంటుందని ప్రచారం చేస్తూ ఆత్మవంచన చేసుకుంటున్నాయి. ఈవీఎం ట్యాంపరింగ్‌ వల్లే జగన్‌ ఓడిపోయారని ప్రచారం చేస్తున్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌ అసాధ్యమని ఇదే జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల తర్వాత తేల్చి చెప్పడాన్ని వారు మరచిపోయారు. ఈవీఎంల ద్వారా ప్రజల తీర్పును తారుమారు చేయలేరని అనేక సందర్భాలలో ఎన్నికల కమిషన్‌ రుజువు చేసింది. చంద్రబాబు విజయానికి ప్రధాని నరేంద్ర మోదీ లేదా ఎన్నికల కమిషన్‌ పరోక్ష సహకారం ఉందని ప్రజలను నమ్మించే విఫలయత్నం చేస్తున్నారు. ఇకపోతే తాజా ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి 2019 మాదిరి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే మెజారిటీ లభించలేదు. ఈవీఎంల ట్యాంపరింగ్‌ సాధ్యమయ్యే పక్షంలో చంద్రబాబు విజయానికి సహకరించిన మోదీ తన సొంత పార్టీకి మెజారిటీ సీట్లు సాధించుకోలేరా అన్నది వైసిపి నేతలు ఆలోచన చేయాలి. ప్రభుత్వ పనితీరు అదరహో అని ప్రచారం చేస్తూ , విపక్షాన్ని విమర్శిస్తూ పోయారు. దత్తపుత్రుడు అంటూ పవన్‌ కళ్యాణ్‌ను అదేపనిగా విమర్శించారు. నమ్మించారు. ప్రజలంతా జగన్మోహన్‌ రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారని నమ్మించారు. వైనాట్‌ 175 అంటూ ప్రగల్భాలు పలికారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ముందు కెసిఆర్‌ కూడా ఇలాగే చెప్పారు. మా లెక్కలు మాకున్నాయన్నారు. మీరంతా డంగపోవాల్సిందేనని అన్నారు. మోడీ కూడా 400 సీట్లు ఖాయమని ప్రచారం చేసుకున్నారు. దేశంలో కానీ, రాష్ట్రాల్లో కానీ ప్రజలకు మంచి పనులు చేయకుండా వ్యక్తిగత డంబాచారాలకు పోయిన నేతలు భంగపడ్డారు. ఇందుకు మోడీ అతీఉడేమీ కాదు. 2019 కంటే ఎక్కువ శాతం ఓట్లు, సీట్లు వస్తాయని నమ్మబలికారు. సంక్షేమ పథకాల వల్ల పేదల జీవితాలు మారిపోయాయని, సామాజిక న్యాయం అద్భుతం గా జరిగిందని ప్రచారం చేసుకున్నారు. దేశ చరిత్రలో ఏ నాయకుడు కూడా సాహసించని నిర్ణయాలను జగన్‌రెడ్డి తీసుకొన్నారని వైకాపా నేతలు ఊరూవాడా ఊదరగొట్టారు. జగన్‌ పేదలు, పెత్తందారులు అంటూ సమాజాన్ని విభజించే ప్రయత్నం చేసి బొక్కబోర్లా పడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఉన్మాద మూకను పెంచి పోషించినందుకు జగన్మోహన్‌రెడ్డి తగిన మూల్యం చెల్లించుకున్నారు. ఇప్పటికూనా ఆత్మపరిశీలన చేసుకొని వాస్తవిక దృక్పథంతో ఆలోచించడం నేర్చుకోవాలి. నేతలు నిజాలు తెలుసుకోవాలి. ప్రజలు గొల్లున అరుస్తున్నా పట్టించుకోకుండా పాలన చేస్తే సరికాదని గుర్తించాలి. ఇప్పటికైనా అధికారంలో ఉన్న నేతలు ప్రజలకు మేలు చేకూర్చే పనులపై దృష్టి పెట్టాలి. దేశం ఎదుర్కొంటున్న ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్యలను ప్రధానంగా పరిష్కరించాలి. ఓడిన నేతలు ఆత్మస్తుతి, పరనింద చేయడం వల్ల ప్రయోజనం లేదు. ఈవీఎంలలో ఏదో జరిగిపోయిందని చెప్పే వారు, దానిని నిరూపించగలగాలి. ఎన్నికలకు ముందు ఐదేళ్ల అరచాక పాలన చేసిన జగన్‌, ఇప్పుడు ఫలితాల అనంతరం జరిగిన స్వల్ప సంఘటనలను భూతద్దంలో చూపినంత మాత్రాన ప్రజలు నమ్మరు. తన పాలనలో జరిగిన దురాగతాలను ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు. ఇది అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుంది. నేతలందరికీ వర్తిస్తుంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. విపక్షంగా నిర్మాణాత్మక పాత్ర పోషించాలి. ప్రభుత్వానికి సరైన సూచనలు చేసే అలవాటు చేసుకోవాలి. అప్పుడే ప్రజలు ఆదరిస్తారు.

# నిర్మల రాధక్కగా మారిన తీరు

- గొర్రెపాటి మాధవరావు

ఆ బాలికకు అమ్మా నాన్నలు పెట్టిన పేరు నిర్మల. చదివింది మామూలు పాలిటెక్నిక్‌ కోర్సు మాత్రమే. విద్యార్థిగా ఉన్నప్పుడే స్టూడెంట్స్‌ ఫెడరేషన్‌ (ఎస్‌. ఎఫ్‌.... ఎస్‌ ఎఫ్‌ ఐ కాదు. ఎస్‌ ఎఫ్‌ ఐ 1970 డిసెంబర్‌ 30 న ఏర్పడింది ) లో చురుకైన కార్యకర్త. ఏ విద్యార్థికి అన్యాయం జరిగినా సివంగి లా ముందుకు ఉరికేది. తోటి విద్యార్థులని కూడగట్టి పోరాటం చేసేది. భావి భారత విప్లవకారిణి ఈజ్‌ ఇన్‌ ది మేకింగ్‌!! చదువు అయిపోగానే ఏదో ఉద్యోగం వెతుక్కోవచ్చు. దొరికేది కూడా. ఆనాడు పరిశ్రమలకి అవసరమైనంతమంది సాంకేతిక నిపుణులు దొరికే వారు కాదు. అందువల్ల ఉద్యోగం దొరకడం పెద్ద కష్టం అయ్యి ఉండేది కాదు. ఉద్యోగం అంటే ఊడిగమే అనుకుంది నిర్మల. మరి ఏంచేయాలి?

విజయవాడలోని మార్క్సిస్టు పార్టీ ఆఫీస్‌ లో కార్యకర్తగా చేరింది. అక్కడికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కార్యకర్తలూ, నాయకులూ చెప్పే పార్టీ కబుర్లు వినేది. రకరకాల పేపర్లు చదివేది. క్రమంగా క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న కార్యకర్తల, నాయకుల మాటలతో బయట ఏమి జరుగుతున్నదో తెలుసుకుంటోంది. పత్రికల్లో వచ్చే పార్టీ విశేషాలూ, విశ్లేషణలతో సిద్ధాంత స్థాయినీ పెంచుకుంటోంది. చిన్న వయసు లోనే పెళ్లి. ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల కలిగారు. ఆఫీసు పని అంటే ఓ రకమైన మోనోటనీ. ఆయినా విసుగు లేకుండా పని చేసేది.

నాయకులకూ, కార్యకర్తలకూ ఏది అవసరమైనా' అమ్మా నిర్మలా ఫలనాది కావాలి అన్నా, ఫలానా వస్తువు ఎక్కడుంది అన్నా అది క్షణాల్లో వారి ముందు ఉంచేది. మొండితనం జాస్తి, కాస్తంత పెంకితన మూనూ. తన పని విప్లవం లో భాగమేనని నమ్మి నాయకులు చెప్పిన పనిని పూర్తి చేసేంత వరకూ విశ్రమించేది కాదు.

అర్జునుడు పూరించిన దేవదత్తం కురుక్షేత్రాన దిక్కులు పిక్కటిల్లేలా చేసిందో లేదో గానీ నక్సల్బరీ బక్కరైతు పూరించిన పర్జన్య శంఖపు ధ్వని తరంగాలు దేశం నలుమూలలా ప్రకంపనలు సృష్టించాయి; ప్రతిధ్వనించాయి. పాలకుల వెన్నులో చలి! కమ్యూనిస్టు విప్లవకారుల తనువంతా పులకరింత!! నిద్రపోయిందనుకున్న భారత విప్లవం పీకింగ్‌ రివ్యూ పత్రిక తో "వసంతకాల మేఘ గర్జన" మకుటంతో సంపాదకీయమే రాయించింది.

పార్టీ పాలకొల్లు ప్లీనమ్‌ లో తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వేంకటేశ్వర రావు, చంద్ర పుల్లారెడ్డి త్రయం చేసిన సిద్ధాంత, రాజకీయ కృషి ఎక్కువమంది హృదయాలను గెలుచుకుంది. మార్క్సిస్టు పార్టీ నుంచి విప్లవకారులు వేరుపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌ కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ కమిటీ అని నాయకత్వ కమిటీకి పేరుపెట్టుకున్నారు. 'తక్షణ కార్యక్రమాన్ని' ప్రకటించారు. విప్లవ వ్యూహ రచన చేయడానికి మద్రాసులో కమిటీ సమావేశం అనుకున్నారు. మీటింగ్‌ స్థలానికి చేరుకున్న వాళ్ళు చేరుకున్నట్లే పోలీసుల వలలో చిక్కారు. సకాలంలో చేరుకోలేని చంద్ర పుల్లారెడ్డి లాంటి వాళ్ళు కొద్ది మంది తప్పించుకోగలిగారు. ఆది లోనే హంసపాదు!! పురిట్లోనే సంది కొట్టడం అంటే ఇదేనేమో!!

నక్సల్బరీ బక్క రైతు పూరించిన శంఖ ధ్వని నిర్మల మనసంతా ఆవహించింది. తాను నేర్చుకున్న సిద్ధాంత, రాజకీయాలకు పనిపెట్టే కాలం తనకోసం ఎదురు చూస్తోంది. నిర్మల మనసు ప్రశాంత సంద్రంలా లేదు. దేవాసురులు మర్దిస్తోన్న పాల కడలి లా అల్ల కల్లోలంగా ఉంది. ఓ వైపు భర్త, ముగ్గురు పిల్లలు. తనని ముందుకు కదలనీయని కుటుంబ బాధ్యతలు.

సత్యాన్ని తెలుసుకోవడానికి సిద్ధార్థ గౌతముడు యశోధరనూ, రాహులుడినీ, సింహాసనాన్నీ త్యజించలేదా? విప్లవం కోసం మార్క్స్‌–జెన్నీ జంట చేసిన అపూర్వ త్యాగాలో? పుట్టిన పిల్లలు వైద్యం లేక ఒకరి తర్వాత మరొకరు చచ్చిపోతుంటే కూడా వారు పోరు బాట వదలలేదే!

క్యూబా ప్రభుత్వం లో కాస్ట్రో తరువాత స్థానంలో ఉన్న చే గెవేరా భార్యనూ, నలుగురు పిల్లలనూ, మంత్రి పదవినీ, కేంద్ర బ్యాంకు అధ్యక్ష హోదానూ గడ్డి పోచలా నెట్టేసి మళ్లీ తుపాకిని భుజాన వేసుకుని ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఖండాలలో విప్లవాల సృజనకై పోరు బాట పట్టినాడే!! వాళ్లంతా గొప్పవాళ్ళు.!! తనకు అంత తెగువ ఉందా? పరిపరి విధాల పోతున్నాయి నిర్మల ఆలోచనలు.మద్రాసులో పెద్ద నాయకులు అరెస్టు కాగానే నిర్మల ఆలోచనల్లో మార్పు రాసాగింది. పాలకొల్లు విజయం, ప్లీనం జరిగిన నిమ్మ తోటల్లోనే ఇంకి పోవాలా? పిరికి పందలు అని ముద్ర కొట్టదా మైనారిటీ!? అరెస్టు కాకుండా మిగిలిన నాయకత్వం ఏమి చేయబోతోందో?

విశాల రైతాంగం కలిగిన ఇండియా లాంటి అర్ధ భూస్వామ్య, అర్ధ వలస దేశాలలో ఎలాంటి స్థావరాల నుంచి విప్లవాల పురోగమనం సాగింది? వివిధ దేశాలలో సంభవించిన విప్లవాల చరిత్రను ఔపోసన పట్టే గదా చంద్ర పుల్లారెడ్డి మానికొండ సుబ్బారావు తో కలిసి "ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర" ను రాసింది? అంటే తప్పని సరిగా కొండలనూ అడవులనే ఎంపిక చేస్తారు. షాంఘైలో ఊచకోతకు గురైన తర్వాత తన బలగాలను చైనా కమ్యూనిస్టు పార్టీ చింకాంగ్‌ పర్వతాలకు కదా తరలించింది! మావో ప్రత్యక్ష నేతృత్వాన ఎదిగి వచ్చిన పోరాటం అది. క్యూబా... క్యూబా కూడా అంతేగా..క్యూబాలో విప్లవ సృజనకు మెక్సికో నుంచి బయలు దేరిన 86 మంది లో 74 మంది క్యూబా నేల మీద అడుగు పెట్టక ముందే హతమయి పోయినప్పుడు మిగిలిన 12 మందినీ తీసుకుని కాస్ట్రో ముందుగా అనుకున్నట్లు గా హావానా కు కాక సియెర్రా మాయెస్త్రా కొండలకు కదూ తీసుకు పోయింది? వియత్నాం విప్లవం చావో రేవో తేలేది ఈ హాంబర్గర్‌ కొండల్లోనే అని కదూ హోచిమిన్‌ తెగేసి చెప్పింది. కొండలూ, పర్వతాలూ, అడవులూ సహజ రక్షణ ఇస్తాయి. గెరిల్లాల శిక్షణకు అనువైన టెర్రయిన్‌. గెరిల్లా పోరులో శత్రు బలగాలను ముప్పుతిప్పలు పెట్టడానికి పెట్టనికోటలు. అంటే ఏ కొండ ప్రాంతాలకో జరగబోతోందన్న మాట ప్రస్థానం! తాను మనసికంగా దైహికంగా తయారు కావాలేమో! అమ్మా అంటూ తనని చుట్టుకు పోయే పిల్లలను ఏమి చేయాలి? ఎటూ పాలు పోవడం లేదు.

పోట్ల రామనర్సయ్య ములుగు ప్రాంతానికీ, చంద్ర పుల్లారెడ్డి ఇల్లందు ప్రాంతానికి చేరుకున్నారు. వర్గ నిర్మూలన అంటే వర్గశత్రువును వ్యక్తులుగా చంపడమే నని నక్సల్బరీ నాయకత్వం చేసిన వికృత వ్యాఖ్యానంతో పుల్లారెడ్డి, నాగిరెడ్డిలు అంగీకరించలే. అదేమి విషాదమో కానీ శ్రీకాకుళం జిల్లా కమిటీ "ఖతం" బాట పట్టింది. ఇది కాదు విప్లవం అంటే. ప్రత్యామ్నాయం కావాలి. ప్రజలు ఉద్యమించకుండా ప్రజల తరపున ఉద్యమిస్తే అది ప్రజలను నిష్క్రియా పరుల్ని చేస్తుంది. ప్రజలు లేకుండా ప్రజా విప్లవం ఎక్కడిది?

చంద్ర పుల్లారెడ్డి, పోట్ల రామనర్సయ్యలు అడవి బాట పట్టగానే నిర్మల కూడా నలుగురైదుగురు మహిళా కార్యకర్తలతో అడవి బాట పట్టింది. వేషం మార్చుకుంది. ఆదివాసీలలో ఆదివాసీ అయిపోయింది. వనం లో వనజ అయ్యింది. నిర్మల రాధక్క గా మారిపోయింది.

నక్సల్‌ బరీకి ప్రత్యామ్నాయం గోదావరి లోయ. తెలంగాణ సాయుధ పోరాట యోధులైన దొరన్న, ధర్మన్న, బాటన్న, కోటన్నలు చంద్ర పుల్లారెడ్డి (సీపీ) కి తోడయ్యారు. ఫారెస్ట్‌ కాంట్రాక్టర్ల లాభాలు తగ్గిపోయాయి. సర్కారు శరణు జొచ్చారు వారు. ఏలిన వారు పోలీసులను దింపారు. కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు. కూలికి వెళ్ళిన ఆదివాసీలపై కూడా దాడులు! ఉద్యమాన్నీ కార్యకర్తలనూ రక్షించుకోవాలి. ఎలా?

**ఆశయాలు సంఘర్షించే వేళ ఆయుధం అలీనంగా ఉండజాలదు:**

తెలంగాణ సాయుధ పోరాటంలో పనికి వచ్చిన గుతపలూ దుడ్డు కర్రలూ ఇప్పుడు పనికిరావు. అప్పుడే న్యాయ శాస్త్ర విద్యను ముగించుకొని లాయర్‌ ప్రాక్టీస్కు వెళ్లకుండా ఉద్యమం కోసం అడవి బాట పట్టిన బత్తుల వెంకటేశ్వరరావు బృందం 1969 ఏప్రిల్‌ 16న పగిడేరు అడవిలో ఫారెస్ట్‌ గార్డు నుంచి తుపాకిని లాక్కుంది. దాంతో ప్రభుత్వం పోలీసు క్యాంపులు పెట్టింది. ఉద్యమాన్ని రక్షించుకోవడం కోసం, కార్యకర్తల స్వీయ రక్షణ కోసం ఉద్యమ నాయకత్వం ఆయుధాలను సేకరించి కార్యకర్తలకు ఇచ్చింది. ఆయుధ ప్రయోగంలో వారికి శిక్షణ ఇచ్చింది. రాధక్క కూడా శిక్షణ పొందింది. శిక్షణ పొందిన వారిని దళాలుగా ఏర్పరిచింది నాయకత్వం. రాధక్క కూడా ఒక దళంలో సభ్యురాలు అయింది. ఫారెస్ట్‌ గార్డు నుంచి తుపాకీ లాక్కున్న ఘటనను ప్రభుత్వం తేలిగ్గా తీసుకోలేదు. విప్లవకారుల కోసం వేచి చూస్తున్నారు పోలీసులు.

1969 మే నెలలో మణుగూరు అడవి ప్రాంతమైన గొందిగూడెంలో విప్లవకారుల ఆచూకీ దొరికింది పోలీసులకు. ఒక్క పెట్టున దాడికి దిగారు. దళంలో కామ్రేడ్‌ సి పి, రాధక్క ఇంకా ఇతరులు ఉన్నారు. బత్తుల వెంకటేశ్వరరావు కూడా ఆ దళంలోనే ఉన్నాడు. పోలీసు దాడిలో రాధక్క తీవ్రంగా గాయపడింది. సిపి కూడా గాయపడ్డాడు. అగ్రనేతలను రక్షించుకోకపోతే ఉద్యమానికే దెబ్బ. రాధక్క నీ, సి పీ నీ మెల్లగా రిట్రీట్‌ కమ్మని కోరాడు బత్తుల. పోలీసుల దృష్టి మళ్లించడానికి తాను కాల్పులు జరుపుతూనే ఉన్నాడు. మెల్లగా రాధక్క సిపిలు రిట్రీట్‌ అయ్యారు. బత్తుల పోలీసు తూటాలకు నేలకు ఒరిగాడు. ఆ క్షణాన బత్తుల త్యాగమే లేకపోతే సి పి హతుడు అయి ఉండేవాడేమో?!. అప్పుడు గోదావరి లోయ ప్రతిఘటనా పోరాటం నిర్మాణం అయి ఉండేదా? ఏమో? మరొకరు వచ్చేవారేమో?!

చంద్ర పుల్లారెడ్డి నాయకత్వాన నిర్మాణమవుతున్న గోదావరిలోయ ఉద్యమం ఆంధ్రప్రదేశ్‌ కి మాత్రమే పరిమితమై ఉండేది. 1975 ఎమర్జెన్సీకి కొద్ది కాలం ముందు సత్యనారాయణ సింగ్‌ నాయకత్వాన బీహార్‌ లోనూ ఇంకా ఇతర రాష్ట్రాలలోనూ గల ఉద్యమంతో ఆంధ్రా ఉద్యమం విలీనమైంది. సిపికి కేంద్ర కమిటీ బాధ్యతలు పెరిగాయి. అడవిని వీడి బొంబాయి (అప్పటి) కి మకాం మార్చాల్సి వచ్చింది. రాధక్క కూడా సిపి కి తోడుగా వెళ్ళింది. అక్కడ రహస్య జీవితం. ఎమర్జెన్సీ అయిపోయాక మళ్లీ అడవి ఉద్యమ బాధ్యతల్ని నెత్తికి ఎత్తుకున్నారు.

రాధక్క ఉద్యమానికి చేసిన దోహదం ను పార్టీ గుర్తించింది. 1980 లో జరిగిన పార్టీ రాష్ట్ర మహాసభ రాధక్కను రాష్ట్ర కమిటీకి ఎన్నుకుంది. నక్సలైట్‌ ఉద్యమంలో రాష్ట్ర కమిటీకి ఎన్నికైన తొలి నాయకురాలు రాధక్క.

1982 లో అక్క అరెస్టయింది. 1984 లో పార్టీలో మరో సంక్షోభం. చంద్ర పుల్లారెడ్డి చేస్తున్న వాదనల కూ, పార్టీలోని ఇంకొందరు నాయకులు చేస్తున్న వాదనలకూ మధ్య పొత్తు కుదరలేదు. పార్టీ రెండు ముక్కలయింది. రాధక్క హైద్రాబాద్‌ పార్టీ ఆఫీసుకు చేరుకుని పార్టీ పత్రిక "విమోచన" ఎడిటోరియల్‌ బాధ్యతలు చేపట్టింది. పార్టీకి ఎక్కడ ఏ అవసరం వచ్చినా రాధక్క రెడీ గా ఉండేది. గన్ను పట్టాల్సి వచ్చినప్పుడ గన్ను పట్టింది. పెన్ను పట్టాల్సి వచ్చినప్పుడు పెన్ను పట్టింది. పార్టీ ఒక సంక్షోభం నుంచి మరో సంక్షోభాన్ని ఎదుర్కొంటూ చీలికలు పీలికలు అయింది. అలాంటి ఒక గ్రూపుకు రాధక్క కేంద్రకమిటీకి ప్రధాన కార్యదర్శి అయింది. కేంద్ర కమిటీకి ప్రధాన కార్యదర్శి అయిన మొదటి మహిళ కూడా రాధక్కే. భర్తనూ, పిల్లలనూ త్యజించి ఉద్యమం కోసం అడవి బాట పట్టిన తొలి మహిళ రాధక్క! గోదావరి లోయ ప్రతిఘటనా పోరాటాన్ని నిర్మించి విస్తరించిన మహిళా కార్యకర్తలలో అగ్రగామి రాధక్క! విప్లవ పార్టీ రాష్ట్ర కమిటీకి ఎన్నికైన తొలి మహిళ రాధక్క! నక్సలైట్‌ గ్రూపులలో ఒక గ్రూపు కేంద్ర కమిటీకి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై పనిచేసిన తొలి మహిళ రాధక్కే!! రాధక్కది అపురూప వ్యక్తిత్వం. శాల్యూట్‌ అక్కా.

( అక్క తో అప్పుడప్పుడూ మాట్లాడిన మాటలు, జ్ఞాపకం ఉన్నంత వరకు; మా బాబాయి పరుచూరి సీతారామయ్య, పి ఎస్‌, గారు అప్పుడప్పుడూ చెప్పిన మాటలు, గుర్తున్నంత వరకు... ఈ రైట్‌ అప్‌ కి వనరు)

రాధక్క 2024 జూన్‌ 11 న పొద్దున్న 9 గంటలకు హైదరాబాద్‌ లో మరణించారు.



(ఆధ్యాత్మిక చింతన )

# సర్వేజనా సుఖినోభవంతు !

అందరూ సంతోషంగా ఉండాలి. ఆరోగ్యంగా ఉండాలి. శుభాలనే అనుభవించాలి. ఎవ్వరూ బాధపడకూడదు. ఇదీ శాంతి మంత్ర సారం. సామాజిక న్యాయ సూత్రం.స్వస్తి ప్రజాభ్యః పరిపాలయన్తాం న్యాయేన్‌ మార్గేణ మహీం మహీశాః గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం లోకాః సమస్తాః సుఖినోభవన్తు ఓం శాంతిః శాంతిః శాంతిఃప్రజల క్షేమంగా ఉండాలి. పాలకులు సన్మార్గంలో పరిపాలించాలి. గోవులకు, వేదపండితులకు శుభం కలగాలి. జీవులన్నీ సంతోషంగా ఉండాలి` ఇదీ మంత్ర సారం. ఈ శాంతి కాంక్ష మరేదో కాదు, సామాజిక న్యాయమే. వ్యసనపరుడికి తాత్కాలికంగా లభించే ఆనందం, సుఖమే నచ్చుతాయి. అందుకే వ్యసనపరులు వ్యసనపరులతోనే సహవాసం చేస్తారు. మంచివాళ్లు చెప్పే మాటలు వారి చెవులకు శూలాల్లా గుచ్చుకొంటాయి. గాడిదకు గంధం వాసన తెలియనట్లు, పందికి పరమాన్నపు రుచి తెలియనట్లే` వ్యసనపరుడికి హితవచన మహిమ తెలియదు. మనిషి బాగుపడాలంటే పెద్దలపట్ల భయమైనా ఉండాలి, లేదా మంచి విషయాలపై భక్తి అయినా ఉండాలి. భయం కాని, భక్తి కాని లేని మనిషి తెగిన గాలిపటంలా ఎక్కడ పతనమవుతాడో ఎవరికీ తెలియదు. చేతులు కాలాక ఆకులు పట్టుకొన్న చందంగా, మనిషి అధోగతిపాలైన తరవాత జ్ఞానోదయమైనా` చేయగలిగిందేమీ ఉండదు.



మనిషికి భాగ్యదాయక క్షణాలు ఎప్పుడో కానీ రావు. అలా వచ్చినవాటిని చక్కగా ఉపయోగించుకొనేవాడికి జీవితం ఆనంద బృందావనం అవుతుంది.

# వానాకాలంలో ఎండాకాలం

## నైరుతి ప్రవేశించినా తగ్గని ఎండల తీవ్రత పెరుగుతున్న కరెంట్‌ వినియోగం

హైదరాబాద్‌ :

కాలం కాని కాలం దాపురించింది. రుతుపవనాలు ప్రవేశించి పదిరోజులు దాటినా ఇంకా ఎండలు మళ్లీ దంచికొడుతున్నాయి. నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలకు తోడు ఉక్కపోత ఆందోళనకు గురి చేస్తోంది. సాయంత్రం వేళలో అక్కడక్కడా చిరుజల్లులు పడినా ఆ తర్వాత భరించలేని ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీంతో కరెంట్‌ వినియోగం కూడా పెరుగుతోంది. ఎసిలు లేనిదే పట్టణ ప్రజలు ఉండలేకపోతున్నారు. ఆంధ్రాలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఉభయగోదావరి జిల్లాల్లో ఎండలు దంచి కొడుతున్నాయి. అక్కడ మధ్యాహ్నం వేళలో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. కొన్ని జిల్లాలో విత్తిన పత్తిగింజలు మొలకెత్తాయి. ఆ తర్వాత ఆశించిన మేర వానలు లేకపోవడంతో పత్తి మొలకలు వాడిపోతున్నాయి. జూన్‌ రెండు లేదా మూడో వారంలో వర్షాలు కురవాల్సి ఉండగా ఇప్పటి వరకు వరుణుడు కరుణించలేదు. వర్షాకాలం ప్రవేశించినప్పటికీ ఎండకాలం తలపిస్తుండడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రైతులు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నప్పటికీ ఎండల తీవ్రత ధాటికి చేన్లు పొడిబారి పోయాయి. వర్షం పడితే కానీ దున్ని విత్తనాలు నాటుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఎండల తీవ్రతకు జనం ఉక్కపోతతో ఆగమాగం అవుతున్నారు. అప్పుడప్పుడు వాతావరణంలో మార్పు చోటుచేసుకుని చల్లబడుతున్నప్పటికీ రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉంటున్నాయి. వర్షాకాలం సీజన్‌ ప్రారంభం కావడంతో వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. పూర్తిస్థాయి వర్షాలు పడే వరకు రైతులు తొందర పడకుండా విత్తనాలు నాటొద్దని అధికారులు సూచించారు. అయినప్పటికీ కొన్నిచోట్ల రైతులు విత్తనాలు నాటుకుంటున్నారు. ఇప్పటికీ ఆశించిన మేర వానలు పడలేదు. రెండు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడిరచారు.



### ప్రభుత్వ కార్యాలయాల్లో కానరాని

# శౌచాలయాలు

### ఇబ్బందులు పడుతున్న మహిళా ఉద్యోగులు, ప్రజలు



**వెల్గటూర్,జూన్17(నినాదం న్యూస్):** శౌచాలయం అనేది మహిళకు ఆత్మగౌరవంతో సమానం.మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వందల సంఖ్యలో మహిళలు,ప్రజలు వచ్చి వెళుతుంటారు. కార్యాలయాల్లో శౌచాలయాల లేమితో ఉద్యోగులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం మండలంలోని మారుమూల గ్రామాల నుండి ప్రజల మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. మండల కేంద్రంలో దాదాపుగా తహశీల్దార్,ఎంపిడిఓ,వెన్నెల,విద్యా వనరుల కేంద్రం, వంటి ప్రభుత్వ కార్యాలయాలన్ని ఒకే చోట ఉన్నాయి.ఆయా కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు,ముఖ్యంగా మహిళా ఉద్యోగులు,పనుల నిమిత్తం వచ్చే సామాన్య మహిళలు,ప్రజలు గంటల తరబడి కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తుంటారు.ఇలాంటి సమయంలో శౌచలయాల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో ఉన్న శౌచాలయాలే పక్క నున్న తహశీల్దార్, ఎమ్ఆర్సి, తదితర కార్యాలయ ఉద్యోగులకు, సామాన్య ప్రజలకు దిక్కు.పేరుకు అన్ని కార్యాలయాల్లో టాయ్ లెట్స్ ఉన్నా కూడా అవి తరుచుగా మరమ్మత్తులు కావడం,అపరిశుభ్రంగా ఉండడం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది.ముఖ్యంగా తహశీల్దార్,మండల పరిషత్ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వచ్చి వెళుతుంటారు. వీరందిరికి ఎంపిడిఓ కార్యాలయంలోని శౌచాలయమే దిక్కు. కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వాటి పనితీరు తరుచుగా చెడిపోయి మరమ్మత్తులు చేయాల్సి వస్తోంది. ఎంపిడిఓ కార్యాలయంలోని టాయ్ లెట్స్ ని ప్రజలు అధికంగా ఉపయోగించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గత కొన్ని రోజులుగా గ్రౌండ్ ఫ్లోర్‌లో టాయ్ లెట్స్ ని మూసివేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆయా కార్యాలయాల్లో శౌచాలయాలు ఏర్పాటుచేసి త్వరితగతిన వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**కోదాడ,జూన్ 17 (నినాదం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు నెమ్మది. దేవమణి ఆధ్వర్యంలో సోమవారం కోదాడ శాసన సభ్యురాలు శ్రీమతి ఎన్. ఉత్తమ్ పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కోదాడ ప్రభుత్వ ఆసుపత్రి తో పాటు, పలు ప్రవేటు ఆసుపత్రుల్లో, పారిశుద్ధ్య కార్మికు లకు మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, రాష్ట్ర నాయకులు ఎర్నేని. వెంకటరత్నం బాబుతో కలిసి రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా పేదలకు సేవా కార్యక్రమాలు చేస్తున్న నెమ్మది. దేవమణిని వారు అభినందించారు. పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కోదాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అన్నారు.

### చిన్నారి మృతికి కారణమైన నిందితుని

# కఠినంగా శిక్షించాలి

### దళిత కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 17 (నినాదం న్యూస్):** పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ కాట్నపల్లి దుర్ఘటనలో మృతి చెందిన 6సంవత్సరాల చిన్నారి మృతిని తీవ్రంగా ఖండిస్తు బెల్లంపల్లి దలిత కుల సంఘాల ఐక్యవేదిక సంఘం నాయకులు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో సోమవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఒ కామాంధుడి చేతిలో మృతి చెందిన ఆమె ఆత్మకు శాంతి కలగాలని పాత బస్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించినట్లు తెలిపారు.చిన్నారిని హత్య చేసిన నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వేగవంతంగా విచారణ జరిపి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం పని చేయాలని సూచించారు.ఎన్ని ప్రభుత్వాలు మారిన చిన్నారుల పట్ల సభ్య సమాజం తలదించుకునేలా జరిగే ఇలాంటి అకృత్యాలను ఎ ప్రభుత్వాలు కూడా ఆపలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారుల పట్ల క్రూరంగా వ్యవహరించే ఇలాంటి నిందితులను కఠినంగా శిక్షించేందుకు కఠిన చట్టాలు రూపొందించాలని వారు డిమాండ్ చేశారు.ఈ ర్యాలీలో నాయకులు చిలుక రాజనర్సు,గోమాస రాజం,కాసర్ల యాదగిరి, దాసరి బానయ్య,కారెంగుల మల్లేష్,బత్తుల రాయలింగు,సారయ్య,కుష్నపల్లి రాజలింగు, గోగర్ల శేఖర్,నాతరి కిరణ్,గంగారపు రమేష్, దుర్గయ్య, తిరుపతి, భాను ప్రసాద్, దగుట రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బక్రీద్ పండుగ

**అల్వాల్:** అల్వాల్ సర్కిల్ లో సోమవారం ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. మచ్చ బొల్లారం, అల్వాల్, వెంకటాపురం డివిజన్ పరిధి ఇందిరా నగర్ ముస్లిం ఈద్గాలలో ముస్లిం సోదరులందరూ బక్రీద్ ( ఈద్ ఉల్ అజా) పండుగ వేడుకలు విజయవంతంగా జరుపుకుంటున్నారు. ముస్లిం సోదరులు కొత్త బట్టలు ధరించి ఉదయం ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ మొహ్సిన్ వార్డ్ మెంబర్, మరియు అల్వాల్ పోలీస్ కానిస్టేబుల్ జ్యోతి తివారీ, సభ్యులు ఇమామ్ సాహబ్, ఎండి ఘౌస్, మోజాన్ షాబ్, ఎండి నజీర్, ఇక్బాల్ పాషా, ఎండి తాజ్, జావిద్, ఖలీల్, ఎండి మురాద్, జీషన్, అర్షద్, రఫీక్, అస్లాం, సబ్బీర్, ఫయాజ్, ఫరౌస్, పాల్గొన్నారు.

# సింగరేణి గనుల్లో పర్యటించిన డైరెక్టర్

### ఉత్పత్తి సాధన అధికోత్పత్తి పై ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయండి



**మణుగూరు జూన్ 17(నినాదం న్యూస్) :** మణుగూరు సింగరేణి కాలరీస్ ఓపెన్ కాస్ట్ గనుల్లో సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్ ఎస్ వి కె శ్రీనివాస్ సోమవారం పర్యటించారు ఈ సందర్భంగా స్థానిక జనరల్ మేనేజర్ ఆఫీసులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ....... ఓపెన్ కాస్ట్ గనుల్లో వార్షిక లక్ష్యం సాధన కొరకు ఇప్పటినుండే ఉత్పత్తి అధికోత్పత్తి శక్తిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అధికారులకు సూచించారు. వార్షిక లక్ష్యాలు నెలవారి లక్ష్యాలు సాధన కోసం ప్రతి అధికారి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసుకుని ఉత్పత్తిని అధిక ఉత్పత్తి సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. వచ్చే వర్షాకాల సీజన్లో బొగ్గు ఉత్పత్తి పై కొంత ప్రభావం పడే అవకాశం ఉందని దీనిని ఎదుర్కొనేందుకు ప్రతి అధికారి ప్రణాళిక బద్ధంగా బొగ్గు ఉత్పత్తి తో పాటు సమిష్టి కృషితో లక్ష్యాలను మించి ఉత్పత్తి సాధించే అవకాశం ఉందని ఆయన అన్నారు. సమావేశంలో గనుల సంబంధిత అధికారులతో మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి జరగాలంటే శ్రామిక శక్తి యాంత్రిక శక్తి పెంచే దిశగా ప్రతి అధికారి పనిచేయాలని అప్పుడే అధికోత్పత్తి లక్ష్యసాధన సాధించగలరని ఆయన అన్నారు. నిర్దేశిత వార్షిక లక్ష్యసాధన 126.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి టార్గెట్గా పెట్టుకున్నామని అందుకు తగ్గట్టుగా అధికారులు కిందిస్థాయి సిబ్బంది కార్మికులు సమిష్టి కృషితో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. వర్షాకాలం వచ్చేసింది గనుల్లో నీరు నిలిచే అవకాశం ఉంటుంది ఎప్పటి నీళ్లని అప్పుడే సంపులు ద్వారా మోటారు పంపులు ద్వారా బయటికి పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. గనుల్లో నిలిచే నీళ్లను తొలగించే క్రమంలో గనుల్లోకి వెళ్లే మార్గం బురద మయంగా అయ్యే అవకాశం ఉందని దీనితో వాహనాలు జారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్లు ముందుగా అంచనా వేసుకోవాలని ఆయన సూచించారు. బొగ్గు ఉత్పత్తి సాధించడంతో గనులకు సంబంధించిన అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని లేకపోతే లక్ష్యాన్ని సాధించడం చాలా కష్టమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వర్షాకాలంలో గనుల్లో జరిగే ప్రమాదాలను ముందే అంచనా వేసి ప్రమాదాలు నివారణకు ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని అని అన్నారు. అన్నిటిని మించి నిర్లక్ష్యం అనే భూతాన్ని ప్రతి అధికారి వదిలిపెట్టాలని అప్పుడే లక్ష్యసాధన సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఒక్క నిర్లక్ష్యం ఒక్క నిండు ప్రాణం బలవుతూ ఆ వెనకాల ఉన్న కుటుంబం కూడా అవస్థలు పడే అవకాశం ఉందని దీనికి తగ్గట్టుగానే ప్రతి అధికారి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు.

# అందరికీ అందుబాటులో స్వర్ణ గిరి దేవస్థాన ఆర్జిత సేవలు

### మానేపల్లి ట్రస్ట్ విద్య వైద్య అన్నదానం.. పూర్తిస్థాయిలో అర్పిత సేవలు - స్వామి వారి సన్నిధిలో గోశాల ప్రారంభం



**యాదాద్రి భువనగిరి. జూన్ 17 (నినాదం న్యూస్) :** దేవస్థానం ప్రారంభమై నేటికీ వంద రోజులు పూర్తి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం నిర్ణయం వానకాలం దృశ దర్శనార్థం వచ్చే భక్తులకు నూతన షెడ్ల ఏర్పాటు వీధిలైట్ల ఏర్పాటు.. మంచి నీటి సౌకర్యాలు మహిళా భక్తుల కోసం నూతన టాయిలెట్లు ఏర్పాటు ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు,చైర్మన్లు మానేపల్లి గోపికృష్ణ,మురళీకృష్ణ యాదాద్రి భువనగిరి జిల్లాలో కొలువుదీరిన శ్రీ స్వర్ణగిరీశుడికి ఆర్జిత సేవలు ఇకపై పూర్తిస్థాయిలో భక్తులకు అందుబాటులో ఉండనున్నట్లు ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు తెలిపారు. స్వర్ణ గిరి దేవస్థానం ప్రారంభమై నేటికీ వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రోజు ఆలయ కళ్యాణ మండపంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఆలయ ప్రధాన అర్చకులు శ్రావణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణ అనంతరం మండపం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ ధర్మకర్త చైర్మన్లు పాల్గొని మాట్లాడుతూ నేటి నుండి స్వర్ణగిరి ఆలయంలో భక్తులకు అందుబాటులో పూర్తిస్థాయిలో ఆర్జిత సేవలు అందుబాటులోకి రానున్నాయన్నరు. షోడశ కల మూర్తికి చేసే షాడశోపచార సేవలో భాగంగా నేటి ఉదయం 5 గంటలకు ప్రారంభమై సుప్రభాత సేవ మేలుకొని ఏకాంత సేవ వరకు మొత్తం 16 ఆర్జిత సేవలను భక్తులు www.ytdtemple.com అనే ఆలయ వెబ్ సైట్లో బుక్ చేసుకొని స్వామివారికి సేవ చేసుకోవడం ద్వారా ఆయన అనుగ్రహానికి పాత్రుడవుతారన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి విచ్చేసే భక్తులు ఏమాత్రం నిరాశపడకుండా స్వామివారి దర్శనం చేసుకోవచ్చు మధ్యాహ్నం 1 గంటల 30 నిమిషాల నుండి 2 గంటల 30 నిమిషాల వరకు మాత్రమే విరామం ఉంటుందన్నారు. శని ఆదివారాలలో ఉదయం 8 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు నిరంతరాయంగా స్వామివారిని దర్శించుకోవచ్చు అన్నారు. ఆలయానికి విచ్చే భక్తుల కోసం స్వామివారికి అత్యంత ప్రీతి ప్రధానమైన గోశాలను కూడా అందుబాటులో తీసుకువచ్చామన్నారు. ఆలయ దర్శనానికి వచ్చిన భక్తుల దర్శనానంతరం అన్న ప్రసాద వితరణ కూడా అందుబాటులో ఉంటుందని , అయితే మొదట్లో 2 వేల మందికి మాత్రమే పరిమితమైన.. ఈ అన్న ప్రసాద వితరణ నేటి నుండి 8 వేల మంది వరకు భక్తులకు సంతృప్తిగా ప్రసాదం అందుబాటులో ఉంచామన్నారు. అన్ని రకాల సేవలను ఆలయ వెబ్ సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు అన్నారు. అన్నప్రసాదానికి , విద్యా , వైద్యం కోసం స్వామివారికి హుండీ ద్వారా విరాళాలు చెల్లించుకోవచ్చు అన్నారు. భక్తులు ఇచ్చిన విరాళాలకు సెక్షన్ 80 జీ ద్వారా ఆదాయ పన్ను మినహాయింపు కూడా ఉండదని , ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మానేపల్లి మురళీకృష్ణ , గోపికృష్ణలు తెలిపారు. స్వర్ణ గిరీష్యుడి దర్శనం భక్తులకు ఆరంభమై నేటికి వంద రోజులు పూర్తి అయ్యిందని.. ఈ 100 రోజులలో తెలుగు రాష్ట్రాల నుండి ఎన్నారైల వరకు సుమారు 46 లక్షల కు పైచిలుకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారన్నారు. ఆలయంలో వృద్ధులకు , వ్రాయోవృద్ధులకు , (వికలాంగులకు) వీల్ చైర్ ద్వారా స్వామివారి దర్శనార్థం ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. సామాన్య భక్తుల నుండి వివిఐపీల వరకు స్వామివారి దర్శనం చేసుకొని ఆలియా నిర్వహణ పట్ల వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. స్వామివారి సేవల బుకింగ్ కోసం భక్తులు క్యూలైన్లలో వేచి ఉండనవసరం లేకుండా ఆలయ వెబ్ సైట్ ద్వారా బుక్ చేసుకుని పూర్తి వివరాల కోసం వెబ్ సైట్ ను చూడవచ్చునని తెలిపారు. అలాగే ఆలయ ఆవరణలో మహిళా భక్తుల కోసం నూతన టాయిలెట్లు.. జాతీయ రోడ్డు నుండి ఆలయానికి వచ్చే మార్గంలో నూతన వీధిలైట్లు ఏర్పాటు.. ఆలయ ప్రాంగణంలో మంచినీటి సౌకర్యాలు కల్పించడం , వాన కాలం దృశ ప్రాంగణంలో భక్తుల దర్శనార్థం క్యూలైన్ల వద్ద నూతన షెడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

## రామినేని కోటయ్య మృతి చాలా బాధాకరం



**అమీనాబాద్ గ్రామ శాఖ అధ్యక్షుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం...**

**కోదాడ,జూన్ 17 (నినాదం న్యూస్):** అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన రామినేని కోటయ్య మృతి బాధాకరం అని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. సోమవారం గ్రామంలోని ఆయన పార్థివ దేహానికి పూలమాలతో నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులైన టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రామినేని పూర్ణచందర్ రావు,వెంకటనారాయణలను పరామర్శించి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల నాయకులు ఐతనబోయిన వెంకటేశ్వర్లు,గుగులోతు శ్రీనివాస్, నల్ల భూపాల్ రెడ్డి, పోరెళ్ల సత్యనారాయణ,ధనవంత్ రెడ్డి, భూక్యా శ్రీను బాబు, మోజెస్, వెంకటరత్నం,సురభి రవి, ఏడుకొండలు, వెంపటి నాగమణి, వీరయ్య,రవి, అమీనాబాద్ గ్రామ నాయకులు, తదితరులు ఉన్నారు.

# టియూడబ్ల్యుజె రాష్ట్ర మహాసభలకు ఖమ్మం ముస్తాబు

### ఘనంగా ఏర్పాట్లు చేసిన ఆహ్వాన కమిటీ - ఖమ్మం నగరంలో పలు కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు - మహాసభలకు హాజరు కానున్న 300 మంది ప్రతినిధులు




**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూన్ 17(నినాదం న్యూస్):** ఖమ్మం, జూన్ 17 : టియూడబ్ల్యూజె(ఐజెయు) 3వ రాష్ట్ర మహాసభలకు ఖమ్మం నగరం ముస్తాబైంది. ఈ నెల 19, 20 తేదీల్లో ఖమ్మంలోని ఉషాహరి కన్వెన్షన్(అమరజీవి అమర్‌నాథ్ ప్రాంగణం)లో ఈ మహాసభలు జరుగనున్నాయి. ఈ మేరకు ఆహ్వాన కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు సార్లు రాష్ట్ర మహాసభలకు ఆతిధ్యమిచ్చిన ఖమ్మ జిల్లా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత తొలిసారిగా ఆతిధ్యమివ్వబోతోంది. 300 మంది ప్రతినిధులు హాజరయ్యే ఈ మహాసభలకు ఆహ్వాన సంఘం ఘనంగా ఏర్పాట్లు చేసింది.

ప్రచారం ముమ్మరం రాష్ట్ర మహాసభల విజయువంతానికి ఆహ్వాన సంఘం ఘనమైన ఏర్పాట్లతో పాటు ప్రచారం ముమ్మరం చేసింది. నగరంలోని కాల్వొడ్డు, జెడ్పీసెంటర్, ఎన్‌టిఆర్ సర్కిల్, బైపాస్ రోడ్‌లోని పలు ఆర్చిలకు యూనియన్ స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లోనూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మహాసభలకు హాజరైన అతిథులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం గమనార్హం. ఇప్పటికే యూనియన్ స్టిక్కర్లను ఆవిష్కరించి జర్నలిస్టుల్లోకి తీసుకెళ్లిన విషయం విదితమే.

**మహాసభలను ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి...** 19న ప్రారంభమయ్యే మహాసభలను రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు, సామాజిక వేత్త కూరపాటి ప్రదీప్ స్వాగతోపన్యాసం చేయనున్నారు. జిల్లా విశిష్టత, జర్నలిస్టుల సేవలు, యూనియన్ పోరాటాలు తదితర అంశాలను క్రోడీకరిస్తూ వచ్చిన ప్రతినిధులకు, ఆహ్వానితులకు మహాసభల ఉద్దేశాన్ని వివరించనున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మీడియా అకాడమి చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, వద్దిరాజు రవిచంద్ర, డాక్టర్ పార్థసారధి రెడ్డి, లోక్‌సభ సభ్యుడు రావుసహాయం రఘురాంరెడ్డి, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, తానా మాజీ అధ్యక్షులు జయశేఖర్ తాళ్ళూరి, ఐజెయు నాయకులు బల్విందర్ సింగ్ జమ్ము, ఎస్ ఎన్ సిన్హా, దేవులపల్లి అమర్, ఎం ఏ మాజీద్, వై నరేందర్ రెడ్డి, డి సోమసుందర్, కల్లూరి సత్యనారాయణ, అలపాటి సురేశ్ కుమార్, నగునూరి శేఖర్, కె విరాహత్ అలీ తదితర నాయకులు హాజరు కానున్నారు. 20న సాయంత్రంతో మహాసభలు ముగియనున్నాయి. ముగింపు సభకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హాజరు కానున్నారు.

**మహాసభల్లో పలు అంశాలపై తీర్మానాలు...** రాష్ట్ర మహాసభల్లో జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలపై తీర్మానాలు చేయనున్నారు. ఇళ్లస్థలాలు, హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై తీర్మానాలు చేయనున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి తగిన కార్యాచరణను ఈ మహాసభల్లో రూపొందించనున్నారు.

### వినియోగదారులకు చేరువయ్యేందుకే

## : ఏడీఈ భీమ్ సింగ్



**ముదిగొండ 17 (నినాదం న్యూస్)** విద్యుత్ వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకే విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం "ప్రజావాణి" కార్యక్రమాన్ని నిర్వహించారు.. అనంతరం వారు మాట్లాడుతూ వినియోగదారుల నుంచి తమ యొక్క సమస్యల పరిష్కారం కొరకు వినతి పత్రాలను స్వీకరించారు. అట్టి సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుంది అన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు ఏడీఈ భీమ్ సింగ్, ఏఈ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సోమవారం "ప్రజావాణి" కార్యక్రమంలో భాగంగా ముదిగొండ మండలం లోని ముదిగొండ మరియు పమ్మి ఏఈ కార్యాలయాల వద్ద మరియ ఏడిఈ ముదిగొండ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారులు వచ్చి తమ యొక్క ఫిర్యాదులను ఇచ్చి వారి యొక్క సమస్యలను పరిష్కరించుకోవచ్చని. కావున వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## ఇంకెప్పుడు రేషన్ కార్డులు ఇచ్చేది

### రేషన్ కార్డుల కోసం ఇంకెన్నాళ్లీ ఎదురుచూపులు



**కారేపల్లి, జూన్ 17 (నినాదం న్యూస్):** ఏళ్ల తరబడి రేషన్ కార్డుల కోసం లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. 2018 ఎన్నికలకు ముందు రేషన్ కార్డులను ఇచ్చిన గత ప్రభుత్వం తర్వాత రేషన్ కార్డుల ఊసే ఎత్తలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా రేపు మాపు అంటూ ఊరించడమే తప్ప ఆచరణలో అమలు చేయడం లేదని కారేపల్లి మండల ప్రజలు మండి పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం ప్రకటించే పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి అని ఆదేశాలిస్తున్న రేషన్ కార్డులు జారీ చేయడంలో మాత్రం ప్రభుత్వాలు విఫలమవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు తప్పనిసరిగా అందించే ప్రక్రియను ప్రభుత్వం, అధికారులు అమలు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు..

## ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు

### కారేపల్లి ఈగ్దాలో బక్రీద్ సందర్భంగా ప్రార్థనలు



**కారేపల్లి, జూన్ 17 (నినాదం న్యూస్):** కారేపల్లి మండల కేంద్రంలోని ఈగ్దా లో సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం సోదరులందరూ కలిసి బక్రీద్ రోజు పొట్టేలు, మేకపోతులను కుర్బానీ చేసి మూడు భాగాలు చేసి ఒక భాగం పేదవారికి, ఒక భాగం బంధువులకు, మరొక భాగం కుర్బానీ ఇవ్వడం ఆచారమని మత పెద్దలు తెలియపరిచారు. బక్రీద్ పండుగ సందర్భంగా కారేపల్లి లోని ముస్లిమ్ లు పండగ సందడిని తలపించారు. మండలంలోని ముస్లిం సోదరులకు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, యువకులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు..

## దైవ చింతనతో మానసిక ప్రశాంతత

## : ఎమ్మెల్యే, బాలు నాయక్



**చింతపల్లి, జూన్ 17( నినాదం న్యూస్):** దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. మండలంలోని వింజమూరు గ్రామం పరిధిలో ఉన్న శ్రీ కలియుగ హరి హర క్షేత్రం లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి వార్ల ఆలయాల బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కావేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మేళ తాళాల మధ్య పూర్ణకుంభముతో ఎమ్మెల్యే బాలు నాయక్ కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయాలలో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలునాయక్ ను శాలువాలతో ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దొంతం సంజీవరెడ్డి, కొండూరు పవన్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, పిఎసిఎస్ చైర్మన్లు లింగంపల్లి వెంకటయ్య ,జాల నరసింహారెడ్డి, ఎరుకల వెంకటయ్య గౌడ్, యువజన కాంగ్రెస్ పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షుడు, అడ్వకేట్ కొర్ర రామ్ సింగ్ నాయక్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు యాచారం యాదయ్య గౌడ్, ఎంపీటీసీ నల్లవెల్లి సదానందం, అంగిరేకుల గోవర్ధన్, హరిలాల్ నాయక్,గోపిడి కృష్ణారెడ్డి దొంతం దోతి రెడ్డి ,శత్రుఘ్న రాజు, గుండ్లపల్లి నరసింహారెడ్డి, మునుకుంట్ల శేఖర్ గౌడ్, మాస భాస్కర్, ఉజ్జిని నరేందర్ రావు, ఈరటి మల్లేష్, గునమోని కొండలు యాదవ్ , నాగమళ్ళ గిరి, కంబాలపల్లి యాదగిరి, కేశగోని రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి : ఎమ్మెల్యే బాలు నాయక్



**చింతపల్లి, జూన్ 17 (నినాదం న్యూస్)** గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. చందంపేట మండలంలోని తెల్దేవర్పల్లి గ్రామంలో సోమవారం ఆయన పలు అభివృద్ధి పనుల కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలుకోలాట నృత్యాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా రైతు బిడ్డ నైన తనను ప్రజా నాయకుడిగా చేసి అసెంబ్లీకి పంపిన ఘనత దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు చెందుతుందని అన్నారు. రాజకీయంగా పునర్జన్మనిచ్చిన దేవరకొండ నియోజక వర్గ ప్రజలకు , ప్రత్యేకంగా తెల్దేవరపల్లి గ్రామ ప్రజలకు తన జీవితాంతం రుణపడి ఉంటానని ఆయన చెప్పారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే బాలు నాయక్ ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జర్పుల బద్య నాయక్, ఎంపిపి పార్వతి చందు నాయక్, జెడ్పీటీసీ బుజ్జి లచ్చీరాం నాయక్, పిఎసి ఎస్.చైర్మన్లు జాల నర్సింహా రెడ్డి, శ్రీశైలం యాదవ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మాజీ ఎంపీపీ గోవింద్, మాజీ ఎంపీటీసీలు లక్ష్మణ్ నాయక్, మహా లక్ష్మయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు భరత్,యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సాయిరాం రాథోడ్, మాజీ సర్పంచులు,ఉప సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బక్రీద్ వేడుకలు



**కాగజ్ నగర్ జూన్ 17( నినాదం న్యూస్):** కాగజ్ నగర్ పట్టణంలోని ఈద్గాలో సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండగను జరుపుకున్నారు ఈ సందర్భంగా ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు మత గురువు పండుగ ప్రత్యేకతను వివరించారు సందర్శించిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నియోజకవర్గ ఇన్చార్జి రవి శ్రీనివాస్ ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## పిలుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**కోదాడ,జూన్ 17(నినాదం న్యూస్):**కోదాడ శాసనసభ్యులు ఉత్తమ్ పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకుడు పిల్లుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... కోదాడ ప్రాంతం గడిచిన ఆరు నెలలలోనే అభివృద్ధి పథంలో దూసుకు వెళుతుందన్నారు. కోట్ల రూపాయల నిధులతో పట్టణాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సమక్షంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు షేక్ బాగ్దాద్ ,గంధం జానీ, పాలడుగు సంజీవ్, యరసాని కృష్ణ, రఫీ ,రామరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కోటగుళ్ళలో డిఎస్పీ దంపతుల పూజలు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 17 నినాదం న్యూస్):** గణపురం మండల కేంద్రంలోని కాకతీయుల కళా క్షేత్రం శ్రీభవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళలో నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం భూపాలపల్లి డిఎస్పి అవిరినేని సంపత్‌రావు విజయ దంపతులుస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. మొదట గణపతి పూజ నందీశ్వర స్వామివారి పూజ అనంతరం గణపేశ్వరునికి పట్టు వస్త్రాలను సమర్పించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు మటం గంగాధర్ వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాలు పూలమాలతో ఘనంగా సన్మానించారు.

## బులియన్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**కోదాడ,జూన్ 17(నినాదం న్యూస్):** కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలను కోదాడ బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ఉప్పల శ్రీనివాస్ కోట మధు బుడిగం నరేష్ బుడిగం రాజేషు నల్లమాద సాయి బరపటి వెంకటేశ్వర్లు అంబడెక్కర వెంకట్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలిరెడ్డి, తూమాటి నాగిరెడ్డి నరేష్ షరీఫ్ రాజేష్, సైదులు యువకిశోర్ నాగులు మీరా తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు రూ.6వేలు పెన్షన్ వెంటనే అమలు చేయాలి

**వి హెచ్ పి ఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందే రాంబాబు**



**కేసముద్రం, జూన్ 17, (నినాదం న్యూస్):** సోమవారం రోజు వికలాంగుల హక్కుల పోరాట సమితి సమావేశం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో విహెచ్పిఎస్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ పోలేపాక శంకర్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి విహెచ్పిఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందే రామ్ బాబు, వీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తుంది కాబట్టి వికలాంగులకు 6000 పెన్షన్, వృద్ధులు వితంతువు లకు 4000 పెన్షన్ ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని,వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2016 విక లాంగుల చట్టం అమలు చేసి స్థానిక ఎన్నికలలో సర్పంచులుగా వార్డు మెంబర్లుగా రిజర్వేషన్లు ప్రకటించాలని ఉచిత బస్సు ప్రయాణాలను వికలాంగులకు ప్రకటించాలని ఉద్యోగాలలో 56%ఉన్న రోస్టర్ పాయింట్‌ను ఆర్థోపెడిక్ వాళ్లకు 10 శాతానికి తగ్గించి వారికి న్యాయం చేయాలని, వారు ప్రభు త్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విహెచ్పిఎస్ మండల అధ్యక్షులు కొనగొండ వెంకన్న, విహెచ్‌పిఎస్ మండల ఇన్చార్జ్ రాంపల్లి వెంకన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కంటిపూడి అరుణ్,వికలాంగుల సంఘం మండల నాయకులు కేతమ్మ, మీరా సాహెబ్, టౌన్ అధ్యక్షులు సామల వీరభద్రం, సీమోన్ కొమురయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బిర్రు యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండుగ..





- **రాష్ట్ర ముస్లిం సోదర, సోదరీమణులకు ప్రత్యేకంగా బక్రీద్ పండుగ శుభాకాంక్షలు.**
- **రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ కోమటిరెడ్డి వెంకటరెడ్డి.**



**నల్గొండ బ్యూరో, జూన్ 17(నినాదం న్యూస్):** త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండుగ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు లోఉన్న ఈద్గాలో బక్రీద్ పండుగను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముస్లిం సోదర, సోదరీమణులకు ప్రత్యేకంగా బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నల్గొండ పట్టణంలో గత30 సంవత్సరా లుగా హిందూ ముస్లిం అనే తేడా లేకుండా అన్నదమ్ములుగా కలిసి ఉంటున్నారు. పేద ముస్లింలకు ఇండ్లు కట్టిస్తాని హామీ ఇచ్చారు. జనాభా పెరుగుతున్న సందర్భంగా ఈద్గాను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ముస్లింలకు విద్యారంగంలో ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పిస్తాం. ఔట్సోర్సింగ్ ఉద్యోగాలలో చదువుకున్న ముస్లిం యువతీ యువకులకు అవకాశాలు కల్పిస్తాం అందరూ బాగుండాలని అల్లాను ప్రార్థిస్తున్నానన్నారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట బందోబస్తుతో శాంతియుతంగా ప్రార్థనలు జరిగేలా చేసిన పోలీస్ డిపార్ట్మెంట్‌కి ఎస్పీ చందనా దీప్తికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ చందనా దీప్తి, రెవిన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఏఎస్పి రాములు నాయక్, నల్గొండ ఆర్డీవో రవి, నల్గొండ ఎమ్మార్వో శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్‌లు ఈ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

## నడిగూడెం మండలంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**కోదాడ,జూన్ 17(నినాదం న్యూస్)** నడిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోదాడ ఎమ్మెల్యే నల్లమాద పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు కేక్ కట్ చేశారు పలువురు మాట్లాడుతూ కోదాడ అని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి ఇలాంటి పుట్టినరోజులు మరిన్ని జరుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు బూత్కూరు వెంకటరెడ్డి ఎంపీపీ యాతకుల జ్యోతి మధుబాబు అలుగుబెల్లి చంద్రశేఖర్ రెడ్డి గోసుల రాజేష్ గుండు శ్రీనివాస్ నాగిరెడ్డి లింగారెడ్డి గద్దం మల్లేష్ బడేటి వెంకటేశ్వర్లు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## ఆడక్వాసితో పాటు సీనియర్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాలి

**బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ దశరథ్ నాయక్**

**మిర్యాలగూడ,జూన్ 17(నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఆడక్వాసి ప్రకారం పదోన్నతులు కల్పించడంతోపాటు సీనియరిటీని పరిగణలో తీసుకోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్ కోరారు. సోమవారం మిర్యాలగూడలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మల్టీ జోన్ 1,2 లలో ఇప్పటికే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులకు పదోన్నతులు పూర్తి అయ్యాయని ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు జాబితా సిద్ధం చేస్తున్నారని అందులో ఎస్సీ,ఎస్టిలకు నష్టం వాటిల్లకుండా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోను ఆడక్వాసి, సీనియారిటీ కమ్ రోస్టర్ పాటించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. జాబితాలో తప్పులు దొర్లితే విద్యాశాఖ అధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని పరిష్కరించకపోతే బంజారా సంఘం దృష్టికి తీసుకురావాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయులు కోరారు. అడక్వాసి, సీనియారిటీ కమ్‌రోస్టర్ ప్రకారం పదోన్నతులు కల్పించే విషయంలో అన్యాయంజరిగితే 9849573645, 8555917912 ఫోన్‌నంబర్లకు తెలిపితే సంబంధిత అధికారుల దృష్టికితీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. సమావే శంలో బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు సైద,మక్ల, గోపి, శ్రీను, జామ్లు, హరి,కొట్యా నాయక్,మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**కోదాడ,జూన్17 (నినాదం న్యూస్):** కోదాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంగవీటి. రామారావు ఆధ్వర్యంలో సోమవారం కోదాడ శాసన సభ్యురాలు శ్రీమతి ఎన్. ఉత్తమ్ పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు .కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి, చందర్ రావు, పిసిసి డెలిగేట్ చింతకుంట్ల. లక్ష్మీనారాయణ రెడ్డి,మాజీ సర్పంచ్, డిసిసి ఉపాధ్యక్షులు పార. సీతయ్య మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని. ప్రమీల, వైస్ చైర్మన్ కందుల. కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు భారీగా తరలివచ్చిన కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారు ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నతమైన పదవులు అందుకొని కోదాడ నియోజకవర్గ ప్రజలకు మరింత కాలం వారు సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## వికలాంగుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**కోదాడ,జూన్ 17(నినాదం న్యూస్):** కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలను కోదాడ పట్టణంలో వికలాంగుల విభాగం షేక్ రఫీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో కొమ్ముజాడ రామారావు, ఆర్ఎంపి రఫీ, అబ్దుల్,కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ..

**ఆర్టిజన్ కార్మికుడికి తీవ్రగాయాలు**



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 17 నినాదం న్యూస్):** గణపురం మండలంలోని చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ ప్రధాన రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు సోమవారం ఉదయం ఢీకొన్నాయి . ఈ ఘటనలో కేటీపీపీ లో ఆర్టిజన్ గా విధులు నిర్వహిస్తున్న కొండెంగ శ్రీనుకు తీవ్ర గాయాలు పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికులు అంబులెన్స్ లో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

## ఘనంగా జన్మదినోత్సవం వేడుకలు.



**కోదాడ టౌన్, జూన్ 17( నినాదం న్యూస్):** కోదాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంగవీటి రామారావు ఆధ్వర్యంలో కోదాడ శాసన సభ్యురాలు శ్రీమతి ఎన్. ఉత్తమ్ పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి, చందర్ రావు,పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి,మాజీ సర్పంచ్ డిసిసి ఉపాధ్యక్షులు పారసీతయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు భారీగా తరలివచ్చిన కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారు ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నతమైన పదవులు అందుకొని కోదాడ నియోజకవర్గ ప్రజలకు మరింతకాలం వారు సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## అనంతగిరి మండల కేంద్రంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**కోదాడ,జూన్ 17(నినాదం న్యూస్):** అనంతగిరి మండల కేంద్రంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కొండపల్లి వాసు, ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు నాయక్, గుర్రం వెంకటరెడ్డి ,అనంతగిరి మాజీ సర్పంచ్ వెన్నెపల్లి వెంకటేశ్వర్లు గారు, అనంతగిరి మాజీ ఎంపీటీసీ ఈదుల కృష్ణయ్య, మండల ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ కోటేశ్వరరావు, అమీనాబాద్ మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు, మొగలైకోట గ్రామ శాఖ కిరణ్ రెడ్డి, మొగలైకోట మాజీ ఉప సర్పంచ్ వీరబాబు, ఖానాపురం మాజీ సర్పంచ్ గాదె వెంకన్న ,వాయిల సింగారం గ్రామ శాఖ కంటూ వేణు, తదితరులు పాల్గొన్నారు

## నల్గొండ పట్టణాన్ని అన్నిరకాలుగా తీర్చిదిద్దుతా..

**ఉదయ సముద్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా..**

**రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.**





**నల్గొండ బ్యూరో,జూన్ 17(నినాదం న్యూస్):**నల్గొండ పట్టణాన్ని అన్ని రకాలుగా తీర్చిదిద్దడంతో పాటు, ఉదయ సముద్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం అయన బక్రీద్ సందర్భంగా మునుగోడు రోడ్డు లో ఉన్న ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు .అనంతరం పానగ ఫ్లై ఓవర్ సర్వీస్ రహదారిలో 5 కోట్ల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులు ,కాంట్రాక్టర్ కు పలు సూచనలు చేశారు. మ్యాన్ హోల్స్ వద్ద క్యూరింగ్ బాగా చేయాలి. పట్టణానికి డ్రైనేజీ సమస్య లేకుండా, శాశ్వత పరిష్కారం ఉండేలా పనులు చేయాలి. గత ప్రభుత్వంలో డ్రైనేజీ లైన్ తీయకుండా హడావుడిగా పనులు పూర్తి చేశారు. ఈ డ్రైనేజీ పనులు చేయకపోవడం వల్ల పానగల్ ఫ్లైఓవర్ వద్ద ఇబ్బందులు తలెత్తాయి దీంతో 5.5కోట్లు మంజూరు చేయించి భూగర్భ డ్రైనేజీ పనులను పూర్తి చేయిస్తున్నాం. పట్టణంలో ఎంత వర్షం వచ్చినా చుక్క నీరు నిలవకుండా చేస్తున్నాం. జాతీయ రహదారిని పట్టణంలో నుండి తీసుకెళ్లడం ద్వారా రామాలయం, చర్చి, ఆంజనేయస్వామి గుడి, కబరస్తాన్, దేవరకొండ రోడ్ లోని షాపులు వంటివి కోల్పోతున్నారు. పట్టణం నుండి జాతీయ రహదారి వెళ్లకుండా నల్గొండ పట్టణం అవతలి నుండి 700 కోట్ల వ్యయంతో రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నాం. పట్టణంలోకి హెవీ వాహనాలు ఏవి రాకుండా ఔటర్ రింగ్ రోడ్డు పైనుంచి వెళ్లేలా పనులు ప్రారంభించబోతున్నామన్నారు. దీంట్లో భాగంగానే పానగల్లు వద్ద ఛాయా సోమేశ్వరాలయం సమీపంలో ఇందిరా గాంధీ విగ్రహాన్నిఏర్పాటు చేసి ఇందిరాగాంధీ చౌరస్తాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం.

**ఉదయ సముద్రాన్ని టూరిజం స్పాటుగా అభివృద్ధి చేస్తాం ..**

సందనపల్లి వద్ద ఉన్న డంపింగ్ యార్డ్ లో ట్రీట్మెంట్ ప్లాంటు ఏర్పాటు చేయబోతున్నాం. దేవరకొండ రోడ్‌లో ఉన్న సెయింట్ ఆల్ఫన్సెస్ హై స్కూల్ వద్ద ఎస్కలేటర్‌తో కూడిన రోడ్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తున్నాం. దీని ద్వారా సుమారు విద్యార్థిని, విద్యార్థులకు రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా నివారిస్తున్నాం. దేవరకొండ రోడ్డులో ఉన్న వైయస్సార్ సర్కిల్‌ని అభివృద్ధి చేస్తున్నాం. నల్గొండ అవుటర్ రింగ్ రోడ్డు కింద భూములు, ఇండ్ల స్థలాలు కోల్పోయే వారికి మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం అందించడమే కాకుండా, ప్రత్యామ్నాయంగా ఇళ్ల స్థలాలను కేటాయిస్తాం. పట్టణంలో ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతోపాటు ప్రమాదాలకు కారణమయ్యే చెట్లను తొలగిస్తున్నాం. ఈ కార్యక్రమాలలో మంత్రితోపాటు, పనులను పరిశీలించిన, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, కౌన్సిలర్లు,తదితరులు ఉన్నారు.

# బక్రీదు పండుగ త్యాగానికి ప్రతీక

## రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి





**వనపర్తి జిల్లా ప్రతినిధి జూన్ 17 (నినాదం న్యూస్)** బక్రీద్ పండగ త్యాగానికి ప్రతీక అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవుడిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని బక్రీద్ పండుగ మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు.సోమవారం బక్రీద్ సందర్భంగా



జిల్లా కేంద్రంలోని ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం చిన్నారెడ్డి, జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్తల అచంచలమైన త్యాగ నిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవుడిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని బక్రీద్ పండుగ మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు. తమకు ఉన్న దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదన్న స్ఫూర్తిని చాటిచెపుతోందని చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

### మృతుడికి ఐదు నెలల క్రితమే వివాహం



**కాటారం జూన్ 17 నినాదం న్యూస్:** మల్హర్ రావు మండలంలోని రుద్రారం గ్రామంలో సోమవారం ఉదయం విద్యుత్ షాక్ తో దుద్దుల నిశాంత్ (30) అనే యువకుడు మృతి చెందిన సంఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకెళ్తే నిశాంత్ తన ఇంటి ఆవరణలో ఉన్న బోర్ మోటార్ వైరు తెగిపోవడంతో గమనించకుండా వైర్ ను తగలడంతో విద్యుత్ షాకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నిశాంత్ కు ఐదు నెలల క్రితమే వివాహం జరగగా భార్య సృజన మరియు తల్లిదండ్రుల రోదనలు చూసిన గ్రామస్తులను కంటతడి పెట్టించాయి. భార్య సృజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# త్యాగాలకు ప్రతీక బక్రీద్...

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు.



**మిర్యాలగూడ, జూన్ 17(నినాదం న్యూస్):** త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండుగ అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు లు అన్నారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా స్థానిక చిన్న మసీద్ కమిటీ అధ్యక్షులు పాషా ఆహ్వానం మేరకు ఆయన స్వగృహానికి వెళ్లి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సలీం, హాథీరాం నాయక్, మొజ్జ రామకృష్ణ, గుడిపాటి సైదులు బాబు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేసిన గుత్తా

### మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు



**మిర్యాలగూడ, జూన్ 17( నినాదం న్యూస్ ):** టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నలమాతు భాస్కర్ రావు అన్నారు. సోమవారం పట్టణ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇటీవల తెలుకాటుకు గురై మృతి చెందిన అడవిదేవులపల్లి మండలం జిలకరగుంట గ్రామానికి చెందిన టిఆర్ఎస్ కార్యకర్త రమావత్ రూప్లా గత సంవత్సరం అక్టోబర్లో మృతి చెందగా టిఆర్ఎస్ పార్టీ కల్పించిన బీమా సౌకర్యం ద్వారా మంజూరైన రెండు లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయ్ సింహ రెడ్డి, చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ ధనావత్ బాలాజీ నాయక్, తాజా మాజీ సర్పంచ్ పకీర నాయక్,హుస్సేన్, దామరచర్ల జడ్పిటిసి ఆంగోతు హతిరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 19న నీట్ లీకేజీపై స్టూడెంట్ మార్చ్‌ను విజయవంతం చేయండి

## విద్యార్థి సంఘాల పిలుపు



**నిజామాబాద్ ప్రతినిధి, జూన్ 17 (నినాదం న్యూస్):** జూన్ 19 న నీట్ పేపర్ లీకేజీపై స్టూడెంట్ మార్చ్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వరదబట్టు వేణురాజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్‌లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడా నికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమా నాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షను రాశారు. ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వారి అనుమానాలకు సజీవ సాక్ష్యం ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావ డం మరల వారి యొక్క పరీక్ష కేంద్రం ఒకటే కావడం వలన వారి అనుమానా లకు బలాన్నిస్తుంది.తక్ష ణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితా లపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. అదేవిధంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలనీదక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన కూడా వారి మాటని పెడచెవిన పెట్టి, నిర్లక్ష్యం చేయడం ద్వారా వేలాది మంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నేషనల్ టెస్టిం గ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని అన్నారు.లీకేజ్ బాధితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు నరేందర్, జిల్లా కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, ఏఐపీఎస్యు జిల్లా కార్యదర్శి అనిల్, విద్యార్థి సంఘాల నాయకులు నితిన్ రెడ్డి, ప్రసాద్, అనిల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

- **కేసులు నమోదు చేసిన తీరు మారని ఇసుక మాఫియా.**
- **విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు నమోదు.**



**జమ్మికుంట, జూన్ 17 (నినాదం న్యూస్):** జమ్మికుంట మం డలం విలాసాగర్ మానేరు నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ అడ్డుకున్న జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న హోంగార్డు ఆఫీసర్ రవీందర్ విధులకు ఆటంకం కలిగించిన విలాసాగర్ గ్రామానికి చెందిన వేల్పుల అనిల్ కుమార్ వేల్పుల నాగరాజు బండ అరవింద్ ల పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ వరగంటి రవి ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం విలాసాగర్ మానేరు పరివాహక ప్రాంతం నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమ తులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తు జమ్మికుంటకు వస్తున్న ఒక ట్రాక్టర్ ను పట్టణంలోని శ్రీదేవి రైస్‌మిల్ ఏరియాలో హోంగార్డ్ ఆఫీసర్ రవీందర్ ఆపి ఇసుకకు సంబంధించిన వివరాలు అడుగగా మా దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని డ్రైవర్ తెలపగా వెంటనే ఆ ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్కు తీసుకొని వెళ్లాలని హోంగార్డు ట్రాక్టర్ పై కూర్చొని పోలీస్ స్టేషన్కు తరలించే ప్రయత్నంలో ఆ ట్రాక్టర్ యజమాని వేల్పుల నాగరాజు అడ్డుకొని హోంగార్డు రవీందర్ పై దురుసుగా ప్రవర్తించి తన ట్రాక్టర్ ను నాగరాజు తీసుకు వెళ్లాడని రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. హోంగార్డు తన బాధ్య తలను నిర్వర్తిస్తుండగా అతని విధులకు ఆటంకం కలిగించినం దుకు వేల్పుల అనిల్ కుమార్ వేల్పుల నాగరాజు బండ అరవింద్ అనే ముగ్గురు వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

**కేసులు నమోదు చేసిన తీరుమారని ఇసుక మాఫియా.**

గత కొన్ని నెలలుగా పోలీసులు అక్రమ ఇసుక రవాణాపై ఉక్కు పాదం మోపుతూ అక్రమ ఇసుక రవాణా కు అడ్డు కట్ట వేస్తున్నారు. అయినప్పటికీ కొంతమంది పోలీసుల కండ్లు కప్పి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా అడ్డుకున్న పోలీసులపై గతంలో కొంతమంది ట్రాక్టర్ యజమానులు డ్రైవర్లు పోలీసులతో దురుసుగా ప్రవర్తించి వారి ట్రాక్టర్లను తీసుకు పోవడంతో వారిపై కేసులు నమోదు చేసినప్పటికీ ట్రాక్టర్ యజమానుల్లో మార్పు రాకపోగా మరింత రెచ్చిపోతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిపై పిడి యాక్ట్ పెట్టే ఆలోచనలో పోలీసులు ఉన్నట్లు సమాచారం.


# కళాకారులకు అండగా ఉంటా: ఎమ్మెల్యే మందుల సామెల్




**తుంగతుర్తి,జూన్ 16(నినాదం న్యూస్):** కళాకారులకు అండగా ఉంటానని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు.ఆదివారం నాగారం మండల కేంద్రంలో కళాకారుడు దప్పు సుధాకర్ సంతాప సభలో పాల్గొని మాట్లాడుతూ సమాజంలో కళాకారుల సేవలు మరువలేనివి అని కొనియాడారు.ఈ సందర్భంగా కళాకారుల జీవితాలని గుర్తుచేసుకొని బావోద్వేగానికి గురైనారు.అనంతరం దచ్చన్న దారిలో అంటూ పాట పాడి కళాకారులపై తన అభిమానాన్ని చాటుకున్నారు. మృతుని కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.తదనంతరం సుధాకర్ పాటలసీడిని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుతొడుసు లింగయ్య,వెంకట బిక్షం, దశరథ, కళాకారులు రాష్ట్ర గాయకురాలు వేముల పుష్ప,తెలంగాణ ప్రజాయుద్ధ నౌక ఏపూరి సోమన్న,గిద్దె రామ నరసయ్య, నేర్నాల కిషోర్,మద్దెల సందీప్,మందుల విజయ, లింగయ్య,వేణు,నాగరాజు,మల్లిక,అనుదీప్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బక్రీద్ వేడుకలు

**తుంగతుర్తి,జూన్ 17(నినాదం న్యూస్):** త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్ పండుగను సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ముస్లీం సోదరులు భక్తి,శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్బంగా మండలంలో తదితర గ్రామాల్లో ఉన్న ఈద్గాల వద్ద ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఖురాన్ పఠించి ప్రజలందరు శాంతి సౌభాగ్యాలతో ఉండాలని వేడుకున్నారు.అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.సాయంత్రం వేళ ముస్లీం సోదరులు ఖుర్బానీ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ముస్లీం



సోదరులు మౌలాన మస్తాన్,షఫీ,యాకూబ్, నాగుల్‌మీరా, ఎస్‌కె.వలీ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా వెయ్యి గుండె శస్త్రచికిత్సలు

### వైద్య నిపుణులు డా.సదానంద్ రెడ్డి




**నిజామాబాద్ ప్రతినిధి, జూన్ 17 (నినాదం న్యూస్) :** మెడికవర్ హాస్పిటల్స్‌లో వెయ్యికి పైగా గుండె ప్రక్రియలు, గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడం గర్వ కారణంగా ఉందని గెండు వైద్యనిపుణులు డా.సదానంద్ రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని ఎల్లమ్మ గుట్టలోని మెడికవర్ ఆసుపత్రిలో గుండె వైద్య నిపుణులు సదానందరెడ్డి, సందీప్ రావు , సంజయ్ కుమార్, అవీన్ సనర్, వనులను ఘనంగా సన్మానించారు. సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సదానంద రెడ్డి మాట్లాడుతూ మారుతున్నా జీవనశైలితో ఇప్పుడు వృద్ధులతో పాటు యువత కూడా గుండె సమస్యలతో బాధపడుతున్నారు. చాలా చిన్న వయసులోనే హార్ట్ అటాక్ తో చనిపోయే వారు ఇటీవల ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇలాంటి హార్ట్ అటాక్ సరిగ్గా గుర్తిస్తే వీలైనంత త్వరగా వైద్యసహాయం అందేలా జాగ్రత్త పడవచ్చు. తద్వారా మరణాలనూ నివారించవచ్చన్నారు. కుటుంబ చరిత్రలో గుండె జబ్బులుండటమూ గుండెపోటుకు దారితీసే అంశమేనని, దాదాపు 25 శాతంమందిలో ఈ ఫ్యామిలీ హిస్టరీయే గుండెపోటుకు ఓ కారణం. ఆహారాల్లో ఎక్కువగా వాడుతున్న ఉప్పు, కొవ్వు పదార్థాలు (ట్రాన్స్ ఫ్యాట్స్)... రక్తనాళాల్లో కొవ్వులు చేరేలా, సన్నబడేలా చేస్తున్నాయి. యువతలో శారీరక శ్రమ, వ్యాయామం లేకపోవ డమూ ఓ ప్రధాన ముప్పే. వ్యాయామం చేసేవారు కూడా కొవ్వు కరిగేలా చేసుకోవడం కంటే కండరాల నిర్మాణం, మంచి ఆకృతిపైనే ఆసక్తి చూపుతున్నారు. కానీ వాకింగ్, జాగింగ్ వంటి ఏరోబిక్సు ప్రాధాన్యమివ్వడం లేదు. వ్యాయామం విషయంలో శరీరానికి తీవ్రమైన శ్రమ కలిగేలా చేయడం కంటే శ్రమలేని వ్యాయామాలే మంచివన్న కీలక అంశాన్నీ విస్మరిస్తున్నారు. యువతలో ఎక్కువ చాలా ఎక్కువ గంటల పాటు, అందునా రాత్రుళ్లు నిద్రలేకుండా పనిచేసే వృత్తుల్లో ఉండటం బాగా పెరిగింది. దాంతోపాటు తీవ్రమైన శారీరక, మానసిక ఒత్తిడిని ఎదుర్కోవడం కారణాలన్నారు. ఆసుపత్రి ఇంచార్జ్ స్వామి మాట్లాడుతూ గుండెజబ్బుతో బాధపడే ఎంతో మంది మెడికవర్ హాస్పటల్ నిజామాబాద్‌లో చికిత్స తీసుకుని తిరిగి పూర్తి ఆరోగ్య వంతులుగా మారడం గొప్ప విషయమని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ నిజామాబాద్ లో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉండటం చాలా గర్వకారణమని అత్యాధునిక సదుపాయాలు, అనుభజ్ఞులైన డాక్టర్స్ తో గుండె శస్త్రచికిత్సలను నిజామాబాద్ లో నిర్వహిస్తున్న ఏకైక హాస్పిటల్స్ మెడికవర్ హాస్పిటల్స్ అని పేర్కొన్నారు ఈ కార్యక్రమం లో మెడికవర్ హాస్పటల్ డీఎంఎస్ డాక్టర్.యజ్ఞ మార్కెటింగ్ హెడ్ వినయ్ పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రజావాణిలో 9 ఫిర్యాదులు



**నిజామాబాద్ ప్రతినిధి, జూన్ 17 (నినాదం న్యూస్) :** మొదటి సారిగా సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఇరవై ఒక్క సమస్యల దరఖాస్తులు వచ్చాయి. ఉదయం సెక్షన్ సబ్ డివిజన్ డివిజన్ కార్యాలయాల్లో సాయంత్రం జిల్లా ఎస్ సి నిజామాబాద్ కార్యాలయంలో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజాంబాద్ డివిజన్లో రెండు డిచ్పల్లి ఐదు ఆర్మూర్ ఐదు బోధన్‌లో 9 సమస్యల కోసం దరఖాస్తులు రావడం జరిగింది. ఈ దరఖాస్తులన్నీ కూడా పరిశీలించి దరఖాస్తుదారుల సమస్యలు పరిష్కారం చేయడం జరుగుతుంది అని ఎస్ ఈ ఆర్ రవీందర్ తెలిపారు. ఎస్ ఈ ఆఫీస్ నిజాంబాద్‌లో ఆర్ రవీందర్ ఎస్ ఈ ఆపరేషన్ నిజాంబాద్,డిఈ టెక్నికల్ వెంకట రమణ .ఎస్ఏఓఎం రాజశేఖర్, ఏడి కమర్షియల్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్‌కు అవార్డ్సుల పంట



**నిజామాబాద్ ప్రతినిధి, జూన్ 17 (నినాదం న్యూస్) :** రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం వారు నిర్వహించిన కాన్ఫరెన్స్ 2023-24 మరియు అవార్డుల మహోత్సవం శంకరాభరణం కార్యక్రమం భద్రాచలంలో జరిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని రోటరీ క్లబ్స్ హాజరు కావడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోటరీ అధ్యక్షులలో రెండవఉత్తమ అధ్యక్షులుగా భూలోకం విజయ్ కాంత్ రావ్ ఎంపిక కావడం జరిగింది. నిజామాబాద్ లో చేసిన పర్యావరణం, ఆరోగ్య శిబిరాలు, సామాజిక రంగం, విద్యారంగం ఇలా వివిధ అంశాలపై చేసిన కృషికి ఉత్తమ అవార్డ్స్ ముఖ్య అతిథి డిస్ట్రిక్ట్ గవర్నర్ బుషిరెడ్డి శంకర్ రెడ్డి గారి చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు విజయ్ కాంత్ మాట్లాడుతూ మేము చేసిన సేవలను గుర్తించినందుకు ధన్యవాదాలు అని , మాకు ఈ సంవత్సరం సహకరించిన రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ నిజామాబాద్ సభ్యులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు అని అన్నారు ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ శ్రీనివాస్,నిజామాబాద్ రోటరీ క్లబ్ జేమ్స్ కార్యదర్శి బంగారి వీర బ్రహ్మ%శీ%, ఆర్మూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు పట్వారీ గోపి కృష్ణ కార్యదర్శి తులసి , ప్రవీణ్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బక్రీద్ వేడుకలు



**జగిత్యాల,జూన్17(నినాదం న్యూస్):** జగిత్యాల పట్టణంలో ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు ఈ వేడుకలను పురస్కరించుకొని ఈద్గా మైదానాల్లో బక్రీద్ పర్వదిన ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు అలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జగిత్యాల పట్టణంలోని పెద్ద మసీదు, మంచినీళ్ల ఈద్గా, జమా మసీదు లో ప్రార్థనలు జరిగాయి. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం ఆదేశాల మేరకు పట్టణ మండల కేంద్రాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా పలు ఈద్గా మైదానాల ప్రార్థనల అనంతరం రాజకీయ ప్రముఖులు ముస్లిం సోదరులను కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు



**చింతపల్లి ,జూన్ 17 (నినాదం న్యూస్)** మండలంలోని వింజమూరు గ్రామ పరిధిలో ఉన్న శ్రీ కలియుగ హరిహర క్షేత్రంలో కొలువుదీరిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల ఆలయాల ప్రథమ వార్షికోత్సవాల సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి.బ్రహ్మోత్సవాల ముగింపు రోజున ఉదయం 9 :00 గంటల నుంచి మధ్యాహ్నం 12 :.00 గంటల వరకు అవబృదోత్సవం, చక్రస్నానం, మహా పూర్ణావతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్వామివారి చక్రస్నానం కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కావేటి శ్రీనివాస్ సుధా దంపతులు , డాక్టర్ కావేటి వంశీకృష్ణ , సుష్మ దంపతులు, హనుమాన్ దీక్షితులు ఆధ్వర్యంలో ఎంతో భక్తి ప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భక్తులు ఎంతో ఉత్సాహంగా తిలకించారు.అనంతరం ధ్వజ అవరోహణం, ద్వాదశ ప్రదక్షిణం, ఏకాంతోత్సవము, ఆశీర్వచనం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలను హనుమాన్ దీక్షితులు ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు ఘనంగా ముగించారు. ఈ కార్యక్రమంలో తెరట్టుపల్లి గురునాథం ,బాదం నరేందర్ , అల్లంపల్లి వెంకటయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పర్నె శివారెడ్డి మిత్ర బృందం ఆధ్వర్యంలో వెంకట్ గౌడ్‌కి సన్మానం



**చౌటుప్పల్ జూన్ 17(నినాదం న్యూస్ )**చౌటుప్పల్ మండలం పీపల్ పహాడ్ గ్రామంలో స్నేహితులతో ఆత్మీయ కలయిక అనంతరం నల్లెంకి వెంకట్ గౌడ్ కి సన్మానం చేసిన జనసేన చౌటుప్పల్ మండల అధ్యక్షుడు పర్నె శివారెడ్డి మిత్రబృందం ఆధ్వర్యంలో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు నందగిరి నరేష్, దోషపాటి అశోక్, పబ్బు కృష్ణ, కత్తి రాజు, ఎర్ర నాగరాజు, మారగొని శివ, కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# స్వార్థం అసూయ లేకుండా సేవ చేయడమే బక్రీద్ పండుగ ఉద్దేశం

## ఈద్గాను సందర్శించి ముస్లింలతో కలిసి ప్రార్థన చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి





**జమ్మికుంట, జూన్ 17( నినాదం న్యూస్):** జమ్మికుంట పట్టణంలోని కోరపల్లి రోడ్డులో గల ఈద్గాలో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ముస్లిం సోదరి, సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి స్వాగతం పలికి పూలమాల వేసి శాలువతో సత్కరించారు.. అనంతరం ఈద్గాలో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ ముస్లిం సోదరులకు బక్రీద్ ఎంతో విశిష్టమైనదని చెప్పారు. ఖురాన్‌లో చెప్పిన విధంగా పేద ప్రజలకు సహాయం అందించేందుకు ప్రతి వ్యక్తి తమవంతు బాధ్యతగా పాటు పడాలని పిలుపునిచ్చారు. నిరుపేద ప్రజలకు మన సంపాదనలో ఒక శాతం కేటాయించి ఆదుకోవాలని ఖురాన్‌లో ఉందన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాపింపజేయడమే బక్రీద్ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు.. అనంతరం ముస్లిం సోదరులను ఒకరినొకరు ఆలింగణం చేసుకుంటూ వారికి బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమములో మున్సిపల్ చెర్మెన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, జమ్మికుంట సొసైటీ చెర్మెన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్లు దయ్యాలా శ్రీనివాస్, గాజుల భాస్కర్, ముస్లిం మాత గురువులు,ముస్లింలు సోదరులు పెద్ద ఎత్తున ప్రార్థనలో పాల్గొన్నారు..

## స్వార్థం అసూయ లేకుండా సేవ చేయడమే బక్రీద్ పండుగ ఉద్దేశం

### ఈద్గాను సందర్శించి ముస్లింలతో కలిసి ప్రార్థన చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి.



**జమ్మికుంట, జూన్ 17( నినాదం న్యూస్):** జమ్మికుంట పట్టణంలోని కోరపల్లి రోడ్డులో గల ఈద్గాలో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశాం ు..ఈ కార్యక్రమంలో పాల్గొన్న హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ముస్లిం సోదరి, సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి స్వాగతం పలికి పూలమాల వేసి శాలువతో సత్కరించారు.. అనంతరం ఈద్గాలో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ముస్లిం సోదరులకు బక్రీద్ ఎంతో విశిష్టమైనదని చెప్పారు. ఖురాన్ లో చెప్పిన విధంగా పేద ప్రజలకు సహాయం అందించేందుకు ప్రతి వ్యక్తి తమ వంతు బాధ్యతగా పాటుపడాలని పిలుపునిచ్చారు. నిరుపేద ప్రజలకు మన సంపాదనలో ఒక శాతం కేటాయించి ఆదుకోవాలని ఖురాన్ లో ఉందన్నారు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు.. స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాపింపజేయడమే బక్రీద్ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు.. అనంతరం ముస్లిం సోదరులను ఒకరినొకరు ఆలింగణం చేసుకుంటూ వారికి బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చెర్మెన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, జమ్మికుంట సొసైటీ చెర్మెన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్లు దయ్యాలా శ్రీనివాస్, గాజుల భాస్కర్, ముస్లిం మాత గురువులు,ముస్లింలు సోదరులు పెద్ద ఎత్తున ప్రార్థన లో పాల్గొన్నారు..

## బిజిగీర్ షరీఫ్‌లో ఘనంగా ఈదుల్ జుహా పండుగ వేడుకలు



**జమ్మికుంట, జూన్ 17 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మండలంలోని బిజిగిర్ షరీఫ్ గ్రామంలో ముస్లిం సోదరులు సోమవారం రోజున భక్తిశ్రద్ధలతో ఈదుల్ జుహా పండుగ వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. బక్రీద్ పండుగను పురస్కరించు కొని ఈద్గాలో సామూ హిక నమాజు ప్రత్యేక ప్రార్థనలు చేసినారు. మత గురువు మౌలానా నౌమన్ హష్మీ ఖురాన్ లొని సూక్తులను ప్రజలకు చదివి వినిపించారు. హజ్రత్ ఇబ్రహీం అలైహి సలాం, హజ్రత్ ఇస్మాయిల్ అలైహి సలాం లా త్యాగనిరతిని స్మరించుకుంటూ జరుపుకునే బక్రీద్ పండుగ సందర్భంగా ప్రతిముస్లిం తనజీవితకాలంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేసి కాబా గృహాన్ని దర్శించాలని? కుర్బానీ చేయాలని మౌలానా నౌమాన్ హష్మీ చెప్పడం జరిగింది. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం, దర్గా కమిటీ కార్యనిర్వహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌపిక్ హుస్సేన్, కార్యదర్శి మొహమ్మద్ జమాల్ అష్రఫ్ ,సంయుక్త కార్యదర్శి నైముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

- బీసీల కులవృత్తులకు ఇస్తానన్న రూ.లక్ష ఎక్కడ?
- ఎమ్మెల్యే పై నిప్పులు జరిగిన కాంగ్రెస్ నేత దేశిని కోటి.



**జమ్మికుంట, జూన్ 17 (నినాదం న్యూస్)** : అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయి అని బీసీల కుల వృత్తులకు ఇస్తానన్న లక్ష రూపాయలు ఎక్కడ ఉన్నాయో చెప్పాలని ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశిని కోటి అన్నారు. సోమ వారం జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేపై నిప్పులు చెరిగారు. అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ అభివృద్ధి కొరకు వేల కోట్ల రూపాయల నిధులు తీసుకొస్తానని హామీలు ఇచ్చి ఇప్పటివరకు కనీసం వంద రూపాయల నిధులు కూడా తీసుకు రాలేదని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో బీసీల కులవృత్తుల కోసం లక్ష రూపాయలలోను ఇస్తామని చెప్పి బీసీలను రెవెన్యూ కార్యాలయం చుట్టూ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ ల కొరకు వేలకు వేలు ఖర్చు పెట్టుకుని దరఖాస్తు చేసుకుంటే వారికి నిరాశ మిగిలిందన్నారు. ఎన్నికలలో గెలిచిన తర్వాత ఎంతమందికి బీసీ లోన్లు వచ్చయో ఏ ఏ గ్రామంలో ఎన్ని చెక్కులు ఇచ్చవొ తెలపాలన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గంలోని బీసీ బిడ్డలు అందరు కలిసి మీకు న్యాయంగా ఇస్తానన్న లోన్ల పై కౌశిక్ రెడ్డిని నిలదీ యాలని ఆయన పిలుపునిచ్చారు. కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షు డు సుంకరి రమేష్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారం గపాణి కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్ పొన్నగంటి మల్లయ్య దిడ్డి రాము బొంగోని వీరన్న శ్రీపతి నరేష్ గౌడ్ నాయకులు పాతకాల అనిల్ దొగ్గల భాస్కర్ తిరుపతి శ్రీనివాస్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్‌కి బిజెపి రాష్ట్ర, జిల్లా నేతల శుభాకాంక్షలు



**కరీంనగర్, జూన్ 17(నినాదం న్యూస్ ):** బిజెపి జాతీయ ప్రధా న కార్యదర్శి , కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా నియమితులైన సందర్భంగా కరీంనగర్ బిజెపి ,రాష్ట్ర జిల్లా నేతలు ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్రహోంశాఖ సహాయమంత్రిబండి సంజయ్ కుమార్‌ని కలిసిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, కాసింపేటఎంపీటీసీ ఏలేటి స్వప్న చంద్ర రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి ,జిల్లా నాయకులు ముదిగంటి విద్యాసా గర్‌రెడ్డి, కొత్తకొండ వెంకట సాయి, పారిపెల్లి రాజు తదిత రులు ఉన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్‌కుమార్ ఎన్నిక కావడం తెలంగాణకు, ముఖ్యంగా కరీం నగర్ జిల్లాకు గర్వకారణమన్నారు. సామాన్య కార్యకర్త నుండి కేంద్ర మంత్రి స్థాయి వరకు బండి సంజయ్ కుమార్ రాణించారని, నిస్వా ర్థంగా పనిచేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.

# హుజురాబాద్‌కి వన్నె తెచ్చిన తపస్వి డాన్స్ అకాడమీ





- అక్కా చెల్లెళ్లకు ఏ అవసరం ఉన్న నేనున్నా.
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**జమ్మికుంట, జూన్ 17 (నినాదం న్యూస్):** ఒక వెయ్యి ఎనిమిది మంది మహిళల చే గోవింద నామాలతో కోలాట మహా బృంద నృత్యం ద్వారా హుజురాబాద్ లోని తపస్వి డాన్స్ అకాడమీ ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, సహస్ర మహోత్సవ సామ్రాట్ శ్రీశాంతి కృష్ణ సేవాసమితి వారి గ్లోబల్ డివోషనల్ రికార్డ్స్ ను సాధించి హుజురాబాద్ కు వన్నె తీసుకువచ్చారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం హుజరాబాద్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. మొట్టమొదటిసారిగా ప్రపంచ స్థాయి రికార్డు నెలకొల్పడం ఎంతో శుభ పరిణామని ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహించిన నృత్య దర్శకురాలు డా. చిలమ కూరి శ్వేత ఎంతో ప్రశంస నీయురాలని కొనియాడారు. ప్రభుత్వాలు ఏవైనా కళాకారుల అభివృద్ధి కోసం తన వంతు బాధ్యతతో కృషి చేస్తానని కళాకారులకు హామీ ఇచ్చారు. తెలంగాణలోని అనేక జిల్లాల నుండి హుజరాబాద్ కు విచ్చేసిన కళాకారులు అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని అక్కచెల్లెళ్లకు ఏ అవసరం ఉన్న తననుసంప్రదించాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఏవైతే హామీలు ఇచ్చాను వాటిని నెరవేర్చడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఏ మహిళకు ఆపద వచ్చిన తనకు ఫోన్ చేస్తే తనవంతు సహాయ సహకారాలు తప్పక అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హుజరాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, జమ్మికుంట పిఎసిఎస్ చైర్మన్ పోనగంటి సంపత్ హుజురాబాద్ లోని ప్రముఖులు, పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన కళాకారులు, కళాభిమానులు ఈ ఉత్సవాలలో పాల్గొన్నారు.

# ప్రేమను పంచండి.. స్వార్థాన్ని వీడండి..

- హజ్రత్ ఇబ్రహీం.. ఇస్మాయిల్‌ల త్యాగాలను స్మరించండి
- మహమ్మద్ ప్రవక్త త్యాగాలను ఆశయాలకనుగుణంగా జీవించండి
- సాలెహ్ నగర్ ఈద్గాహ్ లో ముస్లింలను ఉద్దేశించి ప్రసంగించిన ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్



**కరీంనగర్, జూన్ 17(నినాదం న్యూస్ ):** లబ్బయిక్ అల్లాహుమ్మ లబ్బయిక్ లాశరీక లక లబ్బయిక్ ఇన్నల్ హంద, వల్ నీమత లకవల్ ముల్క్..లాశరీక లక్, అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్ నినాదాలతో వీధులు, మజీదులు, ఈద్గాలు మారుమోగాయి. ఈదు ఉల్ అజ్హా వేడుక సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం బక్రీద్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ముస్లీం సోదరులతో ప్రార్ధన స్థలాలన్నీ కిటకిటలాడాయి. సామూహి క ప్రార్థనలు అనంతరం మత గురువులు అందించే ధర్మ సందేశాలను విన్నారు. కరీంనగర్ లోని రేకుర్తి సాలెహ్ నగర్, చింతకుంట వద్ద ముస్లీం సోదరులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రార్థనలో పాల్గొన్నారు. ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలన్నీ వర్క్ షాపు మైదానంలో పార్కింగ్ ఏర్పాటుచేశారు. ఎస్సారార్ కళా శాల నుంచి ఈద్గా వరకు వాహనాలను అనుమతించకుండా పర్యవేక్షించారు. బైపాస్ రోడ్డులో అహ్మద్ ఈద్గా, నగరంలోని వన్ టౌన్ పురాతన ఈద్గాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర పాలక సంస్థ విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సాలెహ్ నగర్ ఈద్గా వద్ద సదర్ ఖాజీ మన?బత్ షా ఖాన్ నమాజ్ చేయించగా, మత పెద్ద ఈద్గా ఖతీబ్ ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ సందేశాన్ని అందించారు. గురువారం ఈదుల్ ఫితర్ పర్వ దినాన్ని ముస్లీం సోదరులు ఘనంగా జిల్లావ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో పండుగ ఈద్ నమాజు ఆచరించారు. కొందరు ముస్లీంసోదరులు తమ సమీప ముస్లిమేతర స్నేహితులను ఇండ్లకు ఆహ్వానించి సేమియా, పాయసం వడ్డించివారితో ఆనందం పంచుకున్నారు. ఈసందర్భంగా ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ మాట్లాడుతూ హజరత్ ఇబ్రహీం అలైహి వ సలాం హజరత్ ఇస్మాయిల్ అలైహి సలాంలా త్యాగనిరతికి గొప్ప చిహ్నమే ఈ బక్రీద్ పండుగని చెప్పారు. అల్లాహ్ ప్రియ ప్రవక్తలైన వీరు త్యాగం చేసి, ఐదువేల సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ వారి త్యాగస్మృతికి గుర్తుగా బక్రీద్ పండుగను నిర్వహించుకోవడం నేటికీ ఆనవాయితీగా వస్తుందన్నారు. భయపెట్టిస్తే భయపడడానికి ముస్లింలు పిరికి వాళ్ళు కాదని, దేశంలో రాజ్యాంగం కల్పించినటువంటి హక్కులను చట్టానికి లోబడి ఉండి పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొన్ని కరుడుగట్టిన అతివాద సంస్థలు బక్రీద్ మాసం రాగానే ఆకాశము ఊడి పడ్డట్టు అనవసరమైన రాద్ధాంతాన్ని చేస్తున్నాయని విమర్శించారు. ముస్లింల రక్తంలో భయం లేదన్నారు. భారతదేశం ఏ ఒక్కరి సొత్తు కాదని, ఇది ప్రజాస్వామ్యయుత దేశమని, ఇక్కడ అన్ని కులాలు, మతాలు విభిన్న సంస్కృతుల మేలవింపు ఉందని భారతదేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వం ఈ దేశ ఔన్నత్మని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా భారతదేశ సంస్కృతి ఉందని గుర్తు చేశారు. హాలో ఇబ్రహీం అలైహి సలాం, ఇస్మాయిల్ సలాంలా త్యాగాలను స్మరించుకోవాలని మహనీయ మహమ్మద్ ప్రవక్త సల్లం ఆశయాలకు అనుగుణంగా ప్రతి ముస్లిం జీవించాలని కోరారు. ఈద్గాలో కొందరు ముస్లిం యువకులు పాలస్తీనాకు మద్దతుగా జెండాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం పార్టీ జాయింట్ సెక్రటరీ హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు, పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని

# విజయవంతం చేయండి

## ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్



**జమ్మికుంట, జూన్ 17 (నినాదం న్యూస్):** మాదిగల చైతన్యం కోసం, ఏబిసిడి వర్గీకరణ కోసం 1994 లో ఆవిర్బవించిన దండోరా (ఎమ్మార్పీఎస్) ఆవిర్భవించి, 30 ఏళ్లు వస్తున్న సందర్భంగా జూలై 7న వరంగల్లో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం కొరకు సన్నహాక సమావేశం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చేనెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సన్నాహక జమ్మికుంటలోని ఒక ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌లో నిర్వహిం చగా,ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశం జరిగేపార్టీలకు అతీతంగా, మాదిగల ఆత్మగౌరవం కోసం మాదిగలు,మాదిగ ఉపకులాలు ఆవిర్భావ వేడుకలకు సమాయత్తం కావాలని అన్నారు. ఈ చారిత్రాత్మక సందర్భంగా విడుదల చేస్తున్న పాటలకు, పుస్తకాల ముద్ర్ణకు తనవంతుగా సహకారం అందిస్తానని అన్నారు. ఏబిసిడి వర్గీకరణ అంశంలో మందకృష్ణన్న చేసిన త్యాగం మరువలేనిదని అన్నారు. పార్టీలకతీతంగా మాదిగలు, మాదిగ ఉపకులాలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం సీనియర్ నాయ కుడు నలిగంటి శరత్ మాట్లాడుతూ మాదిగ జాతికి మనం దరం వారసులం కనుక ఈ కార్యక్ర మంలో స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆహ్వానం పలికారు. కవిత్వం, పాటలు, వ్యాసాలు సమీక రించి పుస్తక రూపంలో అందించబోతున్నామని అన్నారు. రచయితలు తమ రచనలు ఈనెల 25లోగా పంపించాలని కోరారు. సీనియర్ కళాకారుడు రామంచ భరత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ కవులు, కళాకారులు ముక్కెర సంపత్ కుమార్, డా. కట్కూరి మహేందర్, అశోక్ మోరే, గిద్దె రాంనర్సయ్య, అంబాల మధు నయ్య, గోల్కొండ బుచ్చన్న, పుల్లూరు సమ్మయ్య (సమర్), జూపాక శివ, కన్నూరి ఆనంద్, కేతపాక ప్రసాద్, సీనియర్ దళిత సంఘాల నాయకుడు ఇమ్మడి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# బండి సంజయ్‌ను కలిసిన దూబాల శ్రీనివాస్



**కరీంనగర్, జూన్ 17(నినాదం న్యూస్):** బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రిగా నియమితులైన సందర్భంగా కరీంనగర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ దుబాల శ్రీని వాస్ ఆయనను ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ బిజెపిలో సామాన్య కార్యకర్తగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన బండి సంజయ్ కుమార్‌కు దక్కిన అరుదైన గౌరవం కేంద్ర మంత్రి పదవి అన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుంది అనడానికి బండి సంజయ్ కుమార్ నిదర్శనంగా నిలుస్తారన్నారు. అలాగే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహ జ్యోతి పథకంలో అనేక లోటుపాట్లు ఉన్నాయని ఆయన ఆరోపించారు. గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తా మని ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్ నేడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందన్నారు. 200 యూనిట్ల లోపు వారికి జీరో బిల్లులు ఇవ్వాల్సింది పోయి, చెల్లింపు విద్యుత్ బిల్లులు జారీ చేయడం దారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ గృహ జ్యోతి పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## తీగల వంతెన నాణ్యత లోపాలు

# బయట పడుతున్నాయి

- తొలగించిన మాజీ ప్రధాని నెహ్రూ విగ్రహానికి డబ్బులు లేకపోవడం బాధని మిగిల్చింది.
- స్మార్ట్ సిటీ నగరంలో ఇప్పటికీ రోడ్లు డ్రైనేజీల నిర్మాణం చేపట్టకపోవడం దురదృష్టకరం
- మల్యాల సుజిత్ కుమార్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కరీంనగర్



**కరీంనగర్, జూన్ 17(నినాదం న్యూస్):** కరీంనగర్ నగర పరిధిలో ఎమ్మెల్యే, మేయర్, ఎంపీ లు నగరపాలక సంస్థ అట్టహాసంగా ప్రారంభించిన కేబుల్ బ్రిడ్జి/తీగెల వంతెన కొద్ది నెలలకే పలుమార్లు రిపేర్ కి రావడం, దానికి వాళ్ళు పెట్టిన ఖర్చు దాదాపు రెండువందల కోట్ల రూపాయల ప్రజా ధనం అని తెలియడం చాలా బాధ కలిగించే అంశం. అదేదో ప్రపంచ వింత లాగా, లక్షల మందికి లబ్ది చేకూర్చేదిగా ఆ బ్రిడ్జి ప్రారంభం అప్పుడు కోట్ల రూపాయల ఖర్చుతో డాన్స్ షోలు పెట్టి ఎమ్మెల్యే, మేయర్ ప్రజలని మభ్యపెట్టారు కానీ తరువాత బ్రిడ్జి నాణ్యత లోపం పదే పదే బయటపడుతోంది. ఇక నగర నడిబొడ్డున సవరన్ స్ట్రీట్ లో దశాబ్దాలుగా కొలువుతీరిన నెహ్రు చౌక్ లో పూజ్య పండిట్ జవహర్ లాల్ నెహ్రూ గారి విగ్రహాన్ని తొలగించిన నగరపాలక సంస్థ నాలుగేళ్లుగా ఆయన విగ్రహాన్ని తిరిగి స్థాపించడం లేదు. ఈ మేయర్ రాజకీయాల్లో ఎదిగిందే నెహ్రూ గారి స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీలో, కానీ మేయర్ ఎమ్మెల్యే లు బీజేపీ ఎంపీ కి భయపడో లేక ఆ విగ్రహానికి అయ్యే బడ్జెట్ చాలా తక్కువ అనో ఆ మహానేత దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ గారి విగ్రాహాన్ని పునః ప్రతిష్టించడం లేదు. ఎన్నో మార్లు నగరపాలక సంస్థ కమిషనర్ గారిని ఈ విషయంలో కలవడం జరిగింది. కేబుల్ బ్రిడ్జి ఖర్చు, నాణ్యత, నెహ్రు గారి విగ్రహ స్థాపన పై గట్టి చర్చ జరాగాల్సిందే.అలాగే గత దశాబ్ది కాలంగా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్లో విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్ శానిటేషన్ జవాన్లను ఇప్పటివరకు బదిలీలు చేపట్టకుండా గత ప్రభుత్వం లోని పాలకవర్గం వారికి అనుకూలంగా విధులు చేపట్టేలా చూసుకోవడం జరిగింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇటీవల కొంతమంది రాజకీయ పార్టీల నాయకులు డివిజన్లో వారీగా మున్సిపల్ శానిటేషన్ జవాన్లుగా పనిచేస్తున్న వారిని వేరుక డివిజన్లకు బదిలీ చేపట్టాలని కోరినప్పటికీ ఇట్టి విషయమై నగరపాలక సంస్థ పాలకవర్గ సభ్యులు కమిషనర్ స్పందించక పోవడం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఈ బదిలీలు ఎందుకు చేపట్టడం లేదో గల కారణాలను నగర ప్రజలకు తెలియజేయవలసిన అవసరం ఉందని డిమాండ్ చేయడం జరుగుతుందన్నారు.

# వేద భారతావనిలో ప్రముఖుడు...

# యాజ్ఞవల్క్యుడు



శ్లో. వందేహం మంగళాత్మానం భాస్వంతం వేద విగ్రహమ్,
యాజ్ఞవల్క్యం ముని శ్రేష్ఠం జిష్ణుం హరి హర ప్రభుమ్,
శ్లో. జితేంద్రియం జితక్రోధం సదా ధ్యాన పరాయణమ్,
ఆనందనిలయం వందే యోగానంద మనీశ్వరమ్
శ్లో. ఏవం ద్వాదశ నామాని త్రికాలే యః పఠే న్నరః
యోగీశ్వర ప్రసాదేన విద్యావాన్ ధనవాన్ భవేత్...

**యాజ్ఞవల్క్య మహర్షి ప్రాచీన వేద భారతావనిలో ప్రముఖుడు. ఉపనిషత్తుల్లో ముఖ్యంగా కనిపించే యాజ్ఞ వల్క్యుడు శతపథ బ్రాహ్మణం (బృహదారణ్య కోపనిషత్తు సహా), యాజ్ఞవల్క్య సంహిత, యాజ్ఞవల్క్య స్మృతి రచించాడు. పూర్వం కురుపాంచాల దేశంలో గంగానదీ తీరాన చమత్కార పురం అనే నగరంలో ఉండే యజ్ఞవల్క్యుడు అనే మహర్షి, ఆయన భార్య సునందలకు జన్మించినవాడే యాజ్ఞ వల్క్యుడు.**

యాజ్ఞవల్క్యుడు భాష్కలుడి దగ్గర రుగ్వేదాన్ని, జైమిని మహర్షి దగ్గర సామవేదాన్ని, అరుణి దగ్గర అధర్వణ వేదాన్ని నేర్చుకు న్నాడు. వైశంపాయన మహర్షి దగ్గర యజుర్వేదాన్ని నేర్చుకున్నాడు. అయితే యాజ్ఞవల్క్యుడికి అహం కారం, విద్యామదం లాంటివి కలిగాయి. ఆ విషయాన్ని గురువు గ్రహించాడు. యాజ్ఞవల్క్యుడిలో నానాటికీ విద్యామదం అధికం అయింది. అది ఆత్మాభిమానమని యాజ్ఞవల్క్యుడు అనుకున్నాడు. ఓ రోజున వైశంపాయనుడు తన మేనల్లుడు అధర్మమార్గంలో సంచరిస్తున్నాడని తెలుసుకొని కోపం పట్టలేక కాలితో అతడిని తన్నాడు. బ్రాహ్మణుడిని కాలితో తన్నటం బ్రహ్మహత్యతో సమానమని ధర్మశాస్త్రాలు చెప్పిన విషయాన్ని వైశంపాయనుడు కోపం చల్లారిన తర్వాత గుర్తుకు తెచ్చుకున్నాడు. ఇక ఆ పాపాన్ని ఎవరు పోగొడతారా అని మదన పడసాగాడు. ఆ విషయాన్ని గమనించిన యాజ్ఞవల్క్యుడు గురువు దగ్గరగా వెళ్ళి ఆ పాపాన్ని పోగొట్టడం తనవల్ల తప్ప మరెవరివల్లా కాదని గర్వంగా అన్నాడు. తనపాపం పోవటం అటుంచి అంతటి కష్టకాలంలోను శిష్యుడు అంత గర్వంగా మాట్లాడటం గురువుకు కోపం తెప్పించింది. ఇక తాను ఎలాంటి విద్యలు అతడికి నేర్పబోనని, అప్పటిదాకా నేర్పిన వాటి నన్నింటినీ కక్కి (ఏవీ గుర్తుంచు కోకుండా మరిచిపోయి) వెళ్ళిపొమ్మని అన్నాడు. గురు ద్రోహానికి అదే తగిన శిక్ష అని అన్నాడు. అయితే అప్పటికి యాజ్ఞవల్క్యుడు తాను ఆత్మాభిమానం పేరున గర్వభావాన్ని కలిగివున్నానని తెలుసు కొన్నాడు. క్షమించమని గురువును వేడుకొన్నా లాభం లేకపోయింది. అయితే తనవంతు బాధ్యతగా యాజ్ఞవల్క్యుడు తన తపోబలంతో గురువుకు సంక్రమించిన బ్రహ్మహత్యా దోషాన్ని పోగొట్టి తాను నేర్చుకొన్న వేదాలను అక్కడే రక్తరూపంలో కక్కి వెళ్ళి పోయాడు. అయితే ఎంతో విచిత్రంగా యాజ్ఞవల్క్యుడు విసర్జించినదాన్ని కొన్ని తిత్తిరి పక్షులు గ్రహించి, అవి తిరిగి ఆ వేదసారాన్ని పలికిన పలుకులే తైత్తిరీయోపనిషత్తుగా ప్రసిద్ధికెక్కాయి. గురువు దగ్గర నేర్చుకున్నదంతా అక్కడే వదిలివేసిన యాజ్ఞ వల్క్యుడు ఆత్మస్థైర్యంతో సూర్య భగవానుడిని ఆరాధించి ఆయన కరుణకు పాత్రుడై శుక్ల యజు ర్వేదాన్ని నేర్చుకున్నాడు. తర్వాత సరస్వతీదేవిని ఉపాసించి సమస్త విద్యలూ అభ్యసించాడు. ఉత్తమోత్తమ విద్యాధిపతిగా యాజ్ఞవల్క్యుడు పేరుతెచ్చు కున్నాడు. కణ్వుడు లాంటి ఉత్తమ శిష్యులు ఆయనదగ్గర శిక్షణ పొందాడు.

ఒకసారి జనకుడు యాగం చేస్తూ మహర్షులందరినీ ఆహ్వానించాడు. యాజ్ఞవల్క్యుడికి ఆహ్వానం వెళ్ళింది. అలా మహర్షు లందరూ రాగానే జనకుడు మీలో ఎవరు గొప్ప విద్యా వంతులైతే వారొచ్చి ఇక్కడున్న ధనరాశులను తీసుకు వెళ్ళవచ్చు అని అన్నాడు. రుషు లంతా ఒకరిముఖాలు ఒకరు చూసుకొని తామందుకు అర్హులం కామను కొంటూ ఊరకనే కూర్చున్నారు. యాజ్ఞవల్క్యుడు మాత్రం లేచి తన శిష్యులను పిలిచి ఆ ధనరాశులను తన ఇంటికి తీసుకు వెళ్ళమని ఆజ్ఞాపించాడు.

యాజ్ఞవల్క్యుడి ధైర్యాన్ని చూసిన తర్వాత అతడితో శాస్త్ర విషయాల్లో పోటీకి దిగి యాజ్ఞ వల్క్యుడిని అనర్హుడిగా నిరూ పించేందుకు చేసిన ప్రయత్నం ఫలించక పోవడంతో జనకుడు ఆ రుషిని గొప్పగా పూజించి సత్కరించాడు. జనకునికి ఆయన అనేక ఆధ్యాత్మిక విషయాలను వివరించి చెప్పాడు. ఓ రోజున విశ్వావసుడు అనే గంధర్వుడు యాజ్ఞవల్క్యుడి వద్దకు వచ్చి, తత్త్వాన్ని ఉపదేశించమని కోరి ఎంతో నేర్చుకొని యాజ్ఞవల్క్య దంతటి గొప్పవాడు మరొకడు లేడని ఆ మహర్షికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి వెళ్ళి పోయాడు. అనంతరకాలంలో ఆ రుషి గృహస్థాశ్రమాన్ని స్వీకరించాడు.

ఆ రోజుల్లో కతుడు అనే ఒక రుషి ఉండేవాడు. ఆయనకు కాత్యాయని అనే పేరున్న కూతురుండేది. ఆమెను యాజ్ఞవల్క్యుడి కిచ్చి పెళ్ళిచేశారు పెద్దలు. అయితే మిత్రుడు అనే పేరున్న ఒక బ్రాహ్మణుడి కుమార్తె, పండితురాలైన గార్గి అనే ఆమె శిష్యురాలు అయిన మైత్రేయి యాజ్ఞవల్క్యుడిని వివాహ మాడాలని పట్టుబట్టింది. అప్పటికే అతడికి కాత్యాయనితో వివాహం కావటంతో పెద్దలకు ఏంచేయాలో అర్థంకాలేదు. గార్గి ఈ సమస్యకు సమాధానాన్ని వెతికింది. మైత్రేయిని కాత్యాయనికి పరిచయంచేసి ఆ ఇద్దరూ ఎంతో స్నేహంగా ఉండేలా చేసింది. కాత్యాయని, మైత్రేయి ఒకరిని విడిచి మరొకరు ఉండలేని స్థితికి వచ్చారు. అప్పుడు గార్గి అసలు విషయాన్ని కాత్యాయనికి చెప్పింది. కాత్యాయని కూడా మైత్రేయి కోరికను మన్నించి యాజ్ఞ వల్క్యుడితో వివాహాన్ని జరిపించింది. అలా యాజ్ఞ వల్క్యుడికి ఇద్దరు భార్యల య్యారు. రుషులంతా యాజ్ఞ వల్క్యుడి లోని విద్యా వైభవాన్ని, యోగ ప్రాభవాన్ని గుర్తించి మాఘశుద్ధ పూర్ణిమ నాడు యోగీంద్ర పట్టాభిషేకం చేశారు. అతను ఋషులకు తెలియజేసిన విషయాలే యోగశాస్త్రమని యోగ యాజ్ఞవల్క్య మనీ ప్రసిద్ధికెక్కాయి. యాజ్ఞవల్క్యుడు భార్యలకు తత్వమునుపదేశించి సన్యసిం చాడు. ఆయన పేర ఒక స్మృతి ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494

# అవని

## కంద అట్లు



కావాల్సినవి: కందగడ్డ: మీడియం సైజు ఒకటి, పెసరపప్పు: ఒక కప్పు, బియ్యం: పావుకప్పు, అల్లం: చిన్న ముక్క, పచ్చిమిర్చి: రెండు, కొత్తిమీర: కొద్దిగా, కరివేపాకు: రెండు రెబ్బలు, జీలకర్ర: అర టీస్పూన్, ఉప్పు: తగినంత, నూనె: తగినంత తయారుచేసే విధానం: పెసరపప్పు, బియ్యం మూడు గంటలు నానబెట్టుకోవాలి. కందగడ్డను చిన్నసైజు ముక్కల్లా కట్ చేసుకోవాలి. నానబెట్టిన బియ్యం, పెసరపప్పును మిక్సీలో దోశ పిండిలా రుబ్బుకోవాలి. పిండి రుబ్బుతున్నప్పుడే కంద ముక్కలు, అల్లం, పచ్చిమిర్చి, కరివేపాకు, జీలకర్ర, కొత్తిమీర వేసి అన్నీ మెదిగేలా బాగా రుబ్బుకోవాలి. తర్వాత తగినంత ఉప్పు వేసుకొని పిండిని బాగా కలపాలి. పెనం మీద కొద్దిగా నూనె వేసుకొని.. ఈ పిండితో అట్టు వేసి దోరగా కాల్చుకోవాలి. అన్నంలోకి నంజుకోవడానికి ఇవి చాలా బాగుంటాయి.



## పనీర్ జిలేబీ

కావలసిన పదార్థాలు... పనీర్ తురుము: ఒక కప్పు, ఉప్మా రవ్వ: రెండు టేబుల్ స్పూన్లు, మైదా: రెండు టేబుల్ స్పూన్లు, కార్న్‌ఫ్లోర్: ఒక టేబుల్ స్పూన్, పాలు: పావు కప్పు, యాలకుల పొడి: అర టీస్పూన్, చక్కెర: ఒక కప్పు, రెడ్ ఫుడ్ కలర్: చిటికెడు, నూనె: వేయించడానికి సరిపడా.
**తయారీ విధానం...** మిక్సీ జార్‌లో పనీర్, ఉప్మా రవ్వ, మైదా, కార్న్‌ఫ్లోర్, ఫుడ్ కలర్ వేసి కొద్దికొద్దిగా పాలుపోసి ముద్దలా వచ్చేలా గ్రైండ్ చేయాలి. స్టవ్‌మీద పాన్ పెట్టి చక్కెర వేసి కొద్దిగా నీళ్లు పోసి పాకం పట్టుకోవాలి. పాకం వచ్చాక యాలకుల పొడి వేసి దించేయాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోసి వేడి చేయాలి. పనీర్ మిశ్రమాన్ని పైపింగ్ బ్యాగ్‌లో కానీ, పాలప్యాకెట్ కవర్‌లో కానీ వేసి కాగిన నూనెలో జిలేబీల్లా ఒత్తుకుని దోరగా కాల్చుకోవాలి. కాలిన జిలేబీలను పాకంలో వేసి అర గంటపాటు నానిన తర్వాత, సర్వ్ చేసుకుంటే నోరూరించే పనీర్ జిలేబీ సిద్ధం.

# అధిక బరువు తగ్గాలంటే...



జీవనశైలిలో మార్పులు.. తగ్గిన శారీరక శ్రమ.. నిద్ర వేళల్లో తేడాలు.. ఉద్యోగ టెన్షన్లు.. తదితర కారణాలతో వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ అధిక బరువు సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కరించుకోవడానికి తేలికైన మార్గం ఉందని చెబుతున్నారు. కీర దోస జ్యూస్ సరైన పరిష్కారం అంటున్నారు. కీర దోస కాయలతో జ్యూస్ చేయడానికి వాటిని ముక్కలుగా కట్ చేయాలి. అయితే, వాటిని కట్ చేస్తున్నప్పుడు తొక్కలు తీయొద్దు. తొక్కలోనూ పలు రకాల పోషకాలు ఉంటాయి. ఈ ముక్కలు మిక్సీ జార్‌లో వేసి, కొన్ని కరివేపాకు ఆకులు, నీరు పోసి మిక్స్ చేసి గ్లాస్ లో తీసుకోవాలి. తాగే ముందు నిమ్మకాయలో సగం చెక్క రసం, కొంచెం జీలకర్ర పొడి కలిపి తాగాలి. ప్రతి రోజూ ఉదయం ఈ జ్యూస్ తాగొచ్చు. ఎప్పుడు తాగినా అంతకు ముందు రెండు గంటల పాటు కడుపు ఖాళీగా ఉండాలన్న సంగతి మరిచిపోవద్దు. పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును కరిగించేస్తుంది. శరీరం బరువు కూడా చాలా వేగంగా తగ్గిపోతుంది కూడా. కీర దోసలో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉండటంతో ఈ జ్యూస్ తాగినప్పుడు కడుపు నిండిన భావన ఎక్కువగా ఉండటంతోపాటు తొందరగా ఆకలి కాదు. దీంతో తీసుకునే ఆహారం పరిమాణం తగ్గుతుంది. వేసవిలో కీర దోస ఎంతో మేలు చేస్తుంది. వేసవిలో కీర దోస తినడం గానీ, జ్యూస్ గానీ తీసుకుంటే డీ హైడ్రేషన్ సమస్య తగ్గుతుంది.

# నినాదం మార్కెట్

## ఎస్‌యూవీల్లో గేమ్ చేంజర్..

### త్వరలో భారత్ మార్కెట్లోకి టాటా నెక్సాన్ ఐసీఎన్జీ..!




ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్.. తన టాటా నెక్సాన్ ఐసీఎన్జీ కారును 2024- భారత్ మొబిలిటీ షోలో ప్రదర్శించింది. త్వరలో భారత్ మార్కెట్లో ఆవిష్కరించనున్నది. సీఎన్జీ ఆప్షన్లో రావడంతో కంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్లో గేమ్ చేంజర్ కానున్నది. టర్బో చార్జ్ పెట్రోల్ ఇంజిన్‌తో వస్తున్న తొలి సీఎన్జీ ఆప్షన్ కారుగా టాటా నెక్సాన్ నిలువనున్నది. ఆరు లేదా ఎనిమిది నెలల్లో భారత్ మార్కెట్లోకి రానున్నది. డీజిల్ ఇంజిన్లతో ఖర్చును పరిగణనలోకి తీసుకుంటే ముమ్ముందు సీఎన్జీ ఆప్షన్ కార్లు మార్కెట్లో గణనీయ వాటా పొందుతాయని టాటా మోటార్స్ భావిస్తోంది. సేఫ్టీ రీత్యా టాటా నెక్సాన్ ఐసీఎన్జీ ఆప్షన్ కారులో సీఎన్జీ పవర్ ట్రైన్ ఉంటుంది. సీఎన్జీ రీఫ్యుయలింగ్ సమయంలో ఆటోమేటిక్‌గా ఇంజిన్ ఆగిపోతుంది. టాటా నెక్సాన్ ఐసీఎన్జీ కారు 1.2 లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో వస్తుంది. సీఎన్జీ ఫ్యుయల్ కెపాసిటీ ఎంత అన్నది టాటా మోటార్స్ వెల్లడించలేదు. ప్రస్తుతం భారత్ మార్కెట్లో టర్బో చార్జర్-సీఎన్జీ టెక్నాలజీ కాంబినేషన్ అందుబాటులో లేదు. సంప్రదాయంగా నేచురల్లీ ఆస్పిరేటెడ్ సీఎన్జీ ఆప్షన్ కార్లు ఉన్నాయి. 1.5 లీటర్ల నేచురల్లీ ఆస్పిరేటెడ్ ఇంజిన్ విత్ ఫ్యాక్టరీ ఫిట్టెడ్ సీఎన్జీ కిట్‌తో వస్తున్న మారుతి సుజుకి బ్రెజా సీఎన్జీ కారుతో టాటా నెక్సాన్ సీఎన్జీ కారు పోటీ పడుతుంది. మారుతి సుజుకి బ్రెజా సీఎన్జీ కారు ఇంజిన్ గరిష్టంగా 87 బీహెచ్పీ విద్యుత్, 121 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. టాటా నెక్సాన్ ఐసీఎన్జీ టర్బో చార్జ్ ఆప్షన్‌తో పోలిస్తే సీఎన్జీ ఆప్షన్ డిస్ అడ్వాంటేజ్ కలిగి ఉంటుంది. టాటా నెక్సాన్ ఐసీఎన్జీ కారులో ట్విన్ సిలిండర్ సీఎన్జీ సెటప్ కూడా ఆఫర్ చేస్తున్నారు. బ్రెజా సీఎన్జీ కారుతో పోలిస్తే టాటా నెక్సాన్ ఐసీఎన్జీ కారులో సుమారు 230 లీటర్ల బూట్ స్పేస్ ఉంటుంది.

# టాటా మోటార్స్ బంపరాఫర్..

## కార్లపై గరిష్టంగా రూ.1.35 లక్షల డిస్కౌంట్లు.. ఇవీ డిస్కౌంట్లు..!




మారుతి సుజుకి, హ్యుండాయ్ మోటార్ ఇండియా సంస్థలతో పోటీ పడుతున్న కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్.. తన కార్ల విక్రయాలను పెంచుకునేందుకు వివిధ మోడల్ కార్లపై డిస్కౌంట్లు ప్రకటించింది. ఎలక్ట్రిక్ కార్లతోపాటు ఇంటర్నల్ కంబుష్టన్ ఇంజిన్ (ఐసీఈ) మోడల్ కార్లపైనా ఈ డిస్కౌంట్లు ఆఫర్ చేసింది. గరిష్టంగా రూ.1.35 లక్షల వరకూ రాయితీ కల్పి స్తోంది. ఈ డిస్కౌంట్లు ఈ నెలాఖరు వరకూ అమల్లో ఉంటాయి. టాటా మోటా ర్స్ పాపులర్ మోడల్ కార్లు - టాటా టియాగో, టాటా ఆల్ట్రోజ్, టాటా నెక్సాన్, టాటా సఫారీ, టాటా హారియర్ వంటి కార్లలో వేరియంట్లను బట్టి గరిష్టంగా రూ.55 వేల వరకూ డిస్కౌంట్లు లభిస్తాయి. ఇక ఎలక్ట్రిక్ కార్లలో టాటా టియాగో ఈవీ, టాటా టైగోర్ ఈవీ, టాటా పంచ్ ఈవీ, టాటా నెక్సాన్ ఈవీ కార్లపై గరిష్టం గా రూ.1.35 లక్షల వరకూ డిస్కౌంట్ లభిస్తుంది. ఈ డిస్కౌంట్లలో క్యాష్ డిస్కౌంట్స్, ఎక్స్ఛేంజ్ డిస్కౌంట్, స్క్రాపేజ్ బోనస్, కార్పొరేట్ డిస్కౌంట్ ఉన్నాయి.

**టాటా టియాగోపై రూ.60 వేల బెనిఫిట్...** టాటా మోటార్స్ కార్లలో టాటా టియాగో అత్యంత చౌక కారు. ఈ కారు పెట్రోల్, పెట్రోల్-సీఎన్జీ, ఎలక్ట్రిక్ పవర్ ట్రైన్ టెక్నాలజీ ఆప్షన్లలో లభిస్తుంది. పెట్రోల్ వేరియంట్ టియాగోపై గరిష్టంగా రూ.60 వేల డిస్కౌంట్ ఆఫర్ చేసింది. ఇందులో క్యాష్ బెనిఫిట్ రూ.35 వేలు, ఎక్స్ఛేంజ్ బోనస్ రూ.20 వేలు, రూ.5,000 కార్పొరేట్ డిస్కౌంట్ లభిస్తుంది. సీఎన్జీ వేరియంట్ టియాగోపై రూ.25 వేల క్యాష్ డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ బోనస్ రూ.20 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ రూ.5,000లతో కలిపి గరిష్టంగా రూ.50 వేల డిస్కౌంట్ లభిస్తుంది.

**టైగోర్‌పై గరిష్టంగా రూ.55 వేల బెనిఫిట్...**

కంపాక్ట్ సెడాన్ కారు టాటా టైగోర్ పెట్రోల్ వేరియంట్ మీద గరిష్టంగా రూ.55 వేలు డిస్కౌంట్ లభిస్తుంది. ఇందులో క్యాష్ డిస్కౌంట్ రూ.30 వేలు, ఎక్స్ఛేంజ్ బోనస్ రూ.20 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ రూ.5000 లభిస్తుంది. సీఎన్జీ వేరియంట్ మీద రూ.25 వేల క్యాష్ బెనిఫిట్, ఎక్స్ఛేంజ్ బోనస్ రూ.20 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ రూ.5000తో కలుపుకుని రూ.50 వేల రాయితీ లభిస్తుంది.

**టాటా ఆల్ట్రోజ్‌పై రూ.50 వేల తగ్గింపు...** టాటా మోటార్స్ ప్రీమియం హ్యాచ్ బ్యాక్ టాటా ఆల్ట్రోజ్ పెట్రోల్ లేదా డీజిల్ వేరియంట్ మీద గరిష్టంగా రూ.50 వేల ధర తగ్గింపు లభిస్తుంది. అందులో క్యాష్ డిస్కౌంట్ రూ.25 వేలు, ఎక్స్ఛేంజ్ బోనస్ రూ.20 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ రూ.5000 లభిస్తుంది. ఇక ఆల్ట్రోజ్ సీఎన్జీ వేరియంట్ మీద రూ.40 వేల వరకూ రాయితీ అందుకోవచ్చు.


**నెక్సాన్, సఫారీ, హారియర్‌లపై ఇలా ఆఫర్లు...** టాటా మోటార్స్ బెస్ట్ సెల్లింగ్ కంపాక్ట్ ఎస్‌యూవీ కారు నెక్సాన్ మీద రూ.50 వేల వరకూ రాయితీ అందుబాటులో ఉంది. అందులో రూ.25 వేలు క్యాష్ బెనిఫిట్, రూ.20 వేలు స్క్రాపేజ్ లేదా ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ డిస్కౌంట్ రూ.5000 లభిస్తుంది. టాటా హారియర్, టాటా సఫారీలపై గరిష్టంగా రూ.30 వేల డిస్కౌంట్ ఆఫర్ చేసింది టాటా మోటార్స్.

**ఈవీ కార్లపై రూ.1.35 లక్షల వరకూ బెనిఫిట్...**

టాటా మోటార్స్ ఈవీ సెగ్మెంట్‌లో బెస్ట్ సెల్లింగ్ ఎస్‌యూవీ మోడల్ నెక్సాన్ ఈవీపై రూ.1.35 లక్షల వరకూ డిస్కౌంట్ లభిస్తుంది. సెలెక్టెడ్ వేరియంట్లపై రూ.85 వేల వరకూ రాయిత పొందొచ్చు. అత్యంత చౌక ధరకు లభించే టాటా టైగోర్ ఈవీపై రూ.95 వేల డిస్కౌంట్ ప్రకటించింది టాటా మోటార్స్. ఇందులో లాంగ్ రేంజ్ ట్రిమ్ రూ.75 వేలు, మిడ్ రేంజ్ మోడల్ మీద రూ.60 వేల డిస్కౌంట్లు లభిస్తాయి. గతేడాది మార్కెట్లో ఆవిష్కరించిన టాటా పంచ్ ఈవీపై రూ.10 వేల డిస్కౌంట్ ఆఫర్ చేసింది.

## ఏటీఎంలలో నగదు విత్ డ్రా చేసే వారికి బ్యాడ్ న్యూస్..

# సర్వీస్ చార్జ్ పేరిట కొత్త బాదుడు..



ఏటీఎం సర్వీస్ చార్జీలు పెరగనున్నాయా? అంటే అవుననే సమాధానమే వస్తోంది. కస్టమర్ల నుంచి వసూలు ఇంటర్ చేంజ్ ఫీజును పెంచాలని ఏటీఎం సర్వీస్ ప్రోవైడర్లు ప్రతిపాదనలు పెట్టాయి. ఏటీఎం బిజినెస్ ను మరింత విస్తరించడానికి ప్రస్తుతం ఉన్న రేట్లను పెంచాలని వారు చూస్తున్నారు. ఇది జరిగితే ఉచిత లావాదేవీలు ముగిసిన చేసే ప్రతి లావాదేవీకి వినియోగదారులకు అదనపు ఫీజులు పడతాయి.
ఇంటర్ చేంజ్ ఫీజు అంటే.. ఇంటర్ చేంజ్ ఫీజు అంటే ఏటీఎం సర్వీస్ ప్రొవైడర్ కి బ్యాంకు చెల్లించే రుసుము. ఇది వినియోగదారులు తమ కార్డుతో ఏటీఎం ద్వారా నగదు విత్ డ్రా చేసినప్పుడు ఇది పడుతుంది. ముఖ్యంగా ఒక బ్యాంకు కార్డుతో మరో బ్యాంకు ఏటీఎంలో డబ్బులు విత్ డ్రా చేసినప్పుడు ఇది వినియోగదారుడికి పడుతుంది. ఫీజు ఎంత పెంచనున్నారంటే.. ఏటీఎం ఇంటర్ చేంజ్ ఫీజును రూ. 23కు పెంచాలని ది కాన్ఫెడరేషన్ ఆఫ్ ఏటీఎం ఇండస్ట్రీ(సీఏటీఎంఐ) కోరింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ), నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్పీసీఐ)కు విన్నవించింది. ఇది ఏటీఎం ఆపరేషనల్ చార్జీల కింద వసూలు చేయనుంది. ఇది దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ ఏటీఎం సర్వీసులు ప్రభావవంతంగా పనిచేసేందుకు ఉపకరిస్తుందని చెబుతున్నారు. వాస్తవానికి ఏటీఎం ఇంటర్ చేంజ్ ఫీజు రూ. 15 ఉండగా.. దానిని 2021లో రూ. 17కి పెంచారు. గరిష్ట లిమిట్ రూ. 21గా నిర్ణయించారు. ప్రస్తుత ఏటీఎం లావాదేవీల లిమిట్స్ ఇవి.. ప్రస్తుతం సేవింగ్స్ ఖాతా దారులు దేశంలో ఆరు మెట్రో నగరాలైన ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో ప్రతి నెల ఐదు ఉచిత లావాదేవీలు అందుబాటులో ఉంటాయి. ఈ ఐదు ఉచిత లావాదేవీలు దాటితే అదనపు చార్జీలు వసూలు చేస్తారు. కాగా ఇప్పుడు ఏటీఎం చార్జీలు పెంచాలన్న ప్రతిపాదనపై ఆర్బీఐ సానుకూలంగా స్పందించినట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. వినియోగదారులపై ప్రభావం ఇది.. ఒకవేళ ఈ ప్రతిపాదనను ఆర్బీఐ అంగీకరిస్తే.. వినియోగదారులపై ఉచిత లావాదేవీల లిమిట్ దాటిన తర్వాత అదనపు చార్జీలు పడతాయి. తరచూ ఏటీఎంలలో నగదు ఉపసంహరించుకునే వారికి ఇది అదనపు భారం కాగలదు. కాగా డిజిటల్ పేమెంట్స్ బాగా పెరుగుతున్న నేపథ్యంలో ఏటీఎంల వినియోగం బాగా తగ్గింది. అందరూ సెల్ ఫోన్లతోనే యూపీఐ లావాదేవీలు చేసేస్తున్నారు. చేతిలో డబ్బులు ఉంచుకోవాలనే ఆలోచనే జనాల్లో తగ్గిపోయింది. ఈ క్రమంలో ఇప్పుడు ఈ నిర్ణయం కూడా ఏటీఎంల వినియోగంపై పెద్ద ప్రభావమే చూపుతుందని నిపుణులు చెబుతున్నారు.

# పొట్ట కూడి కోసం వచ్చే వలస కూలీల భద్రత యజమానులదే

- పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ
- ప్రతి రైస్ మిల్లు,ఇటుక బట్టీలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని రైస్ మిల్స్, ఇటుక బట్టీల యాజమాన్యంతో సమావేశం





**సుల్తానాబాద్, జూన్ 17 (నినాదం న్యూస్):** పొట్ట కూడి కోసం ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వలస కూలీల భద్రతయజమానులదే అని పెద్ద పల్లి ఏసీబీ గజ్జి కృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు సుల్తానాబాద్ సర్కిల్ పరిధి లోని 110 రైస్ మిల్స్,23 ఇటుక బట్టిల అసోసియేషన్ సభ్యులతో మండల కేంద్రంలోని నరహరి ఫంక్షన్ హాల్ లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏ సీపీ మాట్లా డుతూ పొట్టకూటి కోసం వలస కూ లీలు ఇతర రాష్ట్రాల నుండి వచ్చే,ఇతర కూలీ ల భద్రత రైస్మిల్స్,ఇటుక బట్టి యజమానులదే సూచించా రు. అలాగే ప్రతి రైస్ మిల్లు,ఇటుక బట్టీల ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చే యాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి కూ లీలను తీసుకువచ్చిన్నపుడు వారి వివరాలు న మోదు చేసి,రిజిస్టార్ సంబంధిత శాఖ తెలుపాల న్నారు. అదే విధంగా మగ కూలీలు,ఆడ కూలీలకు వేరు వేరుగా నివాస ప్రాంతాలను ఏర్పాటు చే సి, కుటుంబ సభ్యులతో ఉండేటువంటి కూలీలకి వేరుగా నివాస ప్రాంతాలు ఏర్పాటు చేయాలి అ ని తెలిపారు. రైస్ మిల్,ఇటుక బట్టీల యజమా నులు తమ వద్ద పని చేసేటువంటికూలీల యొ క్క గత చరిత్రను తెలుసుకోవాలి,చెడు అలవా ట్లు(మద్యంగంజాయి డ్రగ్స్) కలిగిన వారి వివ రాలు సేకరించి వా రిని పనిలో తీసివేయాలని తెలియ జేశారు. రైస్ మిల్,ఇటుక బట్టి ప్రాంతా ల్లో సెక్యూరిటీ గార్డ్స్ ఏర్పాటు చేసుకొని రిజిస్ట ర్లు ఏర్పాటు చేసి ఇన్అవుట్ అయ్యే వారి వివ రాలు పూర్తిగా నమోదు చేయాలి అని, మిల్స్, బట్టిలలో కూలీల చేత వెట్టి చాకిరి చేయించ వ ద్దని,కార్మిక చట్టాలు కచ్చితంగా పాటించాలన్నా రు. వారికీ కనీస అవసరాలు అనగా త్రాగునీరు ,సరైన వసతి,ఆసుపత్రిలను ఏర్పాటు చేయక పోవడం,చిన్నచిన్న గదులలో వారి నివాసలల్లో ఇబ్బందులు పడకుండా కనీస ఏర్పాట్లు చేయా లని సూచించారు. సమావేశంలో సీఐ సుబ్బా రెడ్డి, ఎస్సై శ్రవణ్ కుమార్,రైస్మిల్లర్స్ మినుపాల ప్రకాష్ రావు, పల్లమురళి, కేశవరావు, నగునూరి అశోక్, పురుషోత్తంరావు,జైపాల్ రెడ్డి,తిరుపతి రెడ్డి,పన్నాల రామన్న, పల్లవాసు, ఇటుక బట్టీల యజమానులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యాన్ని విడనాడాలి

**కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంతటి అన్నయ్య గౌడ్.**



**సుల్తానాబాద్, జూన్ 17 (నినాదం న్యూస్):** విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతు న్నారని కాంగ్రెస్ సీ నియర్ నాయకుడు అంతటి అన్నయ్య గౌడ్ అ ధికారులకు సూచించారు. వారు మాట్లాడుతూ సుల్తానాబాద్ మండలం,మున్సి పల్ కేంద్రంలో గత రెండు నెలలుగా విద్యుత్ స రఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, కరెంటు ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ వి షయమై ప్రజలు,స్థానిక రాజకీయ నాయకులు ఫోన్ చేసిన విద్యుత్ శాఖ నుండి సరైన స్పందన రావటం లేదని,విద్యుత్తు శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నార ని అన్నారు. ఈ విద్యుత్తు అంతరాయాలకు తె లంగాణ ప్రభుత్వమే కారణమని,తద్వారా ప్ర భుత్వ ప్రతిష్టపై ప్రతికూల ప్రభావంపడేలా ప్రజల ను నమ్మించేలా విద్యుత్తు శాఖ ఉద్యోగుల పని తీరు మెరుగు పడాలని, ఈ సమస్యను సరి చేయడానికి మీరు తక్షణ జోక్యం చేసుకోవాలని అభ్య ర్థిస్తున్నా నని తెలిపారు. అదే విధంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా అయ్యేలా చూడాలని, ప్ర జలకు జవాబు దారీ తనం పాటిం చాలని కోరారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించి ప్ర భుత్వానికి మంచి పేరు వచ్చేలా కృషి చేయాల ని పేర్కొన్నారు.

## త్యాగానికి ప్రతీక బక్రీద్



**పెద్దపల్లి రూరల్, జూన్ 17 (నినాదంన్యూస్):** బక్రీద్ పండగ త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లి సమీప ఈద్గా వద్ద ముస్లిం సోదరులను కలిసి ఆయన శుభా కాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లా డుతూ తమకు ఉన్న దాంట్లో ఎంతో కొంత ఇతరులకు పంచడమే దాతృత్వ స్వభావమని బక్రీద్ పండుగ ద్వారా మానవజాతి నేర్చు కోవాలనన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, నూగిళ్ల మల్లన్న,దొడ్డిపల్లి జగదీష్, బొడ్డుపల్లి శ్రీనివాస్, భూతగడ్డ సంపత్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ కార్యాలయాల్లో ప్రజావాణి



**పెద్దపల్లి ప్రతినిధి, జూన్17( నినాదం న్యూస్)** విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పెద్దపెల్లి జిల్లాలోని సెక్షన్, సబ్ డివిజన్, డివిజన్, ఎస్.ఇ కార్యాలయాల్లో 'ప్రజావాణి' కార్యక్ర మాన్ని నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినియోగదారులు అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. పెద్దపల్లి సర్కిల్ కార్యాలయంలో సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ ప్రజావాణి నిర్వహించారు. కాగా విని యోగదారుల నుంచి మొత్తం 16 దరఖాస్తులు స్వీకరించినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## కరెంట్ షాక్‌తో యువకుడు మృతి



**మల్హర్ రావు, జూన్ 17 (నినాదం న్యూస్):** మండలం లోని రుద్రారం గ్రామంలో సోమవారం తన ఇంటి సమీపంలో బోరు మోటారా వైరు సరి చేస్తూ దుద్దుల్ల నిశాంత్ అనే యువకుడు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నిశాంతుకు ఆరు నెలల క్రితమే వివాహం జరగగా ఇప్పుడు ఇలా విద్యుత్ షాక్ రూపంలో ప్రాణాలు కోల్పోవడంతో భార్యను కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరివల్ల కాలేదు.

## ఇందిరమ్మ కాలనీలో రోడ్డు చదును చేయించిన అరుణ్



**బెల్లంపల్లి జూన్ 17 (నినాదం న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని రెండవ వార్డు ఇందిరమ్మ కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డును బిఆర్ఎస్ వార్డు ఇంచార్జి సబ్బని అరుణ్ మొరం మట్టి పోయించి సోమవారం చదును చేయిం చారు. బస్తీబాట కార్యక్రమంలో బాగంగా ఇందిరమ్మ కాలనిలోని పలు సమస్యలతో పాటు,రోడ్లు లేక నడవడానికి కూడా వీలు లేకుండా రోడ్లపై గతుకులు ఉన్నాయని,వర్షంపడితే నడిచే వీలే లేదని కాలనీవాసులు తెలియజేయడంతో వారి సమస్యలను పరిష్కరించే దిశగా వెంటనే స్పందించి తన సొంత ఖర్చులతో మొరం మట్టి తెప్పించి సమస్య పరిష్కరించారు. కాలనీలో సమస్యలు తెలియజేసిన వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆయనకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల దోపిడిపై చర్యలు తీసుకోవాలి




**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 17 (నినాదం న్యూస్):** నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు విద్యా ర్థుల తల్లిండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నా యని, వారి దోపిడీని పూర్తిస్థాయిలో ఖచ్చితంగా అడ్డుకుం టామని ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దీపక్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిబంధ నలు సైతం పాటించని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల లపై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఎబివిపి జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో జరుగుతున్న దోపిడీని ఆడ్డుకుంటుం దని హెచ్చరించారు. ఒక వైపు ప్రభుత్వం పుస్తకా లు, యూనిఫామ్, స్టేషనరీ విక్రయించకూడదని ఉత్తర్వులు జారీ చేసిన ప్రైవేట్ కార్పొరేట్ పాఠశా లలో విచ్చలవిడిగా ఇష్ట రాజ్యంగా విద్యార్థుల తల్లింద్రులను నిలువు దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయం లో జిల్లా విద్యా శాఖ అధికారులు ఏమి చేస్తున్నా రని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా విద్యార్థు లను వారి వయసుకు మించిన పుస్తకాల బరు వులు మొయిస్తు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఇకనైనా విద్యా శాఖ అధికారులు మాముళ్ళ మత్తు వొదిలి ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ముస్లిం సోదరులకు కాంగ్రెస్ నాయకుల బక్రీద్ శుభాకాంక్షలు



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 17 (నినాదం న్యూస్):** మంచిర్యాల పట్టణంలోని ముస్లిం సోదరులకు మంచిర్యాల శాసనసభ్యులు ప్రేం సాగర్ రావు పక్షాన మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరిం చుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో గల మసీదుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రావుల ఉప్పలయ్య, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తూముల నరేష్,జిల్లా ఒబిసి చైర్మన్ వడ్డే రాజమౌళి, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు కౌన్సిలర్ బానేష్,కౌన్సిలర్లు మజీద్, జోగుల సదానందం,బోలిశెట్టి కిషన్ మైనార్టీ పట్టణ అధ్యక్షులు నజీర్, ఎన్ ఎస్ యు ఐ పట్టణ అధ్యక్షులు సాయి,ఏఎంసి డైరెక్టర్ తాజ్,నాయక్,స్వామి, ఎడ్ల మల్లేష్,మైనార్టీ నాయకులు జలీల్,ఇర్ఫాన్,నభ్యాస్,ఖలీద్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పనులపై ఇంటింటా సర్వే



గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**కేసముద్రం జూన్ 17 (నినాదం న్యూస్)** కేసముద్రం మండలం కిష్టాపురం లో మిషన్ భగీరథ పనులపై ఇంటింటి సర్వే చేసినట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అశోక్ ఆదేశాల మేరకు, ప్రజల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంకల్పముతో పండుగ నాడు కూడా పనులు చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా పై సర్వే నిర్వహించి ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రమేష్, కంప్యూటర్ ఆపరేటర్ హరీష్,

## ఈద్గాలలో ప్రార్ధనలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ



**వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్ 17 (నినాదం న్యూస్):** మైనార్టీల సంక్షేమానికి, అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నదని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని వరంగల్ నగరంలోని ఎల్బి నగర్, మట్టేవాడ, మిల్స్ కాలనీ ఈద్గాలలో నిర్వహించిన ప్రార్ధనా కార్యక్రమాల్లో మంత్రి సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖను ముస్లింమతపెద్దలుశాలువాతో సత్కరించి గౌరవించారు. మంత్రి సురేఖ మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యురాలిగా భావించి, తనను ఈద్గా ప్రార్థనా కార్యక్రమాలకు ఆహ్వానించిన ముస్లిం మత పెద్దలకు, ఈద్గా కమిటి సభ్యులకు, ప్రజలకు మంత్రి సురేఖ ధన్యవాదాలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, ముస్లిం సోదరసోదరీణులు తనను ఆదరించి గెలిపించ్డం వల్లనే తాను నేడు మంత్రి హోదాలో ఈ కార్యక్రమాలకు వచ్చానని అన్నారు. మైనార్టీలకు దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో తెచ్చిన రిజర్వేషన్ల వల్ల ఎందరో ముస్లింల జీవితాలు బాగుపడ్డాయని మంత్రి సురేఖ అన్నారు. నేడు రాష్ట్ర ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పునరంకితమైం దని చెప్పారు. పలు రంగాల్లో ముస్లింలు ఎదుర్కొంటున్న సమ స్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేం దుకు శాయశక్తులా కృషి చేస్తానని మంత్రి సురేఖ స్పష్టం చేశా రు. ఈ కార్యక్రమాల్లో వరంగల్ ఎంపి కడియం కావ్య కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండలో బందన్ ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి కొండా



**వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్ 17 (నినాదం న్యూస్):** అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి సురేఖ సోమవారం హన్మకొండ లోని బందన్ ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మంత్రి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది మంత్రి సురేఖతో సెల్ఫీలు తీసుకుని ఆనందించారు. మంత్రి సురేఖ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. బీదవర్గాలకు చేయూతనిచ్చేలా వైద్యసేవలను అందించాలని యాజమాన్యానికి మంత్రి సూచించారు.

## ఘనంగా బక్రీద్ పండుగవేడుకలు

**మానవాళి సుఖ శాంతుల కోసం ప్రత్యేక ప్రార్థనలు.**



**సుల్తానాబాద్, జూన్ 17(నినాదం న్యూస్):** సుల్తానాబాద్ మండలం తో పాటు పట్టణ కేంద్రంలో ముస్లిం సోదరులు ఘనంగా బక్రీద్ పండుగ జరుపుకున్నారు. సోమవారం మున్సి పల్ కేంద్రం లోని అలంగీర్ మస్జిద్ ప్రక్కనే ఉన్న ఈద్గాలో 'ఈద్ అల్ అదహ'పర్వదిన ప్రార్థనలు చేశారు. ముస్లింసోదరులు పెద్దసంఖ్యలో హాజరై నమాజు పూర్తి చేశారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యే క దువా'లో ప్రపంచ మానవాళి సుఖశాంతులతో జీవనంగడపాలని,విశ్వ ప్రజలందరికి సుఖ శాంతులతో పాటు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులు ఒకరికొకరుఆ లింగనంచేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని ప్రముఖులు బక్రీద్ పండుగ సందర్భంగా శుభకాంక్షలు తెలిపారు.

## ఘనంగా వయోధికుల వేధింపుల నివారణ దినోత్సవం



**కాగజ్ నగర్ జూన్ 17 (నినాదం న్యూస్):** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రాజీవుగాంధీ చౌరస్తాలో ఈరోజు ప్రపంచ వయోధికుల వేధింపుల నివా రణ దినోత్సవంలి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ తరపున ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ గారు మాట్లాడుతూ వయోధికులను గౌరవించుకోవాలని, వారి ఆలనా పాలనా బాధ్యత వారి పిల్లలదేనీ, శివప్రసాద్ రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘం కార్యదర్శి గారు మాట్లాడుతూ 2007-2011 చట్టం ప్రకారం వారి హక్కులకు బంగం కలిగించరాదనీ తెలిపారు,Asr మూర్తి మాట్లాడుతూ వయోధికులను సరిగా చూసుకోపోతే శిక్షార్హులు అవుతారని తెలిపారు. ఈసందర్భంగా సభ్యులు నారాయణ, కలికోటరమణయ్య, యెల్లాగౌడ్, తూదూరి ప్రకాష్,గుల్లపెల్లి నాగేశ్వరరావు, పురుషోత్తం, నాగేశ్వరరావు, %చీవీ%కోటేశ్వరరావు, భాస్కర్ రెడ్డి, కె.బాలరాజు, మార్త ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్నగర్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



**కాగజ్ నగర్ జూన్ 17( నినాదంన్యూస్):** చైర్మన్ డైరెక్టర్లను సన్మానించిన సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రావి శ్రీనివాస్ జిల్లా అధ్యక్షుల విశ్వ ప్రసాద్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాగజ్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం అనంతరం కోనేరు కోనప్ప నివాసానికి వచ్చి కోనేరు కోనప్ప విశ్వప్రసాద్ రావి శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలిపిన నూతన కాగజ్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధల దేవయ్య, వైస్ చైర్మన్ వార్ల తిరుపతితోపాటు మరో 11 మంది ప్రమాణ స్వీకారం చేశారు .జడ్పీ ఇన్చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## 19, 20న జాబ్ మేళా

**కాగజ్ నగర్ జూన్ 17 (నినాదం న్యూస్):** కొమరం భీం జిల్లా కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19, 20 తేదీలలో వివిధ ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగాల భర్తీ నిమిత్తం డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.లక్ష్మినరసింహం తెలిపారు. ఈ నెల 19 న ఐసిఐసిఐ,ఎస్ బ్యాంక్ లలో రిలేషన్షిప్ మేనేజర్లుగా పని చేయడానికి ఆసక్తి కలిగిన ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన మరియు ప్రస్తుతం తృతీయ సంవత్సరం పరీక్షలు రాసిన అభ్యర్థులు ఈనెల 19న ఉదయం10.00 తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలతో కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హాజరుకావాలని సూచించారు. అదే విధంగా ఈ నెల 20 న కెమిస్ట్రీ తో డిగ్రీ పూర్తిచేసిన బిఎస్సి అభ్యర్థుల కొరకు శ్రీకృష్ణ ఫార్మా కంపెనీ వారు కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కాబట్టి బిఎస్సి కెమిస్ట్రీ చదివిన పురుష అభ్యర్థులు ఈనెల 19 లోపు 7013607011 కి తమ వివరాలు వాట్సప్ ద్వారా %అ%పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 7013607011 ను సంప్రదించగలరు.

## బెల్లంపల్లిలో భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 17 (నినాదం న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో సోమవారం ముస్లిం సోదరులు అత్యంత బక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ వేడు కలు జరుపుకున్నారు. బెల్లంపల్లి ట్టణం,తాండూరు, కాసిపేట, భీమిని,నెన్నెల,కన్నెపల్లి, వేమనపల్లి మండల కేంద్రాలలో ఉదయం సమీప మసీదులలో ప్రత్యేకప్రార్థనలు జరుపుకున్నారు. మసీదుల వద్ద స్థానిక పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ నేతృతంలో సిఐ దేవయ్య,ఎస్ఐ రమేష్ పట్టణంలోని అశోక్ నగర్,బాబు క్యాంపులోని మజీద్‌ల వద్ద బందోబస్తు నిర్వహించారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనల అనం తరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భక్తికి,సహనానికి,మంచికి మారుపేరైన బక్రీద్ పండుగను ప్రతి సంవత్సరం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటామని ముస్లిం సోదరులు తెలిపారు.

## బక్రీద్ సందర్భంగా సాయి భోజన్ అన్నదానం



**బెల్లంపల్లి జూన్ 17 (నినాదం న్యూస్):** త్యాగానికి పోరాటానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ సంద ర్భంగా తమ ట్రస్టు వ్యవస్థాపకుల సహకారంతో సోమవారం సాయి భోజన్ ద్వారా అన్నదానం చేసినట్లు సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్,రాజేశ్వరి లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు చోట్ల యాచకులకు, మానసిక వికలాంగులకు,వృద్ధులకు, అనాథలకు,పే ఎదవారికి,అన్నార్తులకు అన్నదానం చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ పండుగలోనే త్యాగగుణాన్ని గౌరవిం చేందుకు,పోరాట తత్వాన్ని,స్ఫూర్తిని పొందేందుకు ప్రతి ఒక్కరు ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సేవా ట్రస్టు మేనేజర్ బొద్దున సతీష్,సభ్యులు,సేవకులు పాల్గొన్నారు.

# మా క్లిక్ మీ లుక్‌కు స్పందన







'నినాదం'లో ఇటీవల ప్రచురితమైన 'మా క్లిక్.. మీ లుక్ 'కథనాలకు స్పందన లభించింది. ఎస్బిఐ మంథని శాఖ నిర్వహిస్తున్న అద్దె భవనంపై కప్పు పెచ్చులను తొలగించిన ఇంటి యజమాని విజయ్ కుమార్ మరమ్మతులు చేయిస్తున్నారు. *అలాగే సాంఘిక సంక్షేమ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనంపై పెరిగిన రావి చెట్టును ఆదివారం హాస్టల్లో పనిచేస్తున్న సిబ్బందితో తొలగించినట్లు వార్డెన్ మల్లికార్జున్ తెలిపారు.*

**- కొట్టె రవీందర్, పెద్దపల్లి ప్రతినిధి, నినాదం న్యూస్**

## పినపాక ఎమ్మెల్యేకు మాతృ యోగం : భారీగా తరలివచ్చిన జనం

**మణుగూరు జూన్ 17 (నినాదం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాతృమూర్తి పాయం రాములమ్మ( 90) సోమవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందింది. గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఈరోజు ఉదయం ఒక్కసారిగా గుండెల్లో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించే సమయంలోనే ఆమె కోమా లోకి వెళ్లి మృతి చెందినట్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఆమె మృతి చెందే సందర్భంలో కొడుకుగా ఎమ్మెల్యే దగ్గరే ఉండటం కొడుకు చేతిలోనే ఆమె ప్రాణం విడిచినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సంఘటనతో ఎమ్మెల్యే ఒక్కసారిగా ఉద్రేకానికి లోనయ్యారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వ్యాప్తంగా ఏడు మండలాల నుంచి జనం వేలాదిగా తరలివచ్చారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ను ఓదార్చుతూ అనేకమంది పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. వందల మంది బంధువుల సమక్షంలో స్వర్గస్తురాలు అయిన రాములమ్మ మృతదేహం గిరిజన సాంప్రదాయ ప్రకారం డోలు వాయిద్యాలతో వందలాది మంది సమక్షంలో వీడ్కోలు పలికారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు వీఐపీలు పోలీసు అధికారులు రెవెన్యూ అధికారులు అన్ని శాఖల నుంచి అధికారులు వచ్చి ఎమ్మెల్యేని ఓదార్చి అంజలి ఘటించారు.

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చింది కాంగ్రెస్సే, ఇచ్చేదీ కాంగ్రెస్సే

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూన్ 17(నినాదం న్యూస్):** రాష్ట్రంలోని జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇండ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందనీ, రాబోవు రోజుల్లోనూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంతో పాటు ఇండ్ల స్థలాలు ఇచ్చేది కూడా మా ప్రభుత్వమేనని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇండ్ల స్థలాలు, జర్నలి స్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ సీఎంను కలిసి పలు సమస్య లపై వినతపత్రం సమర్పించారు. జర్నలిస్టుల సమస్యల సమస్యలను పరిష్క రించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందనీ, ప్రస్తు తం ఉన్న ప్రజాప్రభుత్వం ప్రజాపాలన అని రాష్ట్రంలోని జర్నలిస్టుల సమ స్యలు దశలవారీగా పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముందు వరుసలో ఉండాలని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు కోరుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశీర్వాదంతో అభివృద్ధి సంక్షేమంలో ముందడుగు వేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో ఖమ్మంతో పాటు పలు జిల్లాల్లో గత ప్రభుత్వం కేవలం మాటలు చెప్పి జర్నలి స్టులను మోసం చేసిందని భట్టి విక్రమార్క విమర్శిం చారు. మాది మాటల ప్రభుత్వం కాదనీ, జర్నలిస్టులకు అండగా నిలుస్తామని అన్నారు.

**డిమాండ్లపై వినతి పత్రం అందజేత..** ఖమ్మం జిల్లాలో జర్నలిస్టుల సమస్యలపై టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలు సమస్యలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల సమస్యను అనేక సంవత్సరాల నుండి చేసిన పోరాటాల ఫలితంగా గత ముగ్గురు ముఖ్యమంత్రుల సాక్షిగా నాటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం జిల్లా జర్నలిస్టులకి వెంటనే ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని ఆదేశాలు ఇప్పటం జరిగిందని వినతిపత్రం పేర్కొన్నారు. ఈ మేరకు 26.05. 2023న జి.ఓ నెం. 147 ప్రకారం 23 ఏకరాల రెండు కుంటల భూమి. జర్నలిస్టులకు కేటాయిస్తూ జి.ఓ జారీ చేశారు. ఇందులో 8 ఎకరాల రెండు కుంటల భూమికి అధిక రేట్లు ఉన్నందున ప్రత్యామ్నాయ భూమిని కేటాయించాలి. జర్నలిస్టులందరికి 23 ఏకరాల ఇండ్ల స్థలాలుగా ఎకరాల భూమి ఇండ్ల స్థలాలుగా పంపిణి చేయాలి. 14 ఏకరాలు మాత్రమే కేటాయిస్తాము. మిగిలిన భూమిని తరువాత ఇస్తాం అని జర్నలిస్టులను మోస గించే పనిని అధికారులు చేస్తున్నారు. ఈ విధానాన్ని విరమించు కోవాలని అధికారులని వినతిపత్రంలో పేర్కొన్నారు. 2024 వరకు ఉన్న అర్హులు అయిన జర్నిలిస్టులు అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలాని కోరుతున్నాము. అక్రిడిటేషన్ గడువు ఈ నెల చివరితో ముగుస్తున్నందున, కార్డులను రెన్యువల్ చేయాలని కోరుతున్నాము. లేదా కోత్త కార్డులు ఇవ్వాలి. జర్నిలిస్టుల బస్ పాసులను రెనువల్ చేయాలి. హెల్త్ కార్డులను పునరిద్దరించాలనీ, రైల్వే పాసులు పునరుద్దరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డు ఉన్న ప్రతీ జర్నలిస్టుకు రాష్ట్ర వ్యాప్తంగా బస్ పాస్లో 1/3 రాయితిని వర్తివంచేయాలని కోరారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, డిప్యూటీ సెక్రెటరీ



మందటి వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు రామిశెట్టి విజేత, వనం నాగయ్య, మందుల ఉపేందర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్, టెంజూ పట్టణ అధ్యక్షులు యలమందల జగదీష్, జిల్లా నాయకులు కొరకొప్పుల రాం బాబు, ముత్యాల కోటేశ్వరరావు, బిక్కి గోపి, టీఎస్ చక్రవర్తి, వెంకటకృష్ణ, తోట గణేష్, సంతోష్, పిన్ని సత్యనారాయణ, ఈశ్వరి, వెంకటరెడ్డి, ఉత్కంఠం శ్రీనివాస్, పానకాల రావు తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండుగ : ఎమ్మెల్యే కేపీ.వివేకానంద



**కుత్బుల్లాపూర్, జోన్ 17 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు మైనారిటీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే కేపీ.వివేకానంద బక్రీద్ పండుగలో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లాకు తన కొడుకును బలిచ్చేందుకు ఒక తండ్రి సన్నద్ధమవగా, వారి త్యాగాలకు మెచ్చిన అల్లా కొడుకుకు బదులుగా ఒక బక్రీని బలివ్వమని తెలుపగా నాటి నుంచి బక్రీద్ పండుగ ప్రారంభమైందన్నారు. ముస్లిం సోదరులు అత్యంత ఆనందోత్సవాల మధ్య తమను తాము అల్లాకు సమర్పించుకుంటూ పేదవారికి సహాయం చేస్తూ నిర్వహించుకునే పండుగలలో ఒకటి బక్రీద్ అని వాడుక ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ముస్లిం సోదరులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు మైనారిటీ నాయకులు, కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు

### కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేసిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు



**మల్కాజిగిరి, జూన్ 17(నినాదం న్యూస్):** మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలను మల్కాజిగిరి బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ లు, సీనియర్ నాయకులు, నాయకుల ఆధ్వర్యంలో సోమవారం మల్కాజిగిరి చౌరస్తాలో కేక్ కట్ చేసి, బాణాసంచా పేల్చి ఘనంగా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి, పేద ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మేకల సునీత రాము యాదవ్, మీనా ఉపేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పరశురాం రెడ్డి, రావుల అంజయ్య, వెంకన్న, జికె హనుమంతరావు, రాము యాదవ్, కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, మురుగేష్, చిన్న యాదవ్, గంగాధర్ కృష్ణ, నీలం సతీష్, ఉపేందర్, పిఎస్ శ్రీనివాస్, గణేష్, శ్రీకాంత్,





జనార్ధన్, సురేష్, రవీందర్, కుమార్, పంజా శ్రీకాంత్, సాయి గౌడ్, నర్సింగ్, బైరు అనిల్, కాటం రాజు, చిందం శ్రీనివాస్, నర్సింగ్, నవీన్ యాదవ్, పిట్ల శ్రీనివాస్, బాబు, ఓం రాజ్, వెంకటేష్, శ్రీధర్, జంగారాజు, లక్ష్మీ ఆనంద్, వైశాలి, అనురాధ, రజిని, బాలకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నినాదం సినిమా

## కత్తిలా దూసుకు వస్తున్న ప్రీతి ముకుందన్

కొత్త సినిమా హీరోయిన్ల జాబితాలో ఇప్పుడు ముకుంద కూడా చేరింది. ప్రస్తుతం మలయాళ సినీ ఇండస్ట్రీలో అనశ్వర రాజన్, మమితా బైజు.. కన్నడ నాట రుక్మిణీ వసంత్ , సప్తమి గౌడ వంటి నవ కథానాయికలు వరుస చిత్రాలతో దుమ్ము రేపుతున్నారు. అదే కోవలో బాలీవుడ్‌లో రష్మిక, కృతి సనన్, తమిళంలో ఇవానా, ప్రియాంక మోహన్ కుర్రకారు కలల రాణులుగా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తెలుగు నాట అయేషా ఖాన్ , ప్రీతి ముకుందన్ ఆ జాబితాలో చేరారు. ఇప్పటికే అయేషా ఖాన్ పాత్రతో సంబంధం లేకుండా ఐటం సాంగ్స్, చిన్న క్యారెక్టర్స్‌తో తెలుగులో అర డజన్ చిత్రాల వరకు చేస్తుండగా.. రీసెంట్‌గా వచ్చిన ఓం భీం భుష్ చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ప్రీతి ముకుందన్ క్రమంగా వరుస ఛాన్సులను దక్కించుకుంటూ అగ్ర స్థానానికి చేరేలా కనిపిస్తోంది. తాజాగా అమె నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం కన్నప్ప నుంచి అమె స్టిల్స్ బయటకి వచ్చాక ఇప్పుడు అందరి దృష్టి ఈ అమ్మడిపై పడింది. గత నెలలో ఈ అమ్మడు తమిళంలో కెవిన్‌తో నటించిన స్టార్ అనే సినిమాతోనూ ఆకట్టుకుని అందరి అటెన్షన్‌ను తన వైపు తిప్పుకుంది. తమిళనాడుకు చెందిన ప్రీతి ముకుందన్ మంచి క్లాసికల్ డ్యాన్సర్. ఇప్పటికే చెన్నై షాపింగ్ మాల్ వంటి చాలా షోరూంస్ ప్రమోషన్స్ కార్యక్రమాలతో తమిళ, తెలుగు నాట బాగా పాపులర్ అయింది. ఈ క్రమంలోనే ఇటీవలే శ్రీవిష్ణు హీరోగా వచ్చిన ఓం భీం బుష్ చిత్రంతో హీరోయిన్‌గా ఆరంగేట్రం చేసింది. ఆ వెంటనే మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్పలో అవకాశం దక్కించుకుంది. తాజాగా ఈ సినిమా టీజర్ రిలీజ్ చేయగా అందులో ప్రీతి విజువల్స్ అందరినీ మెస్మరైజ్ చేశాయి. చాలామంది ఇందులో ప్రభాస్ లుక్స్ తర్వాత ఈ అమ్మడి గురించే ఎక్కువగా మాట్లాడు కుంటున్నారంటే అతిశయోక్తి కాదు. దీంతో యూత్ ఎవరీ ప్రీతి అంటూ సెర్చ్ చేస్తున్నారు. ఈ అమ్మడు రాబోవు రోజుల్లో అగ్ర స్థానానికి వెళ్లే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయంటూ





## థాయిలాండ్ బయలుదేరిన దేవర




జూ.ఎన్టీఆర్ క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. 'దేవర' సినిమా కీలక షెడ్యూల్‌ను గోవాలో పూర్తి చేసుకుని ఇటీవల హైదరాబాద్ చేరుకున్నారు. సోమవారం తాజా షెడ్యూల్ కోసం థాయిలాండ్ పయనమయ్యారు. అక్కడ ఓ పాట, కీలక సన్నివేశాలు చిత్రీకరణ చేయనున్నారని సమాచారం. ఆయనతో పాటు భార్య లక్ష్మీ ప్రణతి, పిల్లలు కూడా వెళ్లారు. ఆదివారం సాయంత్రం కథానాయిక జాన్వీకపూర్ కూడా థాయ్‌ల్యాండ్‌కు బయలుదేరారు. ఎయిర్‌పోర్ట్‌కి వెళ్తున్న ఈ ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అభిమానులు ఆ వీడియోలను షేర్ చేస్తున్నారు. అయితే షూటింగ్‌తోపాటు తన కుటుంబంతో సరదాగా గడపడానికి కూడా ట్రిప్ వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్లు, గ్లింప్స్ ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. సరైన హిట్ కోసం కొరటాల శివ శాయశక్తులు ప్రయత్నాలు చేస్తున్నారు. పక్కా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని సుధాకర్ మిక్కిలినేని, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శ్రుతీ మరాఠే, ప్రకాశరాజ్, మురళీశర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదటి భాగాన్ని సెప్టెంబర్ 27న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



## వరుణ్ ఫెయిల్యూర్ హీరో కాదు

### ఎమోషనల్ అయిన భార్య వితిక

వరుణ్ సందేశ్ ఫెయిల్యూర్ హీరో అని కొందరు అనడంపై ఆయన భార్య వితిక ఎమోషనల్ అయ్యారు. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి వచ్చిన వరుణ్ గత 17 ఏళ్లుగా సినిమాలు చేశారని చెప్పుకొచ్చారు. సినిమాలు వద్దనుకుని అన్నీ సర్దుకుని వెళ్తే వాళ్లు ఫెయిల్యూర్. కానీ వరుణ్ మాత్రం చిత్రపరిశ్రమనే నమ్మకుని సినిమాలు చేస్తున్నారని వితిక తెలిపింది. ఎదోక రోజు వితిక హిట్ కొడుతారంటూ వితిక ఎమోషనల్ అయ్యారు. వరుణ్ సందేశ్ హీరోగా నింద అనే సినిమా తెరకెక్కుతుంది. ది ఫర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజేష్ జగన్నాథం నిర్మాతగా, దర్శకుడిగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను 2024 జూన్ 21వ తేదీన రిలీజ్ చేయనున్నారు. మూవీ ప్రమోషన్ లో భాగంగా మేకర్స్ ఆదివారం రోజున ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వితిక కూడా హాజరయ్యారు. నింద సినిమాలో శ్రేయారాణి, ఆనీ, క్యూ మధు హీరోయిన్లుగా నటిస్తోన్నారు. తనికెళ్ల భరణి, భద్రమ్, సూర్య, చత్రపతి శేఖర్, కీలక పాత్రలు పోషిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన హ్యాపీడేస్ సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోగా ఎంట్రీ ఇచ్చాడు వరుణ్ సందేశ్. ఆ తరువాత కొత్త బంగారులోకం, ఏమైంది ఈవేళ, చమ్మక్ చల్లో వంటి చిత్రాలు మంచి హీరోగా నిలబెట్టాయి. ఆ తరువాత కథల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరించడంతో చాలా ఫెయిల్యూర్స్ వచ్చాయి.

## రాజ్‌తరుణ్...భలే ఉన్నాడే



రాజ్ తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా జె శివసాయి వర్ధన్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'భలే ఉన్నాడే'. డైరెక్టర్ మారుతి సమర్పణలో ఎన్వీ కిరణ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే టీజర్‌తో పాటు ఒక సాంగ్‌తో ఇంప్రెస్ చేసిన టీమ్.. తాజాగా ఈ మూవీ నుంచి 'సెట్ అవుతుందా' అంటూ సాగే సెకండ్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. శేఖర్ చంద్ర కంపోజ్ చేసిన ఈ మెలోడీకి కృష్ణ కాంత్ క్యాచీ లిరిక్స్ రాశాడు. కపిల్ కపిలన్ పాడిన విధానం ఆకట్టుకుంది. 'ఏమవునో ఏమవునో.. ఈ జంట ఏమవునో.. ఎందాక సాగేనో ఈ పయనం తెలుసా.. అణకువతో ఉంటారే ఒకరు.. కల కంటూ ఉంటారు ఇంకొకరు.. ఈ జంట కలిసేదేలా.. సెట్ అవుతుందా పెయిర్.. రైటో రాంగో వీరు.. మిస్టరీ వీడేదెప్పుడో తెలుసా..ఇద్దరి లోకాలే వేరు.. ఎవరు తగ్గేలా లేరు.. గమ్యం చేరే దారే తెలుసా' అంటూ సాగిన పాటలో రాజ్ తరుణ్, మనీషా జంట ఎలా కలుసుకుంటారనే దానిపై ఆసక్తిని పెంచేలా ఉంది. సింగీతం శ్రీనివాస్, అభిరామి, లీలా శాంసన్, వీటీవీ గణెళిష్, హైపర్ ఆది, కృష్ణ భగవాన్, గోపరాజు రమణ, శ్రీకాంత్ అయ్యంగార్, సుదర్శన్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ మూవీ రిలీజ్ డేట్‌ను త్వరలోనే అనౌన్స్ చేయనున్నారు.

## మల్టీస్టారర్ మూవీలో నాగశౌర్య



త్వరలోనే ఒక పెద్ద మల్టీ స్టారర్ సినిమా ప్రారంభం కానుంది అని తెలుస్తోంది. ఇందులో మలయాళం సూపర్ స్టార్ దుల్కర్ సల్మాన్, తెలుగు నటుడు నాగశౌర్యలతో పాటుగా రష్మిక మందన్న కూడా ప్రధాన పాత్రలో ఒక మల్టి స్టారర్ సినిమా మొదలవబోతోంది అని, ఈ సినిమాని ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాకి దర్శకుడిగా ఒక యువకుడు రవి అనే అనే ఒక యువకుడు పరిచయం అవుతున్నట్టుగా సమాచారం. రవి ఇంతకు ముందు దర్శకుడు పరశురామ్ దగ్గర ఒక సినిమాకి పని చేసిన ట్టుగా తెలుస్తోంది. అతని ఒక కొత్త కథని రాసుకొని అది దుల్కర్ సల్మాన్ కి వినిపించినట్టుగా తెలుస్తోంది. దుల్కర్ కి ఆ కథ నచ్చి వెంటనే ఆ సినిమా చేద్దామని చెప్పారని, ఆ తరువాత నాగ శౌర్య కూడా అందులో ఒక ప్రధాన పాత్రలో కనపడతారని, వీరికి తోడుగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న కూడా ఇంకో ప్రధాన పాత్రలో కనిపించబోతోంది తెలిసింది. కథ వినగానే పైన చెప్పిన నటీనటులు ఎంతో ఆసక్తికాగా ఈ సినిమా చెయ్యాలన్న కుతూహలం కనబరిచారని తెలుస్తోంది. వీరితో పాటుగా ఇందులో ఇంకొక కథానాయిక కూడా ఉంటుందని, అలాగే ప్రముఖ క్యారెక్టర్ నటులు రమ్య కృష్ణ, సత్య రాజ్, రావు రమేష్ లతో పాటు ఇంకా ప్రముఖ క్యారెక్టర్ నటులు ఇందులో ఉంటారని తెలుస్తోంది. ఈ సినిమా ఒక హై బ్జడెట్ సినిమాగా రూపు దిద్దుకుంటోందని, ఈ సినిమా కథకి చాలామంది నటులు అవసరం ఉందని కూడా తెలిసింది. దర్శకుడు రవి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నదని, కొత్తవాడైన అతనికి కథపై చాలా క్లారిటీ ఉందని, అలాగే సినిమా ఎలా చెయ్యాలో కూడా ఇంకా క్లారిటీ ఉందని, ఈ సినిమాకి స్క్రీన్ ప్లే ప్రధానంగా ఒక ఆకర్షణ అని, అందుకే ఇదొక మల్టి స్టారర్ సినిమాగా తెరకెక్కించనున్నాడని అర్థం అవుతోంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, CELL : +91 80742 79741